thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 86 కరీంనగర్ గురువారం, 5 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కర్ణాటక హనీట్రాప్‌పై సుప్రీంలో పిల్

బెంగళూరు : కర్ణాటకలో ఇద్దరు మంత్రులు సహా వివిధ పార్టీలకు చెందిన 48 మంది ఎమ్మెల్యేలతో పాటు న్యాయమూర్తులు, కేంద్ర నాయకులపై హనీట్రాప్ జరిగిందంటున్న అంశంపై స్వతంత్రంగా విచారణ జరిపించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. జారండ్‌లోని ధన్‌బాద్ నివాసి వినయ్‌కుమార్ దీన్ని దాఖలు చేశారు. తనపై హనీట్రాప్ జరిగిందని కర్ణాటక మంత్రి రాజణ్ణ శాసనసభలో స్వయంగా ప్రస్తావించడం, మీడియాలో వచ్చిన కథనాలను ఉటంకించారు.

దీనిని అత్యవసరమైనదిగా భావించి, విచారణ జరపాలని కోరారు. స్పందించిన సీజేఐ జస్టిస్ ఖన్నా ధర్మాసనం ఒకట్రెండు రోజుల్లోనే విచారణ చేపడతామని తెలిపింది.

# సరిహద్దుల నుంచే...

## పాక్ హద్దులేమిటో చెప్పనున్న మోడీ!



## మోదీ ప్రసంగంపై ఆసక్తిగా ఎదురు చూస్తున్న దేశ ప్రజలు..!

## రేపు కాశ్మీర్ పర్యటనకు ప్రధాని...

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జమ్మూ అండ్ కాశ్మీర్ టూర్ పెట్టుకున్నారు. ఈ నెల 6వ తేదీన ప్రధాని పర్యటన షెడ్యూల్ ఖరారు అయింది. జమ్మూ అండ్ కాశ్మీర్ కి ఇప్పటికే అనేకసార్లు మోడీ వెళ్ళారు. కానీ ఈసారి టూర్ మాత్రం ప్రత్యేకం అని చెప్పాలి. ఎందుకంటే ఏప్రిల్ 22న జమ్మూలోని పహిల్గాం లో ఉగ్రవాదులు దాడులు చేసి అమాయకులు అయిన 27 మంది పర్యాటకులని పొట్టన పెట్టుకున్నారు. దీంతో ఇది ప్రపంచాన్నే నివ్వెర పరచే అత్యంత కిరాతకంగా నిలిచింది. ప్రపంచమంతా భారత్ కి అండగా ఉంటూ ఉగ్ర ఘాతుకాన్ని ముక్త కంఠంతో ఖండించాయి. ఇక ఈ ఘటన తరువాత పదిహేను రోజుల తేడాలో మే 7న భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో దాయాది దేశం అయిన పాకిస్తాన్ కి బుద్ధి వచ్చేలా ఎయిర్ సర్జికల్స్ చేసి నోరు మూయించింది. అంతే కాదు సింధు నదీ జలాలను సైతం నిలుపు చేసి పాక్ గొంతు ఎండిపోయేలా చేసింది. ఇక దౌత్యపరంగా ప్రపంచ దేశాల మద్దతు కూడగడుతోంది. ఇవన్నీ ఇలా ఉంటే పహిల్గాం లో ఉగ్ర దాడి తరువాత హెూం మంత్రి అమిత్ షా రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అనేక సార్లు జమ్మూ అండ్ కాశ్మీర్ లో పర్యటించారు. వారు ఉగ్ర దాడి జరిగిన ప్రాంతాన్ని సైతం సందర్శించారు. అక్కడ నుంచే పాక్ కి గట్టి హెచ్చరికలను జారీ చేశారు. ఇక ప్రధాని నరేంద్ర మోడీ అయితే ఉగ్ర దాడి జరిగిన 43 రోజుల తరువాత జమ్మూ అండ్ కాశ్మీర్ టూర్ చేస్తున్నారు. ఆయన ఈ సందర్భంగా కాశ్మీర్ రాజధాని అయిన శ్రీనగర్ లో వందేమాతరం రైలుని పచ్చ జెండా ఊపి ప్రారంభిస్తారు. నిజానికి ఈ కార్యక్రమం ఏప్రిల్ 19నే జరగాల్సి ఉంది. కానీ అప్పట్లో వాతావరణం అనుకూలించకపోవడంతో రద్దు చేసుకున్నారు. ఈలోగా ఉగ్రదాడి జరగడంతో ఇప్పటిదాకా కుదరలేదు అని అంటున్నారు. ఈ కార్యక్రమంతో పాటు చినాబ్ రైల్వే బ్రిడ్జిని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభిస్తారు, అనేక ఇతర అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుడతారు. అదే విధంగా శ్రీ మాతా వైష్ణో దేవి కుత్రా రైల్వే స్టేషన్ నుంచి శ్రీనగర్ వరకూ భారత్ ప్రత్యేక కాశ్మీర్ ఎడిషన్ ని ప్రారంభిస్తారు. ఇక ఉగ్రదాడి జరిగిన గడ్డ మీద నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏమి మాట్లాడుతారు అన్న చర్చ అంతటా సాగుతోంది. ఇప్పటికే గుజరాత్, బీహార్ యూపీ పర్యటనలలో ప్రధాని మోడీ పాక్ మీద తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇచ్చారు. పాక్ విషయంలో తన పోరాటం ఎప్పటికీ ఆగదని ఆపరేషన్ సిందూర్ ని కొనసాగించి తీరుతామని కూడా స్పష్టం చేశారు. ఇపుడు ఏకంగా కాశ్మీర్ లోనే ప్రధాని పాక్ కి గట్టి హెచ్చరిక జారీ చేస్తారు అని అంటున్నారు. అంతే కాదు ఆయన సరిహద్దుల నుంచే పాక్ హద్దులేమిటో తెలియచేస్తారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ప్రధాని కాశ్మీర్ పర్యటనకు పెద్ద ఎత్తున భద్రత కల్పిస్తున్నారు. మొత్తానికి ఈ నెల ఆరున ప్రధాని కాశ్మీర్ టూర్ అయితే అందరిలో ఆసక్తిని పెంచుతోంది.



## జూలై 21 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంటు వర్షాకాల సమావేశాలు

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలను ప్రకటించింది. జూలై 21 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఆపరేషన్ సింధూర్, పహల్గాం ఉగ్రవాద దాడిపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కీలకమైన బీమా సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశముందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 100 శాతానికి పెంచుతున్నట్లు తెలుస్తోంది. మీడియా నివేదికల ప్రకారం, బిల్లు ముసాయిదా సిద్ధంగా ఉంది. ఇది త్వరలో ఆమోదం కోసం కేబినెట్ ముందుకు రానుంది. క్యాబినెట్ ఆమోదం పొందిన తర్వాత ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టే ప్రక్రియను ప్రారంభిస్తుంది.




బెంగళూరు: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా పెను విషాదం చోటు చేసుకుంది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్‌లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్-2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందగా, 50 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఆరుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. తొక్కిసలాట ఘటనతో ఆర్సీబీ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. చిన్నస్వామి స్టేడియంవైపు వెళ్లే మెట్రో, ఇతర వాహనాలను నిలిపివేశారు.

**బెంగళూరు విమానాశ్రయంలో ఘనస్వాగతం..** ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవేరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి ఆర్సీబీ జట్టుకు స్వాగతం పలికారు. విరాట్ కోహ్లీ, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్, దినేశ్ కార్తిక్‌లకు ఆయన పుష్పగుచ్ఛం అందించి వెల్‌కమ్ చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరుకుంది. ఈ క్రమంలో వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆర్సీబీ ఆటగాళ్లు బస్సులో వస్తున్న మార్గంలోనూ అభిమానులు సందడి చేశారు.



## టెన్షన్ పెంచుతున్న సమావేశం

## అందరి దృష్టి క్యాబినెట్ సమావేశంపైనేనా ?

# నేడు క్యాబినెట్ భేటీ!

## పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

హైదరాబాద్ : తెలంగాణలో అన్నీ రాజకీయపార్టీల దృష్టి క్యాబినెట్ సమవేశపైనే ఉంది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రేవంత్ రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరగబోతోంది. ప్రతినెలా జరిగే క్యాబినెట్ సమావేశానికి ఈసారి ఎందుకింత ప్రాధాన్యత ? ఎందుకంటే మంత్రివర్గ సమావేశంలో కొన్ని కీలకమైన అంశాలపై చర్చ జరగబోతోంది కాబట్టే. రాజీవ్ యువ వికాశం, వానాకాలం పంటలు, ఇందిరమ్మ ఇళ్ళ పంపిణీ-నిర్మాణం, భూభారతిపై సమీక్ష, కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ రిపోర్టు, ప్రాజెక్టు వినియోగం విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టి అథారిటి(ఎన్డీఎస్ఏ) రిపోర్టు, ఉద్యోగుల డిమాండ్లపైన మంత్రివర్గ సమావేశంలో చర్చలుంటాయి. వీటిల్లో కూడా రాజీవ్ యువవికాశం, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, అవకతవకలపై ఎన్డీఎస్ఏ రిపోర్టు చాలా కీలకమైనవన్న విషయం తెలిసిందే. ఎన్డీఎస్ఏ రిపోర్టును బీఆర్ఎస్ కీలకనేతలు కేటీఆం, హరీష్ రావు, కవిత కొట్టిపారేస్తున్నారు. ఎన్డీఎస్ఏ రిపోర్టు కాదని ఎన్డీయే రిపోర్టంటు కేటీఆర్, హరీష్ ఎద్దేవా చేస్తున్న విషయం తెలిసిందే. వీళ్ళు ఎన్డీఎస్ఏ రిపోర్టును ఎందుకు ఎద్దేవా చేస్తున్నారంటే రిపోర్టులోని అంశాలు అలాగున్నాయమరి. కేసీఆర్ ఎంతో ప్రిస్టేజిగా తీసుకుని దగ్గరుండి స్వయంగా పర్యవేక్షించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు పనికిరాకుండా పోయిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు నిర్మించిన మూడేళ్ళల్లోనే పనికిరాకుండా పోయిందంటే వేలాది కోట్ల ప్రజాధనం ఎంతగా వృధా అయ్యిందో అర్ధమవుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుబంధంగా నిర్మించిన మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం ప్రాజెక్టులు కూడా నీటినిల్వకు పనికిరాకుండా పోయాయి. మేడిగడ్డ బ్యారేజీలోని ఒకబ్లాకులో మూడుపిల్లర్లు భూమిలోకి కుంగిపోయాయి. కుంగిపోయిన పిల్లర్లకు పగుళ్ళు వచ్చేశాయి. దీనికారణంగా డ్యాం ప్లాట్ ఫారమ్ కూడా చీలికలు వచ్చేశాయి. అందుకనే మేడిగడ్డ బ్యారేజీ నీటినిల్వకు పనికిరాదు. ప్రాజెక్టును క్షుణ్ణంగా పరిశీలించిన ఎన్డీఎస్ఏ నిపుణులు కాళేశ్వరం, మేడిగడ్డ నీటినిల్వకు పనికిరాదని తేల్చేశారు. పిల్లర్లకు రిపేర్లుచేసినా నిలిచేది అనుమానమే అన్నారు. అలాగే బ్యారేజీ వాడకానికి చాలా సూచనలు చేశారు. నివేదిక మొత్తం తమకు వ్యతిరేకంగా ఉందికాబట్టే కేసీఆర్, కేటీఆర్, హరీష్, కవితలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. కాళేశ్వరం అవినీతి, అవకతవకలపై విచారిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన విచారణలో ఎన్డీఎస్ఏ రిపోర్టును పరిగణలోకి తీసుకున్నది. విచారణ పూర్తయిన తర్వాత కమిషన్ ఇవ్వబోయే రిపోర్టులో ఎన్డీఎస్ఏ రిపోర్టు ప్రభావం ఉంటుందన్న ఆలోచనే కారుపార్టీ అగ్రనేతల్లో టెన్షన్ పెంచేస్తోంది. తమలోని టెన్షన్ను దాచిపెట్టేందుకే ప్రభుత్వంతో పాటు ఎన్డీఎస్ఏ రిపోర్టుపై ఎదురుదాడి చేస్తున్నారు. ఇంతటి కీలకమైన రిపోర్టును మంత్రివర్గం చర్చించబోతోంది. మంత్రివర్గం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్న టెన్షన్ గులాబిపార్టీలో పెరిగిపోతున్నట్లుంది. అలాగే భూభారతి డెవలప్మెంట్లపైన కూడా మంత్రివర్గం చర్చించబోతోంది. కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన ధరణి పోర్టల్ స్థానంలో రేవంత్ ప్రభుత్వం భూభారతిని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ధరణి పోర్టల్ ఆధారంగా అప్పట్లో జరిగిన అధికార దుర్వినియోగం, అవినీతిపైన కూడా మంత్రివర్గం చర్చించే అవకాశముంది. ఇంతటి కీలకమైన అంశాలపైన క్యాబినెట్ చర్చించబోతోంది కాబట్టే అందరి దృష్టి ఇపుడు గురువారం జరగబోయే సమావేశంపైన ఉంది. మరి చర్చలు ఎలాగుంటాయో ? క్యాబినెట్ ఏమి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.



## కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం కమిషన్: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: రాజకీయ దురుద్దేశంతోనే మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. నోటీసులను నిరసిస్తూ ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. ఆయనకు ఇచ్చారంటే మొత్తం తెలంగాణకు ఇచ్చినట్లే అని పేర్కొన్నారు. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడమే కేసీఆర్ చేసిన తప్పా అని నిలదీశారు. "అది కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్. కాళేశ్వరం పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుంది. కేసీఆర్‌ది గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టు నిర్మించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం కమిషన్ వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయట్లేదు. తెలంగాణ నీళ్లను ఏపీ తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించట్లేదు. గోదావరి-పెన్నా అనుసంధానం పేరిట నీళ్ల తరలింపును అడ్డుకోవాలి. భాజపాలో ఉన్న తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లాడకపోవడం శోచనీయం. గోదావరి-బనకచర్లను ఆపే బాధ్యతను ఆయన తీసుకోవాలి. కాళేశ్వరానికి జాతీయ హోదా తీసుకొచ్చే బాధ్యతను కూడా ఈటల తీసుకోవాలి" అని కవిత అన్నారు.



## ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ రైతుల ఆందోళన

రాజోలి: మండలంలోని పెద్ద ధన్వాద వద్ద ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతులు చేస్తున్న ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. కొంతకాలంగా 12 గ్రామాల ప్రజలు పరిశ్రమను వ్యతిరేకిస్తుండగా మంగళవారం గాయత్రి కంపెనీ వారు పరిశ్రమ ఏర్పాటుకు కూలీలను తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన ఆయా గ్రామాల రైతులు బుధవారం పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతానికి చేరుకోవడంతో భారీగా పోలీసులు మోహరించారు. అయినప్పటికీ రైతులు, మహిళలు, పెద్ద ఎత్తున ఆందోళన చేస్తూ పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతానికి వెళ్లి వారు వేసుకున్న టెంట్లను పీకేసి సామగ్రిని ధ్వంసం చేశారు. అలాగే అక్కడున్న కూలీలను రాళ్లతో తరిమికొట్టారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై అదిరిపోయే అప్డేట్.. మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



ఖమ్మం జిల్లా: ఇందిరమ్మ ఇళ్లలో అర్హులందరికీ న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతలో భాగంగా అందజేస్తున్నామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, పేదవారి పట్ల ప్రేమ అభిమానాలు ఉన్నాయని తెలిపారు. ఇవాళ(బుధవారం) ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల సత్యనారాయణపురంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. వచ్చే నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా ఉండి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఆడబిడ్డ, తమ్ముడి కళ్లల్లో ఆనందాన్ని చూస్తుంటే భావోద్వేగానికి లోనవుతున్నామని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే మంచి పనిచేస్తే వారి నుంచి వచ్చే స్పందన గొప్పగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా సన్నబియ్యం ఇస్తున్నామని వెల్లడించారు. పది సంవత్సరాల్లో మాజీ సీఎం కేసీఆర్‌కి రేషన్ కార్డులు కూడా ఇవ్వాలనే ఇంగిత జ్ఞానం లేదని ధ్వజమెత్తారు.

ఇందిరమ్మ ప్రభుత్వంలో 19 లక్షల మంది పేర్లను కొత్తగా రేషన్ కార్డులో జమచేశామని ప్రకటించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని గత కేసీఆర్ ప్రభుత్వంలో అప్పుల్లోకి నెట్టారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ధనిక రాష్ట్రంలో రూ.8 లక్షల 19 వేల కోట్ల అప్పు చేసి పోతే.. ప్రతి నెల రూ.6,500 కోట్ల వడ్డీని తమ ప్రభుత్వం కడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల మాదిరిగా పేదోళ్ల గురించి మొసలి కన్నీరుని ఇందిరమ్మ ప్రభుత్వం కార్చబోదని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని మండిపడ్డారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ఊకదంపుడు ఉపన్యాసాలు, కాలయాపన చేసే కబుర్లు చెపితే ప్రజలు నమ్మరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు.

గత పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ఆయన కుటుంబ సభ్యులు కట్టుకున్న ప్యాలెస్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు నివసించే బంగ్లాల మీద పెట్టిన ఖర్చు, శ్రద్ధ పేదవారి ఇంటి మీద ఎందుకు పెట్టలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో రూపాయి ఖర్చు పెడితే రాజకీయంగా ఏం లాభం వస్తోందనే ఆలోచించారని అన్నారు. పేదవారికి ఖర్చు పెట్టె ప్రతి రూపాయి వారికి అందుతుందా లేదా అని కూడా కేసీఆర్ కనీసం ఆలోచించలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.

## నోరున్న కార్పొరేటర్లకే నిధులిచ్చే పద్ధతి మారాలి: ఎంపీ ఈటల



హైదరాబాద్: జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా కొనసాగుతోంది. హైదరాబాద్ మహా నగరంలో సమస్యలపై కార్పొరేటర్లు , ఎక్స్‌అఫిషియో సభ్యులు, మేయర్, డిప్యూటీ మేయర్, అధికారులంతా కలిసి చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో వీధి దీపాలు, నాలాల విస్తరణ, వరదల విలయం, ట్రాఫిక్ ఇబ్బందులు సహా పలు అంశాలపై ప్రశ్నలు, సమాధానాలు కొనసాగుతున్నాయి.

ఈ సందర్భంగా భాజపా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. నగరంలోని రైల్వే క్రాసింగ్‌ల వద్ద సమస్యలు పరిష్కరించాలని సూచించారు. నోరున్న కార్పొరేటర్లకే నిధులిచ్చే పద్ధతికాకుండా.. పార్టీలతో సంబంధం లేకుండా సమస్యలు ఉన్న అన్ని ప్రాంతాలకు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. మూసీ పునరుజ్జీవంలో కేంద్రం సహకారానికి ఈటల కృషిచేయాలని అడగ్గా.. అభివృద్ధికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టాక ఆర్వీ కర్ణన్ తొలిసారి హాజరయ్యారు.



## భారత్ దౌత్యయుద్ధం.. మలేసియాలో పాక్ పాచిక పారలేదు

పాకిస్థాన్ ప్రాయోజిత తీవ్రవాదం, ఆపరేషన్ సిందూర్‌పై వివిధ దేశాలకు వివరించడానికి పార్లమెంటు సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాలు ఆయా దేశాల్లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. భారత్ చేస్తోన్న ఈ ప్రయత్నాలను అడ్డుకునేందుకు దాయాది పన్నిన కుయుక్తులకు ఎదురుదెబ్బ తగిలింది. జనతాదళ్(యూ)కు చెందిన పార్లమెంటు సభ్యుడు సంజయ్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష దౌత్య ప్రతినిధి బృందం మలేసియా లో నిర్వహించాలనుకున్న కార్యక్రమాలన్నింటిని రద్దు చేయాలంటూ పాక్ చేసిన అభ్యర్థనను పట్టించుకోలేదు. ప్రణాళిక ప్రకారం సంజయ్ బృందం పాల్గొనాలనుకున్న 10 కార్యక్రమాల రద్దు కోసం పాక్ ఎంబసీ మలేసియా ప్రభుత్వాన్ని కోరింది. ఈ సమయంలో మతం అంశాన్ని ముందుపెట్టింది. "మనవి ఇస్లాం దేశాలు. భారత ప్రతినిధుల మాటలు వినకండి. ఆ దేశ బృందం కార్యక్రమాలను రద్దు చేయండి" అని అభ్యర్థించింది.

దీంతోపాటు కశ్మీర్ అంశం ఐక్యరాజ్యసమితి పరిశీలనలో ఉందని కొన్ని దేశాలను భారత్‌కు దూరం చేసే ప్రయత్నాలు చేసింది. కానీ మలేసియా మాత్రం ఇవేవీ పట్టించుకోలేదు. తమ దేశంలో భారత ఎంపీలు కార్యక్రమాలు ఏర్పాటుచేసుకోవడానికి అనుమతించింది. దాంతో మన బృందం పాక్ ప్రేరేపిత తీవ్రవాదంపై అక్కడి ప్రభుత్వానికి అవగాహన కల్పించడంతోపాటు భారత్ తీసుకుంటున్న చర్యల్నీ వివరించింది. ఆ సమావేశాల దృశ్యాలను సంజయ్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. మలేసియాతో పాటు జపాన్, దక్షిణ కొరియా, ఇండోనేసియా, సింగపూర్‌లలో ఈ బృందం పర్యటిస్తోంది.



## లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఇద్దరి మృతి.. 20 మందికి గాయాలు

చౌటుప్పల్ గ్రామీణం: విజయవాడ-హైదరాబాద్ హైవేపై రోడ్డు ప్రమాదం జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కైతాపురం వద్ద ఆగి ఉన్న లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు ఓ మహిళా ప్రయాణికురాలు మృతిచెందారు. మరో 20 మందికి గాయాలయ్యాయి. ట్రావెల్స్ బస్సు విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ.. బ్రేక్‌డౌన్ కావడంతో రోడ్డుపై నిలిచిపోయింది.

అదే సమయంలో హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు.. ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు అక్కడికి చేరుకుని రాకపోకలను పునరుద్ధరించారు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుల వివరాలు తెలియరాలేదు.



## కలుషితాహారం ఘటన.. 18 మంది ఉస్మానియాకు తరలింపు

హైదరాబాద్: ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో కలుషితాహారం ఘటనలో మంగళవారం ఒక రోగి మృతి చెందడంతో పాటు 70 మంది అస్వస్థతకు గురయ్యారు. బుధవారం కూడా పలువురు రోగులు డయేరియా లక్షణాలతో బాధపడుతున్నారు. వీరిలో 18 మందిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కలుషితాహార ఘటనపై ఎర్రగడ్డ ఆసుపత్రిలో డీఎంఈ, డీఎంహెచ్‌వో, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. తాగునీరు కలుషితమైందా? అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపారు.

## ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజన్.. మంత్రి దామోదర్ ఏమన్నారంటే..



హైదరాబాద్: ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ అవతరణ దినోత్సవం (జూన్2)రోజున ఫుడ్ పాయిజన్ ఘటన జరిగిందని తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 92 మంది రోగులు ఫుడ్ పాయిజన్ కారణంగానే అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో అస్వస్థతకు గురైన బాధితులను మంత్రి దామోదర ఇవాళ(బుధవారం) పరామర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో మంత్రి మాట్లాడారు. ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మంత్రి దామోదర మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్‌ను తొలగించాలని మంత్రి దామోదర ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. అస్వస్థతకు గురైన వారందరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని చెప్పుకొచ్చారు. డైయిట్ కారణంగానే ఈ ఫుడ్ పాయిజాన్ జరిగినట్లుగా తెలుస్తోందని అన్నారు. ఆ రోజు ఒక స్వీట్ కూడా అదనంగా రోగులకు ఇచ్చారని వివరించారు మంత్రి దామోదర రాజనర్సింహ. అనారోగ్యం పాలైన వారిలో తీవ్రంగా ఉన్న 18 మందిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని మంత్రి దామోదర రాజనర్సింహ వివరించారు. మిగతా రోగులని గాంధీ, ఉస్మానియాతో పాటు మొత్తం ఆరు వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయని వెల్లడించారు. అనారోగ్యం పాలైన వారి ప్రాణాలకు ప్రమాదం లేదని.. వారు మరో రెండు రోజుల్లో కోలుకుంటారని వైద్యులు తెలిపారని చెప్పారు. ఇక్కడ డైట్ చూసుకునే కాంట్రాక్టర్ పనితీరు సైతం సరిగా లేదని సమాచారం అందిందని.. అతని కాంట్రాక్ట్ రద్దు చేశామని తెలిపారు మంత్రి దామోదర రాజనర్సింహ. జరిగిన ఘటనపై ఒక కమిటీని నియమించాయని తెలిపారు. కమిటీ రిపోర్టు రాగానే బాధ్యులపై చర్యలు ఉంటాయని అన్నారు. ఇప్పటికే ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పారు. చనిపోయిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. కరోనాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి దామోదర రాజనరసింహ పేర్కొన్నారు.




## మరో యూట్యూబర్ అరెస్ట్..

చండీగఢ్: పాక్ గూఢచర్యం నెట్‌వర్క్‌పై కేంద్రం కొరడా ఝుళిపిస్తోంది. దీంతో పలు రాష్ట్రాల్లో వరుస అరెస్టులు కొనసాగుతున్నాయి. పాకిస్థాన్‌తో సంబంధాలు సాగిస్తున్న ఆరోపణలపై యూట్యూబర్ జస్బీర్ సింగ్‌ను పంజాబ్ పోలీసులు బుధవారంనాడు అరెస్టు చేశారు. హర్యానా ఇన్‌ఫ్లుయెన్సర్ జ్యోతి మల్హోత్రాను ఇదే ఆరోపణలపై ఇటీవల అరెస్టు చేశారు. అధికారుల వివరాల ప్రకారం, పంజాబ్‌లోని రూప్‌నగర్ జిల్లా మహ్లాన్ గ్రామానికి చెందిన జస్బీర్ సింగ్ 'జాన్ మహల్' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నడుపుతున్నాడు. దీనికి 11 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. మే 13న ఇండియా నుంచి బహిష్కరించిన పాకిస్థాన్ హైకమిషన్ మాజీ అధికారి షకీర్క అలియాస్ జుట్ రాంధావాతో సహా పలువురు పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌తో జస్బీర్ సింగ్‌కు సంబంధాలున్నట్టు కనుగొన్నారు. పాక్ రాయబార కార్యాలయం అధికారి ఎహసాన్ ఉర్ రహీం అలియాస్ డానిష్‌తో సింగ్‌కు సంబంధాలున్నాయని, డానిష్ ఆహ్వానం మేరకు ఢిల్లీలో జరిగిన పాకిస్థాన్ జాతీయ దినోత్సవంలో కూడా సింగ్ పాల్గొన్నాడని, అక్కడ పాకిస్థాన్ ఆర్మీ అధికారులు, వ్లోగర్లను సింగ్ కలుసుకున్నాడని విచారణలో తేలింది. 2020,2021,2024లో మూడు సందర్భాల్లో సింగ్ పాకిస్థాన్‌కు వెళ్లాడని, ఆయనకు పాకిస్థాన్ బేస్డ్ కాంటాక్టులు ఉన్నట్టు అతని వద్ద స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాల ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలిందని పంజాబ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) గౌరవ్ యాదవ్ తెలిపారు. గూఢచర్యం కేసులో ఇటీవల అరెస్టయిన హిసార్‌కు చెందిన 33 ఏళ్ల మల్హోత్రాతో సింగ్‌కు సంబంధాలున్నాయని, మల్హోత్రా అరెస్టుతో సింగ్ తనకు పాకిస్థాన్ ఆపరేటివ్స్‌తో ఉన్న సంబంధాలకు చెందిన సమాచారాన్ని డిలీట్ చేసేందుకు ప్రయత్నించాడని డీజీపీ తెలిపారు. సింగ్‌పై మొహాలీలోని స్టేట్ స్పెషల్ ఆపరేషన్ సెల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి, అనంతరం ఆపరేషన్ సింధూర్ తర్వాత పాక్‌తో సంబంధం ఉన్న గూఢచార్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపిడికిలి బిగించారు.

చురకలు



# హిందూ జాతీయవాది గోల్వాల్కర్ - జూన్ 5...గోల్వాల్కర్ గురూజీ వర్ధంతి



గురూజీగా ప్రసిద్ధులైన మాధవ్ రావ్ సదాశివ రావ్ గోల్వాల్కర్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కు రెండవ సర్ సంఘ్ చాలక్.) గోల్వాల్కర్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులలో ఒకరిగా పరిగణించ బడ్డారు . ఆర్ఎస్ఎస్‌గా నేడు అందరికీ సుపరిచితమైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బహు ముఖాలుగా విస్తరించడానికి కీలకమైన భూమిక పోషించినవారు గోల్వాల్కర్. " హిందూ రాష్ట్రం " అని పిలువబడే ఒక సాంస్కృతిక దేశం భావనను ముందుకు తెచ్చిన మొదటి వ్యక్తి, ఇది "అఖండ భారత్ సిద్ధాంతం" , భారత దేశంలోని ప్రారంభ హిందూ జాతీయవాద ఆలోచనాపరులలో గోల్వాల్కర్ ఒకరు. గోల్వాల్కర్ మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సమీపంలోని రామ్‌టెక్‌లో మరాఠీ కర్హాడే బ్రాహ్మణ కుటుంబంలో సదాశివరావు, లక్ష్మీబాయి దంపతులకు ఫిబ్రవరి,19-1906 న జన్మించారు. ఆయన తండ్రి పేరు సదాశివ రావ్. తల్లి లక్ష్మీబాయి ఉపాధ్యాయిని. పుట్టినప్పుడు 'మాధవ్' అని పేరు పెట్టారు. ఒక వ్యక్తి పేరు, తర్వాత తండ్రి పేరు, ఇంటి పేరు జోడించడం మహారాష్ట్రలో సంప్రదాయం. అలా మాధవరావు సదాశివరావు గోల్వాల్కర్ అయ్యారు. గోల్వల్కర్ బాల్యాన్ని నాగపూర్ లో గడిపారు. గోల్వాల్కర్ నాగ్‌పూర్‌లోని మిషనరీ ఆధ్వర్యంలో నడిచే విద్యా సంస్థ అయిన హిస్లోప్ కాలేజీలో చేరారు. కళాశాలలో, అతను క్రైస్తవ మతస్తులు హిందూ మతాన్ని అవమానించడంపై మండిపడ్డారు. హిందూ మతం రక్షణ కోసం తపించారు. గోల్వాల్కర్ హిస్‌లాప్ కాలేజీని వదిలి వారణాసిలోని బెనారస్ హిందూ విశ్వ విద్యాల యంలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీని, 1929లో జీవశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. మదన్ మోహన్ మాలవీయచే ప్రభావితు డయ్యారు. గోల్వాల్కర్ సముద్ర జీవశాస్త్రంలో డాక్టరేట్ పొందేందు కు మద్రాసు వెళ్ళారు.ఆయన తండ్రి పదవీ విరమణ కారణంగా దానిని పూర్తి చేయలేక పోయారు. తర్వాత బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో మూడు సంవత్సరాలు జంతుశాస్త్రం బోధించారు. ఆయన గడ్డం, పొడవాటి జుట్టు, సాధారణ వస్త్రం కారణంగా విద్యార్థులు "గురూజీ" అని పిలిచారు. ఆయన జీవితాంతం అదే పేరుతో పిలువ బడ్డారు. గోల్వాల్కర్ నాగ్‌పూర్‌కు తిరిగి వచ్చి, 1937లో న్యాయ పట్టా పొందారు. హెడ్గేవార్, గోల్వాల్కర్‌పై ఎక్కువ ప్రభావం చూపారు. హెడ్గేవార్ ఆయనను లా డిగ్రీని అభ్యసించ మని ప్రోత్సహించారు. 1934లో, హెడ్గేవార్ ఆయనను నాగ్‌పూర్ ప్రధాన శాఖకు కార్యదర్శిగా (కార్యవాహ) నియమించారు. లా ప్రాక్టీస్ చేయడం ప్రారంభించిన తర్వాత, హెడ్గేవార్ ఆయనకు అకోలా ఆఫీసర్స్ ట్రైనింగ్ క్యాంపు నిర్వహణ బాధ్యతలు అప్పగిం చారు. అక్టోబరు 1936లో, గోల్వాల్కర్ పశ్చిమ బెంగాల్‌లోని సర్గాచి రామకృష్ణ మిషన్ ఆశ్రమం కోసం సన్యాసిగా మారడానికి తన న్యాయవాద అభ్యాసాన్ని, ఆరెస్స్ ను విడిచిపెట్టారు. అలా రామకృష్ణ శిష్యుడు మరియు స్వామి వివేకానంద సోదర సన్యాసి అయిన స్వామి అఖండానంద శిష్యుడు అయ్యారు . 1939లో, గురుదక్షిణ ఉత్సవంలో, గోల్వాల్కర్ తర్వాత ప్రధాన కార్యదర్శిగా ( సర్కార్యవాహ , ఆరెస్సెస్ లో ద్వితీయ ముఖ్యమైన స్థానం) హెడ్గేవార్ ప్రకటించి, హెడ్గేవార్ 21 జూన్ 1940న మరణించ దానికి ఒక రోజు ముందు, ఆరెస్సెస్ చీఫ్ గా ఉండమని కోరుతూ ఒక కాగితం ఇచ్చారు. జూలై 3న, నాగ్‌పూర్‌లోని ఐదుగురు రాష్ట్ర స్థాయి సంఘ చాలక్ (డైరెక్టర్లు) హెడ్గేవార్ నిర్ణయాన్ని ప్రకటించారు. గోల్వల్కర్ ఆర్.యస్.యస్. సర్ సంఘ్ చాలక్ అయ్యారు. 30 సంవత్సరాలకు పైగా ఆరెస్సెస్ నాయకులుగా, గోల్వాల్కర్ దానిని భారత దేశం లోని బలమైన మత - రాజకీయ సంస్థలలో ఒకటిగా చేసారు. దాని సభ్యత్వం ఒక మిలియన్‌కు పైగా విస్తరించింది. ఇది 50 ఫ్రంట్ ఆర్గనైజేషన్‌ల ద్వారా రాజకీయ, సామాజిక, మత, విద్యా మరియు కార్మిక రంగాలలోకి విస్తరించింది. సంఘ్ పరివార్ లోని అన్ని సంస్థల వెనుక గోల్వాల్కర్ కృషి ఉంది. గురూజీ 1973 జూన్ 5న న నాగపూర్ లో కాన్సర్ తో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**




చైనా అత్యధిక పెట్టుబడులు పెడితే తమ దేశ ఆర్థికవ్యవస్థ మలుపు తిరుగుతుందని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ పేర్కొన్నారు. చైనా- బంగ్లా వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించిన సదస్సును యూనస్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ ఇన్వెస్ట్‌మెంట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి చైనా వాణిజ్యమంత్రి వాంగ్ వెంటావో ప్రత్యేకఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా యూనస్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా తయారీరంగంలో చైనా కంపెనీలు పేరుగాంచాయన్నారు. చైనాతో కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. తమ దేశంలో బీజింగ్ పెట్టుబడులు పెడితే దేశ ఆర్థికవ్యవస్థ మలుపు తిరుగుతుందన్నారు. ఇక, దేశ ఆర్థికవృద్ధిని మెరుగుపరిచి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా తాము ఉన్నట్లు తెలిపారు. పెట్టుబడులు మెరుగుపరచడం, చట్టాలను క్రమబద్ధీకరించడం, వ్యాపార కార్యకలాపాలకు అనుకూలమైన వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు వెల్లడించారు. ఇరుదేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు.

ఈసందర్భంగా బంగ్లాదేశ్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని చైనా కంపెనీలకు సూచించిన ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌కు యూనస్ కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఇటీవల యూనస్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కూడా భేటీ అయ్యారు. బంగ్లా ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి చైనా నుంచి పెట్టుబడులను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తీస్తా నది సమగ్ర నిర్వహణ, పునరుద్ధరణ ప్రాజెక్ట్‌లో పాల్గొనడానికి చైనా కంపెనీలను బంగ్లాదేశ్ స్వాగతించింది. డ్రాగన్ ఇస్తున్న రుణాలకు వడ్డీలను తగ్గించాలని, ఆ దేశ నిధులు అందుతున్న ప్రాజెక్టులకు కమిట్‌మెంట్ ఫీజ్‌ను మాఫీ చేయాలని, పలు అభివృద్ధి ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వాలని కోరారు.




ఐరాస భద్రతా మండలి ఉగ్రజాబితాలో పడకుండా లష్కరే తయ్యిబా ముసుగు సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)ను చైనా ఎంత కాపాడినా.. తాము మాత్రం వదిలిపెట్టమని అఖిలపక్ష దౌత్యబృంద సభ్యుడు, ఎంపీ శశిథరూర్ తేల్చి చెప్పారు. తాము ఆ సంస్థపై వీలైనప్పుడల్లా ఐరాస ఆంక్షల కమిటీ దృష్టికి తీసుకొస్తామన్నారు. మండలి తీర్మానాలు, ప్రెస్ స్టేట్‌మెంట్లలో టీఆర్ఎఫ్‌లో పేరును ప్రస్తావించేలా ప్రోత్సహిస్తామన్నారు.

బ్రెజిల్ దౌత్యవేత్త సెల్సో అమోరిమ్‌తో సమావేశమైన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక ఐరాస భద్రతా మండలి పునర్ వ్యవస్థీకరణ కూడా అవసరమని థరూర్ వ్యాఖ్యానించారు. "పాకిస్థాన్ ప్రభుత్వం చైనా అండతో ఆ పేరును తప్పించారు. కనీసం దాని ప్రస్తావన కూడా లేదు. ఈ పరిస్థితిని మార్చడానికి మనం (భారత్, బ్రెజిల్) భద్రతా మండలిలో లేము. ఈ పరిస్థితి మారాలి. మనిద్దరం మండలిలో ఉండాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

**భారత్ వెంటే బ్రిటన్...** ఇక తరచూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాను భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ జరిపించానని చెప్పుకోవడంపై థరూర్ స్పందించారు. తమ విషయంలో ఒకరు వచ్చి మధ్యవర్తిత్వం చేయాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ పాకిస్థాన్‌కు ఏమైనా అవసరం ఉండొచ్చేమోనని పేర్కొన్నారు. "మాకు ఎవరూ ఘర్షణను ఆపమని హితవు పలకాల్సిన అవసరం లేదు. పాకిస్థాన్‌కు ఆ అవసరం ఉందేమో. మేము ఏమీ యుద్ధం కోరుకోవడం లేదు" అని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌కు చెందిన దౌత్య బృందాలు ప్రపంచంలోని పలు దేశాల్లో పర్యటించి పరిస్థితిని వివరిస్తున్నాయి. ఈక్రమంలో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నేతృత్వంలోని బృందం ప్రస్తుతం బ్రెజిల్‌లో పర్యటిస్తోంది. రేపు ఈ బృందం అమెరికాకు చేరుకోనుంది. ఇక కొలరాడో ఘటనపై కూడా థరూర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం కొలరాడోలోని బోల్డర్ కౌంటీలో హమాస్ చెరలోని బందీలకు సంఘీభావం తెలుపుతున్న యూదులపై ఓ వ్యక్తి మండే స్వభావం గల ద్రావణాలు ఉన్న సీసాలను విసిరాడు. ఈ ఘటనలో 8 మందికి గాయాలయ్యాయి.

# ఉక్రెయిన్-రష్యా సైనికుల ఊచకోత..

## గంటకు 60 మంది ప్రాణాలు బలి



ఓవైపు శాంతి చర్చలు జరుగుతూనే ఉన్నాయి.. మరోవైపు భీకరమైన దాడులు జరుగుతున్నాయి.. ఓవైపు నాయకులు యుద్ధం విరమణపై ప్రకటనలు చేస్తున్నారు.. మరోవైపు సైనికుల ప్రాణాలు పోతున్నాయి.. ఓవైపు యుద్ధ ఖైదీల మార్పిడి జరుగుతుండగా.. మరోవైపు అణు బాంబు దాడుల హెచ్చరికలూ వినిపిస్తున్నాయి. ఇంతకూ ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో ఏం జరుగుతోంది...? మూడేళ్లకు పైగా సాగుతున్న యుద్ధంలో ఆదివారం ఉక్రెయిన్ ఓ సాహసానికి ఒడిగట్టింది. రష్యా భూభాగంలోకి వెయ్యి కిలోమీటర్లు చొచ్చుకెళ్లి.. సీక్రెట్ ఆపరేషన్ ద్వారా బాంబర్లను ధ్వంసం చేసింది. కేవలం రూ.45 వేల ఖరీదు చేసే 472 డ్రోన్లను వాడింది. దీనికి ప్రతిగా రష్యా కూడా ఉక్రెయిన్ మీద బాంబులు వేసింది. అయితే, రష్యాకు ఉక్రెయిన్ చేసిన నష్టమే ఎక్కువ. ఇదంతా తుర్కియేలో చర్చలు జరుగుతుండగానే కావడం గమనార్హం. ఉక్రెయిన్ తాజా దాడిని రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికాలోని పెరల్ హార్బర్ పై జపాన్ చేసిన దాడితో దీనిని పోలుస్తున్నారు. ఈ దాడి తర్వాతే అమెరికా అణు బాంబు ప్రయోగం చేసిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా రష్యా తాము చేసిన దాడుల్లో 24 గంటల్లో 1,430 మంది ఉక్రెయిన్ సైనికులను హతమార్చినట్లు ప్రకటించింది. అంటే గంటకు 60 మందిని చంపినట్లు అన్నమాట. ప్రతిగా రష్యాకు చెందిన పది లక్షల మంది సైనికులను మూడేళ్లలో తాము హతమార్చినట్లు ఉక్రెయిన్ తెలిపింది. ఇందులో 1100 మందిని గత 24 గంటల్లో చంపినట్లు పేర్కొంది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ పై డ్రోన్లు, క్షిపణులు, సాయుధ పోరాట వాహనాలు, ఫిరంగి తుపాకులను ధ్వంసం చేసినట్టు రష్యా పేర్కొంటోంది. ఇప్పటివరకు తాము రష్యాకు చెందిన 10,811 ట్యాంకులు,22,671 సాయుధ పోరాట వాహనాలు, 50,607 ఇంధన ట్యాంకులు, 28,623 ఫిరంగి వ్యవస్థలు, 1,402 రాకెట్ ప్రయోగ వ్యవస్థలను ధ్వంసం చేసినట్లు ఉక్రెయిన్ తెలిపింది. 1,176 వైమానిక రక్షణ వ్యవస్థలు, 384 విమానాలు, 41 యుద్ధ విమానాలు, 336 హెలికాప్టర్లు, 38,748 డ్రోన్లు, 28 నౌకలు, జలాంతర్గామిని దెబ్బతీశామని టిట్ ఫర్ టాట్ లాగా ప్రకటించింది. తుర్కియేలో సోమవారం రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య కాల్పుల విరమణ చర్చలు జరిగాయి. కానీ, అవి ఫలవంతం కాలేదు.

# దేశంలోనే ఖరీదైన ఫ్లాట్.. ధర రూ.639 కోట్లు.. ఎక్కడంటే?

భారత రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థిరంగా వృద్ధి చెందుతోంది. హైదరాబాద్, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాలు మార్కెట్ విలువలో గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, దేశ ఆర్థిక రాజధాని ముంబైలో భారతదేశంలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ డీల్ పూర్తయింది. భారతదేశానికి చెందిన బహుళజాతి ఫార్మాస్యూటికల్ కంపెనీ USV ప్రైవేట్ ఛైర్‌పర్సన్ లీనా గాంధీ తివారీ, ముంబైలోని వర్లిలో అత్యంత ఖరీదైన డ్యూప్లెక్స్ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేశారు. ఈ ఆస్తి శ్రీ నమన్ రెసిడెన్సీ ప్రాజెక్ట్, నమన్ జానాలో భాగంగా ఉంది. ఇది వర్లిలో నిర్మాణంలో ఉన్న సముద్రం ఎదురుగా ఉన్న ప్రాజెక్ట్. లీనా ఈ ఆస్తిలో రెండు ఫ్లాట్లను (డ్యూప్లెక్స్) రూ. 639 కోట్లకు కొనుగోలు చేసినట్లు సమాచారం.

ఇది 22,572 చదరపు అడుగుల ఫ్లాట్, ఇది చదరపు అడుగుకు రూ. 2.83 లక్షల ధరను సూచిస్తుంది. ఈ డ్యూప్లెక్స్



ఫ్లాట్ సముద్రానికి ఎదురుగా ఉండటం, , ఈ ప్రాజెక్ట్ ముంబైలోనే కాకుండా దేశవ్యాప్తంగా అత్యంత విలాసవంతమైన ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలుస్తుందని అంచనా వేస్తున్నారు. ఇది భారత రియల్ ఎస్టేట్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన అపార్ట్‌మెంట్. హైదరాబాద్ వంటి మెట్రో నగరంలో సాధారణంగా చదరపు అడుగుకు రూ. 10,000 సగటుగా పరిగణించబడే చోట, ముంబైలోని ఈ ఫ్లాట్ షాకింగ్ గా రూ. 2.83 లక్షలకు విక్రయమైంది. లీనా ఒక బిలియనీర్, ఆమె ఆస్తి విలువ సుమారు రూ. 3.9 బిలియన్లు. కాబట్టి, ఆమె వద్ద ఉన్న విస్తారమైన ఆర్థిక వనరులను బట్టి చూస్తే ముంబైలో జరిగిన ఈ మెగా రియల్ ఎస్టేట్ డీల్ ఆమెకు పెద్ద విషయమేమీ కాదు.

# అమెరికాకు సాయం చేయండి..

## 'గోల్డెన్ డోమ్' కోసం ట్రంప్ జపాన్‌కు రిక్వెస్ట్!

అమెరికా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'గోల్డెన్ డోమ్ షీల్డ్ టెక్నాలజీ' తయారీలో తమకు సహకరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జపాన్‌ను కోరినట్లు అమెరికా ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై ట్రంప్, జపాన్ ప్రధానమంత్రితో ఫోన్‌లో మాట్లాడినట్లు పేర్కొన్నాయి.

**అసలు 'గోల్డెన్ డోమ్ షీల్డ్' అంటే ఏంటి?...** 'గోల్డెన్ డోమ్ షీల్డ్' అనేది ఒక అత్యాధునిక రక్షణ వ్యవస్థ. ముఖ్యంగా శత్రు దేశాల క్షిపణులు (మిసైల్స్), లేదా ఇతర దాడుల నుంచి తమ దేశాన్ని రక్షించుకోవడానికి ఈ టెక్నాలజీని ఉపయోగించనున్నారు. ఇది ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఆకాశం నుంచి వచ్చే ప్రమాదాలను గుర్తించి, వాటిని మధ్యలోనే ధ్వంసం చేసే సామర్థ్యం దీనికి ఉంటుంది.



అధ్యక్షుడు ట్రంప్ గతంలోనే ఈ 'గోల్డెన్ డోమ్'ను 1758 డాలర్ల భారీ బడ్జెట్‌తో తీసుకురానున్నట్లు ప్రకటించారు.

**జపాన్‌ను ఎందుకు కోరారు?...** అమెరికా, జపాన్ గతంలో కూడా రక్షణ రంగంలో కలిసి పని చేశాయి. గతంలో ఈ రెండు దేశాలు సంయుక్తంగా బాలిస్టిక్ క్షిపణులు, స్పేస్ వార్‌హెడ్స్ వంటి వాటిని అభివృద్ధి చేశాయి. అంటే, క్షిపణులను, అంతరిక్షంలో ఉపయోగించే ఆయుధాలను తయారు చేయడంలో ఈ రెండు దేశాలకు మంచి అనుభవం ఉంది. జపాన్ టెక్నాలజీలో చాలా ముందుండడంతో 'గోల్డెన్ డోమ్' వంటి సంక్లిష్టమైన ప్రాజెక్టులో జపాన్ సహకారం అమెరికాకు చాలా అవసరమని ట్రంప్ భావించి ఉండవచ్చు. అందుకే జపాన్ ప్రధానమంత్రితో ఫోన్లో మాట్లాడి, సాయం కోరారు.

అమెరికా తన రక్షణ సామర్థ్యాలను మరింత పెంచుకోవాలని చూస్తోంది. గోల్డెన్ డోమ్ షీల్డ్ టెక్నాలజీ గనుక తయారైతే.. అమెరికా భద్రత మరింత పటిష్టంగా మారుతుంది. ఈ ప్రాజెక్టులో జపాన్ భాగస్వామ్యం కావడం వల్ల, జపాన్‌కు కూడా అత్యాధునిక రక్షణ టెక్నాలజీని పొందే అవకాశం ఉంటుంది. ఇది ఇరు దేశాల మధ్య రక్షణ సంబంధాలను మరింత బలపరుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా రక్షణ రంగంలో కొత్త పరిణామాలకు ఇది దారితీయవచ్చు.

## చురకలు

## సంపాదకీయం

# విశ్వ నాయకా... వితండమేలా ?

ఆయన భారత దేశం గర్వించే నటుడు. విశ్వ నటుడిగా పేరు ఉంది. లోక నాయకుడిగా కీర్తి ఉంది మూడేళ్ళ ప్రాయం నుంచి నటననే శ్వాసిస్తూ నటుడిగా తరిస్తూ ఏడున్నర పదుల వయసుకు చేరువ అవుతున్నారు. ఆయనే కమల్ హాసన్. ఆయన తమిళనాడుకు చెందిన వారు అయినా విశ్వ నటుడిగానే కళా ప్రపంచం గుర్తించింది. ఆయనకు ఎల్లలు లేవు అనుకుంది. హద్దులు అంతకంటే అడ్డు రావనుకుంది. అయితే విశ్వనటుడు పెద్దల సభ అయిన రాజ్యసభకు ఎంపికై అవుతున్న వేళ సినీ రంగంలో ఉంటూ సామాజిక సమస్యల మీద తన గళం విప్పుతూ జన చైతన్యాన్ని కోరుకుంటున్న వేళ ఆయన నుంచి రావాల్సిన మాట అది కాదనే అంటున్నారు. ఆయన సందర్భం చూసుకుని అన్నారో లేక యధాలాపంగా అన్నారో తెలియదు కానీ తమిళం నుంచి కన్నడం పుట్టింది అన్నారు. అయితే ఆయన సానుకూల దృక్పథంతోనే ఈ కామెంట్ చేశానని అంటున్నారు. కానీ తమిళుల మాదిరిగానే కన్నడిగులకు కూడా భాషాభిమానం మెండుగా ఉంటుంది అన్నది ఆయన మరచారు. ఆ మాటకు వస్తే ఎవరి మాతృ భాష వారికి గొప్ప. ఆ విషయంలో అన్నీ తెలిసిన కమల్ ఈ తరహా వ్యాఖ్యలు చేయడంతో వివాదంలో చిక్కుకున్నారు. ఆయన యధాలాపంగా అన్నారు అనుకున్నా అవతల వారి మనోభావాలు దెబ్బతింటున్నాయని గ్రహించినపుడు వెంటనే పొరపాటు అయింది అని చెప్పి ఉంటే వ్యవహారం ఇంతదూరం వచ్చి ఉండేది కాదని అంటున్నారు. పైగా ఆయన తాను ఏమీ తప్పు చేయలేదని వితండ వాదన చేయడమే విడ్డూరంగా ఉంది అని అంటున్నారు. ఇక కర్ణాటకలో ఆయన తాజాగా నటించిన చిత్రం థగ్ లైఫ్ సైతం వివాదంలో చిక్కుకుంది. కర్ణాటకలో ఆ మూవీని రిలీజ్ చేయకుండా అడ్డుకుంటామని అక్కడి సంఘాలు ప్రకటించాయి. ఇక కమల్ హాసన్ అయితే కన్నడ హైకోర్టులో సైతం సినిమా రిలీజ్ కోసం పిటిషన్ వేశారు. అయితే హైకోర్టు సైతం కమల్ వ్యాఖ్యలను తప్పు పట్టింది. మీరు ఏమైనా చరిత్రకారులా అని ప్రశ్నించింది. క్షమాపణ చెప్పాలని సూచించింది. అయితే ఎక్కడా తగ్గేది లేదని అదే మంకు పట్టుతో వ్యవహరిస్తున్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు అని ఆయన అంటున్నారు. తమిళం నుంచే కన్నడం పుట్టిందని అనడం ఏ విధంగా ఒప్పుగా ఉందో ఆయనే చెబితే బాగుండేది కదా అంటున్నారు. నిజానికి భాషావేత్తలు కానీ చారిత్రక వేత్తలు కానీ తరచి చూస్తే కన్నడ భాష చాలా ప్రాచీన మైనదిగా ఉందని ఆధారాలతో పాటుగా చెబుతున్నారు. అంతే కాదు కన్నడ భాషకు మూడు వేల ఏళ్ళ చరిత్ర ఉందని అంటున్నారు. మరి దానిని బట్టి అయినా కమల్ హాసన్ తన వ్యాఖ్యలను తప్పో ఒప్పో విశ్లేషించు కోవచ్చు కదా అని అంటున్నారు. ఇదిలా ఉంటే కమల్ హాసన్ వయసులో పెద్ద వారు. సీనియర్ సిటిజన్. అన్నీ తెలిసిన వారు. రేపటి రోజున పెద్దల సభలో ఆయన ఎన్నో విషయాలు మాట్లాడాల్సి ఉంది. అది ఎంతో వైవిధ్యభరితమైన భారత దేశానికి ప్రాతినిధ్యం వహించేటట్టుగా ఉండాల్సి ఉంది. ఇక ప్రజాస్వామ్యం మీద తనకు ఎంతో గౌరవం అని ఆయన అంటారు. ప్రజాస్వామ్యంలో భావ వ్యక్తీకరణ ఎంత హక్కుగా ఉందో అవతల వారి మనోభావాలను గౌరవించడం అంతే స్థాయిలో ఉంటుందని కమల్ వంటి వారికి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం అయితే లేదు. మొత్తానికి చూస్తే తన థగ్ లైఫ్ సినిమాను అవసరమైతే రిలీజ్ చేయకుండా మానుకుంటాను కానీ క్షమాపణలు చెప్పను అన్న కమల్ తీరు పెద్ద ఎత్తున చర్చగా మారింది. ఆయన విశ్వనటుడుగా ఉన్నారు అన్నది మరవరాదని సూచనలు వస్తున్నాయి. మంచి ప్రతిభ కలిగిన నటుడిగా ఉంటూ సమాజ సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చిన కమల్ హాసన్ స్పోర్టివ్ నెస్ ని కూడా కీలకమైన సమయాల్లో చూపించాల్సి ఉందని అంటున్నారు. తను అన్న మాటలో తప్పు లేదని కమల్ భీష్మించుకున్నారు. అయితే ఇది చిన్న సమస్యగానే ఉండదు, ఫుల్ స్టాప్ పెట్టకపోతే ఆయనకే ఇబ్బంది అవుతుందన్న సూచనలు వస్తున్నాయి. మొత్తానికి కమల్ హాసన్ ఈ తరహా వివాదాలలో ఎపుడూ చిక్కుకోలేదు. కానీ తొలిసారి ఆయన ఇలా కార్నర్ అయ్యారో లేక చేశారో తెలియదు కానీ ఆయన తాజా సినిమా కంటే ఇదే హాట్ టాపిక్ అయి కూర్చుంది.

# దశ పాప హర దశమి.. జ్యేష్ఠ బహుళ దశమి గంగావతరణ దినం...




దశమి తిథితో సంబంధ పడి మనకు రెండు పెద్ద పండుగలు ముఖ్యమైనవి. ఒకటి జేష్ట శుద్ధ దశమి కాగా, మరొకటి "విజయ దశమి". రెండూ పది రోజుల పర్యాప్తం అయ్యే పాడ్యమి తిథులతో ప్రారంభమై దశమితో ముగిసే పర్వాలు. జేష్ఠ మాస ఆరంభంలో శుక్ల పక్ష ప్రతిపద నుండి దశమి వరకు "గంగోత్సవాల" పేరుతో, నవరాత్రులు ఆచరించడం, "దశపాప హర దశమి"గా దశమిని అనంతరం "నిర్జల ఏకాదశి" అనుసరించడం సనాతన సంప్రదాయం. జ్యేష్ట శుక్ల దశమి నాడు "గంగావతరణం" జరిగిందని స్మృతి కౌస్తుభం చెబుతున్నది. సోమవారంతో హస్తా నక్షత్రంతో కలసి వచ్చినప్పుడు, "గంగావతరణం" జరిగిందని వాల్మీకి రామాయణం స్పష్టం చేస్తున్నట్లు వ్రతోత్సవ చంద్రిక కారుడు పేర్కొన్నాడు. గంగ దేవలోకంలో "మందాకిని అని, భూలోకంలో నికి "భాగీరథి" అని, పాతాళంలో "భోగవతి"గాను ప్రసిద్ధికెక్కుతుందని బ్రహ్మదేవుడు భగీరథునికి వివరించాడు. అందుకే గంగకు "త్రిపధగ" అనే పేరు వచ్చింది. త్రిపథగ అంటే మూడు లోకాల్లో ప్రవహించేదని అర్ధం. భగీరథుడు తన పిత్రు దేవతల పుణ్య లోకాల ప్రాప్తికై, మొదట బ్రహ్మ ను, తర్వాత శివుని తపస్సుతో మెప్పించిన ఫలితంగా, గంగ బ్రహ్మ ఆదేశానుసారం శివుని జటాజూటం లోనికి వచ్చిపడి, బంధితురాలై, తిరిగి భగీరథుడి అభ్యర్థనపై పరమ శివుడు గంగను హిమాలయ పర్వతాలలో బ్రహ్మదేవుడి చేత నిర్మించ బడిన బిందు సరోవరంలో పడేలా విడిచి పెట్టాడు. నదుల యొక్క మార్గాన్ని నిర్దేశించగల అధికారం ఒక్క బ్రహ్మదేవుడికే "ఉంది. సృష్టి ప్రారంభంలో ఆయనే నది ప్రవాహ మార్గాన్ని నిర్దేశించాడు. బిందు సరోవరం నుండి గంగ ఏడు పాయలుగా చీలి ప్రవహించింది. ఒక పాయ భగీరథుని రథము వెంట పరుగులు తీస్తూ సాగింది. గంగ 7 పాయలుగా విడిపోగా, అందులో మూడుపాయలు తూర్పు దిక్కుకు వెళ్ళి పోయాయి. వాటికి లాధిని, నళిని, పాధిని అని పేర్లు. మూడు పాయలు పశ్చిమ దిక్కుకు వెళ్ళిపోయాయి. అవి సుచక్షువు, సీత, సింధువు అని పిలువ బడుతున్నాయి. మిగిలిన పాయ భగీరథుని వెనుకాల వెళ్ళింది. అదే భాగీరథి. నదులను పూజించే ఆర్యుల ఆచారం నేపథ్యంలోనే "గంగోత్సవం" అనే పేరున నవరాత్రి ఉత్సవాలు "దశహర వ్రతం" పేరున నిర్వహించే ఆచారం అనాదిగా అమలులో ఉంది. గంగా నది నీరు అత్యంత పవిత్రమైంది. ఎన్నాళ్ళు నిలువ వున్నా చెడిపోనిది. అందుకే నిర్మల నదీ జలాలను పూజించి, నదీస్నానం ఆచరించి, షోడశోపచార విధివిధాన అర్చనలు, నిత్య కర్మాను ష్టానాలను, దానధర్మాలను, నది వద్ద నిర్వహించడం, సనాతన వారసత్వం ఆచరణగా మారింది. గంగా తీరం క్షేత్రాలైన కాశీ, హరిద్వార్, నాసిక్, మధుర, ప్రయాగ, నదీ తీరాలలో ఉత్సవం బాగా ఆచరిస్తారు. అక్కడక్కడ గంగాదేవి ఆలయాలు కూడా దర్శనమిస్తాయి. గంగోత్సవానికి మరో పేరు... "దశపాపహర దశమి" లేదా "దశహర దశమి". పది పాపాలను హరించేది అని అర్థం. "లింగం దశాశ్వమేధేశం, దృష్ట్వా దశహరా తిథి, దశ జన్మార్జితై: పాపై:, త్యజ్యతే నాత్ర సంశయః".... దశహర తిథి నాడు దశాశ్వమేధ ఘట్టం లోని లింగమును చూసినట్ట యితే లోగడ పది జన్మలలో చేసిన పాపం నిస్సందేహంగా నశించి పోతుంది" అని తాత్పర్యం. ఈనాటి సంకల్పంలో "మమ ఏతజ్జన్మ జన్మాంతర సముద్భూత దశవిధ పాప క్షయ ద్వారా పరమేశ్వర ప్రీత్యర్థం దశహర పర్వ నిమిత్తం స్నాన మహం కరిష్యే" అని ఆచరిస్తారు. జన్మ జన్మాంతరాల నుండి వచ్చిన పది విధాల పాపాలు పోగొట్టే స్నానమని భావము. జేష్ఠ శుక్ల పాడ్యమి నుండి దశమి వరకు అనుదినం స్త్రీలు పిండి వంటలు చేసి, ప్రతిరోజు పదేసి భక్షాలు, దక్షిణ యుతంగా గురువులకు సమర్పించి, పదకొండవ రోజు "నిర్జలైకాదశి" నాడు పచ్చి మంచి నీళ్ళు అయినా ముట్టకుండా ఉపవాసం ఉండటం, అనాదిగా ఆచరణలో ఉన్న సంప్రదాయం. మొగలాయి చక్రవర్తుల కాలాన "జగన్నాథ పండిత రాయలు" అనే ఆంధ్ర ప్రాంత సంస్కృత బ్రాహ్మణ కవి, ఒక " మహమ్మదీయ స్త్రీని వివాహమాడిన క్రమంలో, సనాతనులు సంఘ బహిష్కృతులు కాగా, తన మరియు తన భార్య పాతివ్రత్యంను నిరూపించేందుకు కాశీ వెళ్లి పండితులతో వాదించినా ఫలితం లేక, 52 మెట్లున్న ఒక రేవులో రెండో మెట్టు పై కూర్చొని 52 స్తోత్రం శ్లోకాలు చెప్పగా ఒక్కో శ్లోక పఠనానికి, గంగా నది ఒక్కో మెట్టు పైకి వచ్చి చివరి శ్లోకంతో పండిత రాయలను ముంచేసిందని, తద్వారా పవిత్రతను చాటి చెప్పారని కథనాలున్నాయి. నదులను పూజించే ఆచారం ఆర్యులను బట్టి ఏర్పడినా, ఈ రూపేణా ఒక ఆంధ్ర సంస్కృత కవి, ఉత్తర హిందూ దేశంలో పూజితుడు కావడం ప్రత్యేకం. దక్షిణాదిన దశ పాప హర దశమి పర్వం సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి స్వామి యతి వారి పూజకు ప్రత్యేకించ బడడం విశేషం. వైశాఖ మాసం అంతా సదాశివ బ్రహ్మేంద్ర స్వామి వెరూరు గ్రామం చేరి "నేను జేష్ఠ శుద్ధ దశమి నాడు జీవితం సాధిస్తాను. ఆ రోజున కాశీ నుండి ఒక బ్రాహ్మణుడు ఒక లింగాన్ని తెస్తాడు. నా సమాధి సమీపంలో ఒక ఆలయం కట్టించి, లింగ ప్రతిష్ట చేయండి" అని చెప్పినట్లు కథనం. దశమి నాడు ఆయన ఆదేశానుసారం తవ్వబడిన గోతిలో, స్వామి ఉపవిష్టుడు కాగా, ఆయన శిరస్సు నుండి ఒక దివ్యతేజం లేచి, ఆకాశం వైపుగా పోయి అదృశ్యమైంది. అదే సమయంలో బ్రాహ్మణుడు కాశీ నుండి లింగాన్ని తేవడం జరిగింది. పుదుక్కోట ప్రభువు అక్కడ ఆలయం కట్టించాడు. లింగ ప్రతిష్ట జరిపించాడు. సమాధి మీద బిల్వ వృక్షాన్ని నాటించాడు. ఇప్పటికీ పుదుక్కోటలో పూజలు కొనసాగు తున్నాయి. జేష్ఠ శుద్ధ దశమి నాడు ఉత్తరాదిన పండితరాయల పూజ, దక్షిణాదిన సదాశివ యతి పూజ... ఇద్దరు తెలుగులను పూజ్య లింగములుగా చేస్తూ పూజించే పుణ్యదినం కావడం విశేషం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత - జూన్ 5...ప్రపంచ పర్యావరణ దినోత్సవం

1972 లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఏర్పాటు చేయబడింది. 1972 జూన్ 5 వ తేది నుంచి 16 వ తేది వరకు మానవ పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి సమావేశం అయింది. పర్యావరణ పరిరక్షణ సదస్సు లో వాతావరణ మార్పులను గమనిస్తూ తగు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని గుర్తించారు. 1973 లో మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రపంచ పర్యావరణ దినోత్సవమును జూన్ 5 తేదిన వేర్వేరు నగరాలలో విభిన్న రీతులలో అంతర్జాతీయ వైభవంగా జరుపుకుంటున్నారు. పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దుష్ప్రభావాలను తగ్గించటానికి పర్యావరణ పరిరక్షణకు వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలుష్య నివారణ చర్యలకై పలు చట్టాలను రూపొందించి అమలు జరుపుతున్నది. అనాలోచిత మానవ చర్యల వల్ల కలుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న బృహత్తర లక్ష్యంతో పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా మనిషి చేస్తున్న పనుల వల్ల భూగోళం అమితంగా వేడెక్కిపోతోంది. శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వాడడం వల్ల వాయుకాలుష్యం పెచ్చు మీరుతోంది. పట్టణాలు, నగరాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయనాలు విచ్చలవిడిగా వాడుతూ పదికాలాల పాటు పది లంగా చూసుకోవాల్సిన భూమిని నిస్సారంగా మార్చుతున్నాం. తరిగిపోయే వనరులకు బదులు, తరగని, పునర్వినియో గించుకోగల వనరుల ఆధారంగా జరిగే అభివృద్దే సుస్థిరాభివృద్ధి. ఇదే ధరిత్రికి సుస్థిర భవిష్యత్తును చేకూరుస్తుంది. సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. పంచభూతాలలో ఒకటిగా, భారతీయ సంస్కృతిలో భూమి భూదేవతగా భావించబడి, పూజింప




బడడం కనిపిస్తుంది. భూమి పరిరక్షణ కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపోయినా, కనీసం హాని కలిగించకుండా ఉంటే చాలు. ఇందుకోసం అవగాహన అవసరం. అటు పర్యావరణం, వాతావరణంతో పాటు ఇటు జీవన శైలిలోనూ మార్పులతో భూ పరిరక్షణపై అవగాహన కోసం కూడా ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. వ్యవసాయం కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా, నిర్జీవంగా మార్చేస్తున్నాయి. జీవం కోల్పోయిన నేలలో దిగుబడులూ నాసిగానే ఉంటాయి. దీర్ఘకాలంలో దిగుబడులు మరీ తగ్గిపోయి ఆహార సంక్షోభాలకు దారితీసే ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఆలివర్ డి షట్టర్ గుర్తించారు. పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాల వైపు మళ్లడం తప్ప మరో మార్గం లేదని నివేదించారు. వ్యవసాయంలో రసాయనాలు వాడే విధానాలను ప్రపంచవ్యాప్తం చేయడంలో కీలకపాత్ర వహించింది అమెరికా. ధరిత్రి దినోత్సవం పేరిట పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కూడా అమెరికాలోనే ప్రారంభం కావడం విశేషం. 50 ఏళ్ల క్రితం ఏప్రిల్ 22న గేలార్డ్ నెల్సన్ నేతృత్వంలో కాలుష్యకారక విధానాలకు నిరసనగా జనం ఉవ్వెత్తున ఉద్యమించారు. భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో "వాయుకాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1986వ సంవత్సరంలో "పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది. మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజించింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగాను, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలుష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపువర్గంగా వర్గీకరించింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విషవాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణంలోకి వదలాలి. ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణురియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్ళు, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది. భూమి, నీరు వంటి మౌలిక వనరులను గరిష్ట సామర్థ్యంతో వినియోగించాలి. వినియోగ అనుకూల సామర్థ్యాన్ని పెంచాలి. దూరదృష్టితో తరగని, పునర్వినియోగించు కోగల వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా సౌరశక్తి వినియోగం అధికంగా జరగాలి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను కనీస స్థాయికి తగ్గించ గలగాలి. అడువుల సంరక్షణ, పెంపకం, సుస్థిర యాజమాన్య పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ జరగాలి.. తెలంగాణలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒక వేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతో పాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరితహారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్సరాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఎదో చేయాలని మిన్నకుండి పోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అసలు సిసలైన ప్రజాస్వామిక వాది రావి - తెలంగాణ సాయుధ పోరాటానికి ఆద్యుడు రావి - జూన్ 5...రావి నారాయణరెడ్డి జయంతి



భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక జరిగిన మొట్టమొదటి లోక్‌సభ (1951-52) ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ అగ్రనేత జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజార్టీతో గెలుపొందిన వ్యక్తి ఒక తెలుగు వారు అనే విషయం చాలా మందికి తెలియదు. అంతేకాదు, దేశంలోనే ఆ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు పొందిన లోక్‌సభ అభ్యర్థిగా కూడా రికార్డు సృష్టించింది ఆ తెలుగు వ్యక్తే. ఆయనే తెలంగాణ సాయుధ పోరాట యోధుడుగా ప్రసిద్ధులైన రావినారాయణ రెడ్డి. హైదరాబాద్ రాష్ట్రంలోని నల్గొండ నియోజకవర్గం నుంచి పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) పార్టీ తరఫున నారాయణ రెడ్డి పోటీ చేసి ఆ ఘనతను సాధించారు. నాడు హైదరాబాద్ రాష్ట్రంలో 17 ఏక సభ్య నియోజక వర్గాలు, నాలుగు ద్విసభ్య నియోజక వర్గాలు ఉండే వి. ద్విసభ్య నియోజక వర్గాలకు ఇద్దరు చొప్పున సభ్యులు ప్రాతిని ధ్యం వహించే పద్ధతి ఉండేది. నల్గొండ కూడా అప్పుడు ద్విసభ్య నియోజవర్గం గానే ఉండేది. అక్కడ రావినారాయణ రెడ్డితో పాటు పోటీ చేసిన, సుకం అచ్చాలు విజయం సాధించగా, ఇద్దరూ పీడీఎఫ్ అభ్యర్థులే కావడం విశేషం. 1952 మార్చి 27 పోలింగ్ జరగగా... రావి నారాయణ రెడ్డికి 3,09,162 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి పీ.భాస్కర్ రావు పై 2,22,280 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాగే ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్ కమ్‌జౌన్‌పూర్ (పశ్చిమ) ద్విసభ్య నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జవహర్ లాల్ నెహ్రూకు 2,33,571 ఓట్లు రావడం జరిగింది. తొలి లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక ఓట్లు పొందిన ఎంపీతో పార్లమెంట్ భవనాన్ని ప్రారంభిం చాలని ఆ సందర్భంలో నిర్ణయిం చారు. నెహ్రూజీ కన్నా అధిక ఓట్లు సాధించిన రావి నారాయణరెడ్డి చేతుల మీదుగా ఢిల్లీలోని పార్లమెంట్ భవనం ప్రారంభమైంది. ఇది తెలుగు వారికి గర్వకారణమై మరచి పోలేని సంఘటనగా మిగిలి పోయింది. ఆ ఎన్నికలలో భువన గిరి శాసనసభ స్థానం నుంచి కూడా నారాయణ రెడ్డి పోటీ చేసి విజయం సాధించడం మరో విశేషం. అయితే రావి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎంపీగా కొనసాగారు. రావి నారాయణరెడ్డి, (జూన్ 5, 1908 - సెప్టెంబర్ 7, 1991) కమ్యూనిస్టు నాయకులు, తెలంగాణ పోరాటంలో ముఖ్యులు. ఆయన సంఘ సంస్కర్త. ఆంధ్ర మహాసభ ప్రారంభించిన సాంస్కృతి కోద్యమాన్ని క్రమంగా వామపక్ష సాయుధ పోరాటంగా పరివర్తన చేసిన గొప్ప నాయకులు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఆద్యునిగా కూడా ఆయనను పేర్కొంటారు. రావి... యాదాద్రి - భువనగిరి జిల్లా భువనగిరి మండలం బొల్లేపల్లిలో 1908, జూన్ 5న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. రెడ్డి హాస్టల్ విద్యార్థిగా ఉండగానే అప్పటి నిజాం కళాశాల విద్యార్థి అయిన బద్దం ఎల్లారెడ్డితో కలసి 1930 సంవత్సరంలో దేశవ్యాప్తంగా జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో కాకినాడ వెళ్లి పాల్గొన్నారు. 1931లో హరిజన సేవాసంఘాన్ని నెలకొల్పి దాని ప్రధాన కార్యదర్శి హోదాలో హైదరాబాద్ రాష్ట్ర వ్యాప్తంగా 100 పాఠశాలలు ప్రారంభించారు. రెండు వసతి గృహాలను నిర్వహించారు. 1930లో బ్రిటిష్ మహాత్మా గాంధీ అరెస్టుకు నిరసనగా హైదరాబాద్ లోని హస్మద్ గంజ్‌లో బహిరంగ సభలో బ్రిటిష్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యల్ని తీవ్రంగా ఖండిస్తూ మాట్లాడారు. 1931లో దేవర కొండలో జరిగిన రెండవ ఆంధ్ర మహాసభలకు తన తోటి విద్యార్థులను పోగుచేసి హైదరా బాద్ నుంచి పాదయాత్రగా వెళ్ళారు. నిజామాంధ్ర మహాసభ లోని భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆర్యసమాజ్, హిందూ మహాసభలతో కలిసి పనిచేసిన కమ్యూనిస్టుగా ఆయన ఆచరణ విశిష్టమైనది. సిద్ధాంత పరంగా విభేదించే శక్తులతో ఐక్య సంఘటన ఏర్పరచి ఏకతాటిపై ఉద్యమాన్ని ఎలా నిర్మించవచ్చో తన ఆచరణ ద్వారా నిరూపించిన ప్రజాస్వామిక వాది రావి. 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను స్థాపించిన వారిలో రావి ముఖ్యులు. నిజాం ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీపై విధించిన నిషేధం ఎత్తేయాలని అక్టోబరు 24న తొలిబ్యాచ్ సభ్యులుగా సత్యాగ్రహం చేశారు. ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నియంతృ త్వ పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన ప్రజా పోరాటానికి మార్గ నిర్దేశం చేసిన జననేత ఆయన. తెలంగాణ విమోచన తరువాత ఆయన సిపిఐ లో చాలాకాలం పనిచేశారు. రావి నారాయణరెడ్డి విశాలాంధ్ర కోసం చేసిన శ్రమ అనిర్వచనీయం. నిజాం ప్రభుత్వం మీద ఆయన చేసిన సాయుధ పోరాటం చిరస్మరణీయం. 1946-48 కాలంలో హైదరాబాదు సంస్థానంలో నిజాం పోలీసుల దాష్టీకాన్ని, మత దురహంకారులైన రజాకార్ల ఆగడాలనూ అరికట్టడ్డ డానికి అజ్ఞాతంగా ఎన్నో గెరిల్లా దళాలను ఏర్పాటు చేసారు. 1941లో నల్లగొండ జిల్లా చిలుకూ రులో జరిగిన 8వ నిజామాంధ్ర మహాసభకు, 1944లో భువనగిరి లో జరిగిన మహాసభకు ఆయనే అధ్యక్షత వహించారు. వితంతు వివాహాలు, అక్షరాస్యతా కార్యక్రమా లను నిర్వహిస్తూనే ఆంధ్ర మహా సభను క్రియాశీల రాజకీయ సంస్థగా మలిచారు. భువనగిరి సమావేశాల్లోనే ఆంధ్ర మహాసభ అతివాద, మితవాద శిబిరాలుగా చీలి పోయింది. మహాత్మాగాంధీ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు తన భార్య సీతాదేవితో వెళ్ళి కలిసి తన భార్య ఒంటిపై ఉన్న నగలన్నింటినీ తీసి గాంధీ చేతిలో పెట్టి, హరిజన సేవక సంఘానికి ఇవ్వమని గాంధీజీని అభ్యర్థించిన దేశభక్తులు రావి. దేశ స్వాతంత్ర్యానికి ముందు సాగిన సాయుధ పోరాటాన్ని వ్యూహాత్మకంగా సమర్థించిన రావి, 1947 తరువాతి కాలంలో పోరాటాన్ని కొనసాగించాలనే 'మెజారిటీ' నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తాను ఎన్నటికీ వీర తెలంగాణ వాదిగానే ఉంటానని చాటి చెప్పారు. గాంధేయవాది అయిన రావి తనకు సంక్రమించిన భూమిలో 20 ఎకరాలను మాత్రమే ఉంచుకుని 500 ఎకరాలను రైతు కూలీలకు పంచిపెట్టారు. తాను మరణిస్తే తన భార్య వైధవ్య ప్రతీకలను ఆమోదించ రాదని, కట్టూబొట్టులతో సలక్షణంగా ఉండాలని, ఆమె తన అభీష్టాను సారం జీవించవచ్చనీ, అలాగే తన అస్థికలను గంగా నదిలో కలప వద్దని, పొలంలో చల్లితే చాలనీ వీలునామా రాసిన సామాజిక సంస్కర్త రావి, 1991, సెప్టెంబర్ 7 న తుదిశ్వాస విడిచారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సమగ్ర వికాసం.. పుష్కర పథం

కరీంనగర్ : ఎన్నో ఆకాంక్షలతో ఆవిర్భవించిన ప్రత్యేక రాష్ట్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తనదైన పంథాలో పరుగులు తీస్తోంది.. సంక్షేమం–అభివృద్ధి విషయంలో ఆదర్శంగా నిలుస్తోంది.. ప్రగతి పరవళ్లు తొక్కుతూ అన్ని రంగాల్లో మార్పు కనిపిస్తోంది. పల్లె.. పట్టణాల్లో కీలకమైన విద్య, వైద్య వసతులు మెరుగుపడగా.. సాగునీటి వనరులకు సజీవ జలధారలందించే ప్రాజెక్టుల కలలు నెరవేరుతున్నాయి.. సాగు సస్యశ్యామలమనే పరిస్థితులు.. పారిశ్రామిక వికాసంతో దగ్గరవుతున్న ఆర్థికాభివృద్ధి భవిష్యత్తు దిశగా సరికొత్త ఆశలు రేకెత్తిస్తోంది. రాష్ట్రం ఆవిర్భవించి 11 ఏళ్లు పూర్తయి 12వ ఏట అడుగు పెడుతున్న వేళ ఉమ్మడి జిల్లా పరిస్థితిపై కథనం..

**అన్నదాతకు భరోసా**

వ్యవసాయాధారితమైన ఉమ్మడి జిల్లాలో అన్నదాతలకు మేలు చేసేలా రైతు భరోసా, యాంత్రీకరణ, కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలవుతున్నాయి. 6.25 లక్షల మంది రైతులకు చెందిన 12.88 లక్షల ఎకరాలకు రైతుభరోసా ద్వారా ఏటా పెట్టుబడి సాయం కింద రూ.658 కోట్లు అందుతున్నాయి.

మహిళలు సాధికారిత దిశగా అడుగులు వేస్తున్నారు. ఏటా 49,764 స్వయం సహాయక సంఘాల పరిధిలోని 5,57,538 మంది మహిళలకు రూ.1700 కోట్ల నుంచి రూ.2300 కోట్ల రుణాలు బ్యాంకు లింకేజీలు, స్త్రీనిధి ద్వారా అందుతున్నాయి. డ్రోన్‌లు, వ్యవసాయ పనిముట్ల ద్వారా ఆర్థిక ప్రగతి అందుకుంటున్నారు.

గడిచిన ఐదేళ్ల వ్యవధిలో ఉమ్మడి జిల్లాకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు 3,875 వచ్చాయి. రూ.7,171 కోట్ల పెట్టుబడులతో



ఏర్పాటైన వాటి ద్వారా 37,961 మందికి ఉపాధి అందుతోంది.

సంక్షేమ పథంనెలకు 80 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు.

ఆరోగ్యశ్రీ చికిత్స సాయాన్ని రూ.10 లక్షలకు పెంచడంతో ఏటా 7 వేల మంది ప్రయోజనం పొందుతున్నారు.

మహాలక్ష్మి పథకం కింద ఉమ్మడి జిల్లాలో 5,25,717 మంది రూ.500కే సిలిండర్‌ను అందుకుంటున్నారు.

గృహజ్యోతి ద్వారా 5,15,684 గృహాలు 200 లోపు యూనిట్ల విద్యుత్తుకు జీరో బిల్లును పొందుతున్నాయి.

39,806 ఇందిరమ్మ ఇళ్లు రాగా 27,364 మంది లబ్ధిదారులు మంజూరు పత్రాలు అందుకున్నారు.

ఆసరా పింఛన్ల ద్వారా 5.32 లక్షల మందికి లబ్ధి చేకూరుతోంది. నెలకు రూ.120 కోట్లను సర్కారు చెల్లిస్తోంది.

**సాగుకు దన్ను**

ప్రాజెక్టుల నిర్మాణంతో ఉమ్మడి జిల్లాలో సాగు పెరిగింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11.62 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా ప్రస్తుతం 14 లక్షలకు పైగా ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి.

**మెరుగైన వైద్యం..**

ప్రజారోగ్యానికి పెద్దపీటలా ప్రభుత్వ ఆసుపత్రులు బలోపేతమయ్యాయి. బస్తీ, పల్లె దవాఖానాల రూపంలో సేవలు మెరుగయ్యాయి. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. 72 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 483 ఆరోగ్య ఉపకేంద్రాల్లో సౌకర్యాలు మెరుగయ్యాయి. తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రాలతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు సులభతరమయ్యాయి. కిడ్నీ సమస్యలతో బాధపడేవారికి నియోజకవర్గ కేంద్రాల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ వైద్యకళాశాలలు నాలుగు జిల్లాల్లో ఏర్పాటవడం, వాటికి కొత్త భవనాలు సమకూరడంతో ప్రభుత్వ వైద్యరంగం బలోపేతమవుతోంది.

**విద్యారంగం బలోపేతం**

విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని అందించడంతో పాటు కొత్త భవనాల నిర్మాణంతో మౌలిక వసతులు మెరుగయ్యాయి. బలహీనవర్గాల విద్యార్థుల జీవితాలను మార్చే దిశగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు నాలుగు జిల్లాల పరిధిలో అయిదింతలు పెరిగాయి. ప్రస్తుత సర్కారు ప్రతి నియోజకవర్గానికో సమీకృత బడిని రూ.210 కోట్లతో నిర్మించేందుకు సిద్ధమవుతోంది. మన ఊరు–మన బడితోపాటు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా 581 పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరగడం విద్యాభివృద్ధికి దోహదపడేదే.

# అవసరాలకు తగినట్టు.. అంతరాయాలు తొలగేట్టు

ధర్మారం : ధర్మారంలోని విద్యుత్తు ఉప కేంద్రం 1976 ఏప్రిల్ 26న వినియోగంలోకి వచ్చింది. ఈ ఉపకేంద్రం నుంచి ధర్మారం, కొత్తపల్లి, బొమ్మారెడ్డిపల్లి, గోపాల్‌రావుపేట, నందిమేడారం గ్రామాల్లో గృహ, వ్యవసాయ అవసరాలకు సంబంధించి 9,371 కనెక్షన్లున్నాయి. రోజురోజుకూ వినియోగం పెరుగుతుండగా, అందుకు సరిపడా పరికరాలు లేవు. ఉపకేంద్రంలోని ఇనుప స్తంభాలు తుప్పు పట్టాయి. ఓ వైపు ప్రహరీ లేదు. వీటన్నింటికీ రూ.12 లక్షలు మంజూరు కాగా ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి. స్తంభాలకు పెయింటింగ్, ఇన్సులేటర్లు, కేబుళ్ల మార్పు, బ్రేకర్ల మరమ్మతు, యార్డు ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ఇదే మాదిరిగా ఉమ్మడి జిల్లాలోని పాత ఉపకేంద్రాల్లో మరమ్మతు పనులు చేపడుతున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొత్త ఆవిష్కరణలు వస్తున్న కొద్దీ విద్యుత్తు అవసరాలు పెరుగుతున్నాయి. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ఉపకేంద్రాల సామర్థ్యం సరిపోక తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో పాత ఉపకేంద్రాల పునరుద్ధరణ, భావి అవసరాలకు తగ్గట్టుగా మరమ్మతు, ఆధునికీకరణకు ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ(ఎన్‌పీడీసీఎల్) శ్రీకారం చుట్టింది. కంపెనీ పరిధిలోని 16 జిల్లాలు, సర్కిళ్ల పరిధిలో 33/11 కేవీ సామర్థ్యం కలిగిన 485 ఉప కేంద్రాలను ఆధునికీకరించాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.68.87 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 90 ఉపకేంద్రాలకు నిధులు మంజూర య్యాయి. వర్షాలు పెరిగేలోపు పూర్తయ్యేలా.. మరో దశాబ్దం వరకు వినియోగం పెరిగినా తట్టుకొనేలా ఎక్కువ సామర్థ్యం కలిగిన పరికరాలను బిగించడంతో పాటు పదే పదే అంతరాయాలకు కారణమయ్యే సామగ్రి తొలగించనున్నారు. నాణ్యమైన సామగ్రి బిగించడం, ఇన్సులేటర్లు, కేబుళ్లు, బ్రేకర్లు, ఇతర యంత్ర సామగ్రికి మరమ్మతు, యార్డుల్లో కంకర పోయడం, చుట్టూ రక్షణ కంచెల ఏర్పాటు, ఉపకేంద్రానికి అవసరమైతే ప్రహరీ నిర్మాణాలు, అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే గుత్తేదారులు ఈ పనులను ప్రారంభించారు. మరికొద్ది రోజుల్లో వర్షాలు, వ్యవసాయ పనులు జోరందుకోనుండగా అంతకు ముందే పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

# గడువులోగా పూర్తయ్యేనా!



కరీంనగర్ : పట్టణాలు, నగరాల్లో తాగునీటి కష్టాలు తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద చేపట్టిన పనులు నత్తనడకన సాగుతుండటంతో గడువులోగా పూర్తి కావడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 13 పురపాలికలు, రెండు నగరపాలికలుండగా, ఇందులో ఆరు కొత్తగా ఏర్పడిన పట్టణాలున్నాయి. కొత్తపల్లి పురపాలిక ఇటీవలే కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైంది. రామగుండం కార్పొరేషన్ మినహాయిస్తే మిగతా 14 పురపాలికల్లో సమీప గ్రామాలను విలీనం చేశారు.

**వేసవి కష్టాలు తీర్చేందుకే..**

కొత్తగా ఏర్పాటైన కాలనీలు, మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద నిధులు మంజూరు చేసింది. ఏటా వేసవిలో ఎదురవుతున్న తాగునీటి ఇక్కట్లు తీర్చడానికి ఈ పథకాన్ని ఉద్దేశించారు. గతంలో మిషన్ భగీరథ కింద వేసిన పైపులైన్ల సామర్థ్యం సరిపోకపోవడంతో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ఈ నేపథ్యంలోనే గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ప్యాకేజీల వారీగా టెండర్లు నిర్వహించగా పనుల్లో పురోగతి లేదు. వచ్చే ఏడాది జూన్ వరకు గడువుండగా ఈలోగా పూర్తి కావడం అసాధ్యమనిస్తోంది.

**పర్యవేక్షణ లేక.. ఇష్టానుసారంగా..**

అమృత్ పథకంలో భాగంగా కరీంనగర్‌తో పాటు పలు చోట్ల చేపట్టిన పనులపై అధికారుల పర్యవేక్షణ కరవైంది. పైపులైను వేసే సమయంలో రోడ్డుకు ఎంత లోతులో తవ్వాలి? ఎంతమేర ఇసుక వేయాలి? అతుకులు ఎలా వేస్తున్నారు? పైపులైన్ వేసే దూరమెంత? ఎక్కడి నుంచి వేస్తున్నారు? పైపుల నాణ్యత ఎలా ఉంది? వంటి విషయాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సి ఉండగా అమలుకు నోచడం లేదు. దీంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు.

**పట్టణాల వారీగా పురోగతి**

కరీంనగర్ నగరపాలక సంస్థకు రూ.145.50 కోట్లు మంజూరు కాగా నాలుగు చోట్ల రిజర్వాయర్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. 29.60 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయగా మరో 26.80 కి.మీ.ల మేర స్థల కొరత ఉంది. కొత్తపల్లిలో రూ.26.15 కోట్లు మంజూరు కాగా 2 రిజర్వాయర్లు, సంపుల నిర్మాణం సాగుతుండగా పైపులైన్ పనులు ప్రారంభించలేదు.

చొప్పదండికి రూ.36.30 కోట్లు రాగా రెండు చోట్ల సంపు, రిజర్వాయర్లు, 46.21 కి.మీ.ల పొడవునా పైపులైన్ పనులు ప్రారంభించలేదు.

హుజూరాబాద్‌కు రూ.16.25 కోట్లు మంజూరయ్యాయి. మూడు చోట్ల పనులు ప్రారంభించగా, ఇంకా 16.20 కి.మీ.ల మేర పైపులైన్ వేయాల్సి ఉంది.

జమ్మికుంటలో పురపాలికకు రూ.33 కోట్లు మంజూరు కాగా రెండు చోట్ల సంపు, రిజర్వాయర్ పనులు ప్రారంభించగా 8.5 కి.మీ.ల స్థలం అప్పగించాల్సి ఉంది.

# ‘సాయం చేస్తా’మనీ మాయం




హైదరాబాద్: ఖైరతాబాద్‌కు చెందిన సూర్యనారాయణ మార్చి 17న స్నేహితుడి ఖాతాలో రూ.50 వేలు జమ చేసేందుకు బల్కంపేటలోని ఎస్‌బీఐ క్యాష్ డిపాజిట్ ఏటీఎంకు వెళ్లారు. ఎలా జమ చేయాలో తెలియక ఇబ్బంది పడ్డాడు. గుర్తించిన ఓ వ్యక్తి సాయం చేస్తానని చెప్పాడు. నమ్మిన బాధితుడు నగదును అతనికి ఇచ్చారు. ఏటీఎం పనిచేయడం లేదని, తన కార్డుతో జమ చేస్తానని నమ్మించాడు. కానీ బ్యాంకు ఖాతాలో మాత్రం రూ.50 వేలు జమ కాలేదు.

**ఇది ఓ ఉదాహరణ మాత్రమే**

నగరంలో చాలా ఏటీఎంల వద్ద భద్రత లేకపోవడం, అక్కడ జరిగే మోసాలపై ఖాతాదారులకు అధికారులు అవగాహన కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి. రోజంతా వాటి వద్ద మాటు వేస్తున్న నేరగాళ్లు అదను చూసి అమాయకులను బురిడీకొట్టిస్తూ నగదు కాజేస్తున్నారు.

**బ్యాంకు పక్కనే ఉన్నా..** మార్చి 9న ఎస్సార్‌నగర్‌లో యూనియన్ బ్యాంకు సమీపంలోనే ఉన్న ఏటీఎంలోకి ప్రవేశించిన ఆగంతకులు నగదు విడుదల చేసే స్లాట్‌కు టేపు వేశారు. తిరిగి సాయంత్రం వచ్చి ఇక్కడ చిక్కుకున్న నగదును దర్జాగా తీసుకుని పారిపోయారు. బ్యాంకు సమీపంలోనే ఉన్న ఈ ఏటీఎం కేంద్రంలో భద్రత ఏరీతిలో ఉందో వెల్లడవుతోంది.

**ఆ రెండు చోట్ల అధికం**

రాష్ట్రంలోనే అత్యధికంగా ఐటీ శిక్షణ కేంద్రాలు, 400 వరకు వసతిగృహాలు ఉన్న ఎస్సార్‌నగర్, అమీర్‌పేటలోని ఏటీఎంలలో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గతంలో ఎస్సార్‌నగర్‌లోని కెనరా బ్యాంకు ఏటీఎంలో దొంగలు నగదు అపహరించేందుకు యత్నించి విఫలమయ్యారు.

**కనిపించని కాపలాదారులు**

చాలా చోట్ల భద్రత కనిపించడం లేదు. కేవలం బ్యాంకుల ప్రాంగణాల్లో ఉన్న ఏటీఎంల వద్ద మాత్రమే కాపలాదారును ఏర్పాటు చేస్తున్నారు. సనత్‌నగర్ పారిశ్రామికవాడలోని నిర్మానుష్య ప్రాంతాల్లో కూడా ఏటీఎంలు ఉన్నాయి. కొన్ని చోట్ల చెత్త కుప్పలు పేరుకుంటుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో కుక్కలు తిష్ఠ వేస్తున్నాయి.

**అప్రమత్తతే శ్రీరామరక్ష– శ్రీనాథ్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్, ఎస్సార్‌నగర్**

ఇతరుల ముందు ఏటీఎంలోలావాదేవీలు చేయకూడదు.

ఒకరి తరువాత ఒకరు మాత్రమే వెళ్లాలి. కానీ కొన్నిసార్లు గుంపులుగా వెళ్తుంటారు. యంత్రాలు మొరాయించినా, కార్డులు ఇరుక్కుపోయినా టోల్‌ఫ్రీ నంబరుతో బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేయాలి.

అనుమానితులు సాయం చేస్తామని వస్తే అంగీకరించకూడదు.

# అద్దె బాధలు.. అరకొర వసతులు ఉండవిక

బోయినపల్లి : అద్దెభవనంలో.. అరకొర వసతుల నడుమ ఏళ్లుగా నడుస్తున్న బోయినపల్లిలోని సెస్ కార్యాలయానికి సొంత భవనం అందుబాటులోకి రానుంది. దీంతో విద్యుత్తు సిబ్బంది, వినియోగదారుల ఇబ్బందులు తొలగనున్నాయి. భవనానికి రూ.66 లక్షలు సెస్ నుంచి కేటాయించారు. టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సెస్ కార్యాలయం పరిధిలో మండల కేంద్రంతో పాటు విలాసాగర్, మల్కాపూర్, కోరెం, స్తంభంపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాలు ఉన్నాయి. మండలంలోని 23 గ్రామాలతోపాటు జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ, తిప్పాయపల్లి గ్రామాలకు విద్యుత్తు సరఫరా జరుగుతోంది. గృహ, వ్యవసాయ, వీధి దీపాలు, మంచినీటి సరఫరా, పరిశ్రమలకు సంబంధించి సుమారు 24 వేల విద్యుత్తు కనెక్షన్‌లున్నాయి. ఈ సెస్ కార్యాలయం కోసం బోయినపల్లి–వేములవాడ రహదారిలో సుమారు 25 ఏళ్ల క్రితం సొంత భవనం నిర్మించారు. గ్రామానికి దూరంగా ఉందన్న కారణంతో అధికారులు, వినియోగదారులు అక్కడికి వెళ్లేందుకు విముఖత వ్యక్తం చేయటంతో బోయినపల్లిలోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కార్యాలయం కొనసాగించారు. ఆ ఇల్లు వర్షానికి ఉరుస్తుండటంతో ఇటీవల మరో భవనంలోకి కార్యాలయాన్ని మార్చారు. కాగా సొంత భవనం వినియోగంలో లేకపోవడంతో నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. దానిని కూల్చివేయించి చదును చేయించారు. ప్రస్తుతం ఈ ప్రాంతం అభివృద్ధి చెందటంతో ఆ స్థలంలోనే నూతన భవనాన్ని నిర్మించనున్నారు.

**రెండంతస్తుల్లో గదులు** సెస్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ డైరెక్టర్ సుధాకర్, ఛైర్మన్ చిక్కాల రామారావు, అధికారులకు వినతిపత్రాలు అందించారు. భవన నిర్మాణానికి అధికారులు అంచనాలు రూపొందించి పంపడంతో ఇటీవల రూ.66 లక్షలు మంజూరు చేశారు. రెండంతస్తులతో భవన



నిర్మాణం చేపట్టనున్నారు. కింద సెస్ డైరెక్టర్, ఏఈ, విద్యుత్తు బిల్లుల వసూలు, అకౌంట్ సెక్షన్, వినియోగదారులు వేచి ఉండటానికి, సామగ్రి భద్రపర్చడానికి గదులు నిర్మించనున్నారు. పై అంతస్థులో వేయిటింగ్‌తో పాటు మరో గది ఏర్పాటు చేయనున్నారు.

**వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా**

**కొట్టెపల్లి సుధాకర్, సెస్ డైరెక్టర్**

సెస్ కార్యాలయానికి వచ్చే విద్యుత్తు వినియోగదారులు, కార్యాలయ సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సొంత భవన నిర్మాణం కోసం కోరాను. నిధులు మంజూరు చేయాలని ఛైర్మన్‌ను, అధికారులకు వినతి పత్రాలు ఇవ్వటంతో నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించేందుకు కృషి చేస్తాను.

టెండర్ దశలో పనులు

ప్రశాంత్, ఏఈ సెస్ భవన నిర్మాణం కోసం రూ.66 లక్షలు మంజూరయ్యాయి. పనులు టెండర్ ప్రక్రియ దశలో ఉన్నాయి. పూర్తవ్వగానే ప్రారంభిస్తాం. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

# వ్యాధుల భయం.. ఏదీ అభయం!

పెద్దపల్లి : కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లిలో రూ.16 లక్షలతో పల్లె దవాఖానా భవనాన్ని నిర్మించారు. కొన్ని నెలల కిందటే పనులు పూర్తయినా గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం పంచాయతీ భవనంలో పల్లె దవాఖానా కొనసాగుతోంది.

ఈసారి రుతుపవనాలు ముందుగానే పలకరించడంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో సీజనల్ వ్యాధుల ప్రమాదం ఉంది. ఏటా విష జ్వరాలు, డెంగీ, మలేరియా, చికున్ గన్యా వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందక రోగులు ప్రైవేటుకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో సేవలు నామమాత్రంగా మారాయి. కాలానుగుణ వ్యాధుల కట్టడి దిశగా యంత్రాంగం కార్యాచరణ చేపట్టాల్సి ఉంది.

**వ్యాధి నిర్ధారణలో జాప్యం**



జిల్లావ్యాప్తంగా 18 ప్రాథమిక, 6 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 104 ఉప వైద్య కేంద్రాలు, 66 పల్లె దవాఖానాలున్నాయి. చాలా చోట్ల పల్లె దవాఖానాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉండగా చాలా చోట్ల సమయపాలన పాటించడం లేదు. వ్యాధి నిర్ధారణ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో రక్త నమూనాలను సేకరించి జిల్లాకేంద్రంలోని టీ డయాగ్నొస్టిక్ కేంద్రానికి తరలిస్తున్నారు. నివేదికల్లో జాప్యం జరుగుతుండటంతో వ్యాధి తీవ్రతతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

**నిధుల కొరత**

జిల్లాలోని 266 పంచాయతీల్లో 150 ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నా ఎక్కడా సక్రమంగా పని చేయడం లేదు. పాలకవర్గాలు లేకపోవడంతో నిధుల విడుదల నిలిచిపోయింది. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ కోసం దిక్కులు చూడాల్సిన పరిస్థితి. పెద్ద పంచాయతీలు సాధారణ నిధులను అరకొరగా వెచ్చిస్తుండగా, చిన్న పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

**పూర్తి స్థాయిలో అందని వైద్యం**

గతేడాది ఓదెల, మంథని, ముత్తారం, పెద్దపల్లి, కమాన్‌పూర్ మండలాల్లో ఎక్కువ మంది జ్వర బాధితులు కాళ్లు, కీళ్ల నొప్పులతో మంచానికే పరిమితమయ్యారు.

పలు మార్లు పరీక్షలు చేయించినా వ్యాధి నిర్ధారణ కాలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇచ్చిన మాత్రలతో నయం కాలేదు.

పెద్దపల్లి, గోదావరిఖని ఆసుపత్రుల్లో తప్ప మంథని, సుల్తానాబాద్ సామాజిక ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో సేవలందడం లేదు.

ఇలా చేస్తే మేలుజనావాసాల్లో రోజువారీగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. పైపులైన్ లీకేజీలను అరికట్టాలి. ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జ్వరం, తలనొప్పి, జలుబు తదితర రుగ్మతలకు మందులు అందుబాటులో ఉంచాలి.

క్రమం తప్పకుండా ఫాగింగ్ చేస్తే దోమల బెడద తగ్గుతుంది.

**సమన్వయంతో ముందుకెళ్తున్నాం**

జిల్లాలో సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రణాళిక చేపట్టాం. వివిధ శాఖలతో సమన్వయ సమావేశం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేదు. అన్ని చోట్లా వైద్యులున్నారు. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తిస్తున్నారు. 15 రోజులకోసారి తాగునీటిని పరీక్షించాలని సిబ్బందిని ఆదేశించాం.ప్రసన్నకుమారి, జిల్లా వైద్యాధికారి

# మట్టి తరలిస్తున్నా.. మిన్నకుంటున్నారు

పెద్దపల్లి : ఇటుక తయారీ పరిశ్రమకు చెరువుల నుంచి తరలిస్తున్న మట్టి తవ్వకాలపై నియంత్రణ లేకపోవడంతో బావులను తలపిస్తున్నాయి. జిల్లాలోని 33 చెరువుల నుంచి మట్టి తరలించేందుకు అనుమతించిన ప్రభుత్వం.. తవ్వకాలు జరిపే తీరుపై నిఘా పెట్టకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. నీటి నిల్వ చేసే బంకమట్టి పూర్తిగా తరలించడం, తూముల కంటే దిగువకు చెరువు గుంతలు లోతుగా మారిపోవడంతో వాన నీరు నిలిచే అవకాశంలేదు.

**నిబంధనలకు విరుద్ధంగా..**

చెరువు వద్ద ఉండే రెవెన్యూ సిబ్బంది ఎన్ని ట్రిప్పుల మట్టి తీసుకు వెళుతున్నారనే అంశమే తప్పా.. చెరువుకు జరుగుతున్న నష్టాన్ని పట్టించుకోవడంలేదు. నీటిపారుదల శాఖ దిగువస్థాయి(లస్కర్) ఉద్యోగి మాత్రమే అప్పుడప్పుడు కనిపిస్తున్నాడు. నిబంధనల ప్రకారం చెరువులో 3 అడుగులకు మించి లోతు మట్టి తీయకూడదు. కానీ భారీ యంత్రాలతో 6 నుంచి 10 అడుగుల లోతు వరకు తీస్తున్నారు. దీంతో నీటి ఊటలు వస్తున్నాయి. ఈ నీటి ఊటలు చెరువు తూము కంటే దిగువకు వెళుతున్నాయి. **అడిగిన వారందరికి అనుమతులు** ఎన్టీపీసీ బూడిదను ఇటుక బట్టీలకు ఉచితంగా ఇవ్వడానికి ఎంఎస్ఎంఈ సర్టిఫికెట్లు కలిగినవారికే కేటాయిస్తున్నారు. కానీ చెరువు మట్టికి చలానా చెల్లించిన వారందరికీ అనుమతులిచ్చేస్తున్నారు. జిల్లాలో 150కిపైగా ఇటుక బట్టీలుండగా.. వీటిలో కేవలం 50 మందికే ఎంఎస్ఎంఈ ధృవీకరణ పత్రాలున్నాయి. వీటి ఆధారంగా మట్టి కేటాయింపులు జరిగితే.. చెరువుకు నష్టం వాటిల్లితే సదరు నిర్వాహకుల నుంచి పరిహారం వసూలుచేసే అవకాశముంటుంది.

**వసూళ్ల కోసం కమిటీలు**చెరువు మట్టిని తరలించే గ్రామాల్లో అక్కడి నాయకులు అభివృద్ధి కమిటీల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ కమిటీ చెరువు మనుగడ, రైతుల సంక్షేమం కంటే విరాళాలు వసూలు చేయడంపైనే దృష్టి పెట్టింది.

ఓదెల మండలం కొలనూరులో అక్కడి అభివృద్ధి కమిటీ మట్టి రవాణా అడ్డుకోవడంతో.. చివరికి నిర్వాహకులు అక్కడి శివాలయం నిర్మాణానికి విరాళం చెల్లించారు. తాజాగా కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్లలోనూ ఆలయం నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని పనులను అడ్డుకున్న గ్రామస్థులను పోలీసులు చెదరగొట్టడం ఆందోళనకు దారితీసింది. బట్టి నిర్వాహకులకు పోలీసులు వత్తాసు పలకడంపై గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. కాగా ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల ప్రమేయంతోనే మట్టిదందా సాగుతోందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

చురకలు



# సొమ్ము మాయం.. రికవరీ గగనం

హుజూరాబాద్ : ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి ప్రయాణం చేద్దామనుకుంటే జంకుతున్నారు. ఎప్పుడు ఎవరింట్లో దొంగతనం జరుగుతుందో తెలియని పరిస్థితి. డివిజన్ పరిధిలోని శంకరపట్నం, హుజూరాబాద్, వీణవంక, జమ్మికుంటతో పాటు పలు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. మార్చి 23న శంకరపట్నం మండలం లింగాపూర్‌లో తొమ్మిది ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పోలీసులు వెళ్లి సంఘటన జరిగిన ఇళ్లను పోలీసులు పరిశీలించి పలు వివరాలు సేకరించినా నేటికి ఆ దొంగలను గుర్తించనేలేదు.

ఒక్కరినీ పట్టుకోలేదు

హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు దొంగలు సవాల్‌గా మారుతున్నారు. ఆయా ఠాణాల పరిధిలోని బ్లూకోల్ట్స్ పోలీసులు ప్రతినిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా దొంగలు మాత్రం చిక్కటం లేదు. హుజూరాబాద్ మండలం కందుగుల శివారులోని కాకతీయ ప్రధాన కాలువలోకి కందుగుల, చిన్నపాపయ్యపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు మోటార్లు పెట్టుకోగా ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 15 మోటార్లను పగులగొట్టి రాగి తీగను ఎత్తుకెళ్లారు. వీణవంక మండలం గున్నుకుల ఆదర్శ పాఠశాలలో మూడు కంప్యూటర్లను చోరీ చేశారు.

మే 24న కేశవపట్నం పోలీసు స్టేషన్ కూతవేటు దూరంలో



కె.శ్రీనివాస్‌కు చెందిన దుకాణంలో చోరీ జరిగింది.

మే 19న కేశవపట్నం ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన పరమేష్ అనే వ్యక్తికి చెందిన ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. రూ.80 వేలు అపహరించారు.మే 14న జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో వెంకటలక్ష్మి అనే వృద్ధురాలి మెడలో నుంచి బంగారు ఆభరణాన్ని లాక్కెల్లాడు.మే 12న జమ్మికుంట మడిపల్లి రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.

మే 1న కేశవటపట్నం ప్రధాన రహదారి పక్కన నిలిపి ఉంచిన ఓ ద్విచక్ర వాహనాన్ని అపహరించారు.

ఏప్రిల్ 18న కేశవపట్నం శివారులోని సైదాపూర్ అడ్డదారి సమీపంలో ఉన్న ఓ మద్యం దుకాణంలో రూ.60వేలతో పాటు సీసీ కెమెరాల డీవీసీని ఎత్తుకెళ్లారు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం


దొంగతనాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. గతంలో జరిగిన దొంగతనాలపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నాం. సబ్ డివిజన్ పరిధిలో ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తాం.

వి.మాధవి, ఏసీపీ, హుజూరాబాద్

# 'నై'జీరియన్లు

హైదరాబాద్: తప్పు చేసినా, చేయకపోయినా.. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైతే భయపడిపోతాం. ఉద్యోగ నియామకాల్లో ఇబ్బందులు, శిక్షలు, జరిమానాలకు తోడు అది తేలేవరకు ఠాణా, కోర్టు విచారణ తదితర కారణాలతో కేసులంటేనే వణికిపోతారు. కానీ నగరంలో అక్రమంగా ఉంటున్న నైజీరియన్లు మాత్రం ఉద్దేశపూర్వకంగా నిందితులుగా మారుతున్నారు. డీపోర్టేషన్(సొంత దేశానికి తిప్పి పంపడం) నుంచి తప్పించుకోవడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. భారత చట్టాల ప్రకారం విదేశీయులు ఏదైనా కేసులో నిందితులుగా ఉంటే అది తేలేంతవరకు స్వదేశానికి వెళ్లడానికి అవకాశం ఉండదు.

**చదువు కోసం వచ్చి అడ్డదారులు** మూడు కమిషనరేట్ల పరిధిలో సుమారు 3,435 మంది నైజీరియా, ఘనా, ఉగాండా, ఐవరీకోస్ట్, టాంజానియా, సూడాన్ తదితర దేశస్థులుంటున్నారు. నగరానికి వచ్చే



ఆఫ్రికా దేశస్థుల్లో ఎక్కువ మంది నైజీరియన్లే. పారామౌంట్‌కాలనీ, బండ్లగూడ జాగీర్, టోలిచౌకి, బంజారాహిల్స్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో వీరు ఎక్కువగా ఉంటున్నారు. విద్య, ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి డబ్బు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నగరంలో డ్రగ్స్ ఎప్పుడు పట్టుబడ్డ అందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా నైజీరియన్ల పాత్ర ఉంటోంది. డ్రగ్స్‌తో పాటు వ్యభిచారం, సైబర్ నేరాలు, తాంత్రిక పూజల(బ్లాక్ మ్యాజిక్)తో కరెన్సీ తయారీ పేరుతో మోసాలు చేస్తున్నారు. ఇటీవల వీరి ఆగడాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. వీసా గడువు ముగిసినా వెళ్లని వారెందరో లెక్కలు తీయగా వందల మంది అక్రమంగా ఉంటున్నట్లు గుర్తించారు. డిగ్రీ, పీజీ కోర్సుల కోసమంటూ ఇక్కడికొచ్చినా ఉద్దేశపూర్వకంగా వాటిని పూర్తి చేయకుం డానే వదిలేస్తున్నారు. ఇంకొందరు గోవా, బెంగళూరులకు వెళ్లి డ్రగ్స్ ఏజెంట్లుగా స్థిరపడుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించిన హైదరాబాద్ పోలీసులు డీపోర్టేషన్ చేస్తున్నారు. దీన్నుంచి తప్పించుకోవడానికి స్థానికంగా యువతుల్ని పెళ్లాడి మోసగించడం, గృహహింస, దాడులు వంటి నేరాలకు పాల్పడుతున్నారు. ఫిర్యాదు వచ్చినప్పుడు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సగటున ఒక్కో విదేశీయుడిని తిప్పి పంపాలంటే రూ.5 లక్షల వరకూ ఖర్చవుతోందని పోలీసులు చెబుతున్నారు.

# జాగ్రత్త.. కూలుతాయ్ జీవితాలు



హైదరాబాద్: నగరంలో పాత భవనాలు దడ పుట్టిస్తున్నాయి. వానలొస్తే చాలు అవి యమపాశంలా మారుతున్నాయి. పైకప్పులు, గోడలు, ప్రహరీలు కూలిపోయి చిన్నారులు, వృద్ధులు మృతి చెందిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది వర్షాలు ముందే మొదలవ్వడంతో నిజాం కాలం నాటి పురాతన భవనాలు, పాత వాంబే గృహ సముదాయాలు, హౌసింగ్ బోర్డు కాలనీలు, గ్రామాల్లో మట్టి ఇళ్ల విషయంలో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు శిథిల భవనాల సర్వే పేరుతో జీహెచ్‌ఎంసీ అధికారులు కాలక్షేపం చేస్తున్నారు. తాజాగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులు కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు నోటికొచ్చిన లెక్కలు చెప్పి తప్పుదోవపట్టించే ప్రయత్నం చేశారు. ఇలాగైతే ప్రమాదాలను అడ్డుకోవడంలో జీహెచ్‌ఎంసీ ఈ ఏడాదీ విఫలమవుతుందనే విమర్శలొస్తున్నాయి.

**మొక్కుబడిగా నోటీసులు**

చార్మినార్, శాలిబండ, చాంద్రాయణగుట్ట, బార్కస్, సంతోష్‌నగర్, బహదూర్‌పుర తదితర ప్రాంతాల్లో నిజాం కాలం నాటి వందలాది ఇళ్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొన్ని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్నాయి. ఏటా వర్షాకాలం ముందు ఆయా ఇళ్లకు హెచ్చరిక బోర్డులు తగిలించడం, నోటీసులిచ్చి చేతులు దులుపుకోవడం టౌన్ ప్లానింగ్ అధికారులకు అలవాటుగా మారింది. కాలనీల్లోకి వెళ్లి ప్రమాదాలను అంచనా వేయడంలో యంత్రాంగం విఫలమవుతోందనే మాటలు వినిపిస్తున్నాయి.

**ఆయా ప్రాంతాల్లోనే అధికం..**

బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఇమ్లిబన్, కోఠి, సికింద్రాబాద్, కార్వాన్, మెహిదీపట్నం, గోల్కొండ, బోరబండ తదితర ప్రాంతాల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు వందలాదిగా ఉన్నాయి. బలహీనంగా ఉండే నిర్మాణాలు సుమారు 10వేలు ఉండొచ్చని అంచనా. జీహెచ్‌ఎంసీ మాత్రం ఏటా సర్వేలో 500 నుంచి 600 భవనాలను గుర్తించి మమ అనిపిస్తోంది.

**పలు ఘటనలు**

జులై 20, 2019న సికింద్రాబాద్ చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ వర్షానికి ఇంటి పైకప్పు కూలింది. ఈ ఘటనలో ఓ చిన్నారి మృతి చెందింది.జులై 26, 2020న మెహిదీపట్నం మాంగార్‌బస్తీలోని ఓ శిథిల భవనం గోడ కూలి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. అప్పట్నుంచి ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మరణాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.వాంబే, ఇందిరమ్మ గృహాలు, హౌసింగ్ బోర్డు కాలనీల్లో..మెహిదీపట్నంలోని మాంగార్‌బస్తీలో మూడు దశాబ్దాల కిందట నిర్మించిన 200ల వాంబే గృహాలు ప్రమాదకరంగా మారాయి. 80శాతం మేర స్లాబులు, కారిడార్లు పెచ్చులూడాయి. అధికారులు అక్కడి వారిని ఇళ్లు ఖాళీ చేయాలని చెబుతున్నారు. పాతవి కూల్చి అక్కడే పక్కా ఇళ్లను కట్టిస్తామని రాతపూర్వక హామీ ఇస్తేనే కదులుతామని నివాసితులు చెబుతున్నారు.

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ, కైత్లాపూర్ వాంబే, రాజీవ్ గృహకల్ప ఇళ్లు, అదే రకానికి చెందిన జగద్గిరిగుట్ట, ఎల్లమ్మబండ, బాచుపల్లి ప్రాంతాల్లోని ఇళ్లు కూడా శిథిలావస్థలో ఉన్నాయి. ఎప్పుడైనా కూలిపోవచ్చని తెలిసినప్పటికీ అందులోనే నివాసం ఉంటున్నారు.

కార్యాలయం పైకప్పు కూలి ఆబ్కారీ కానిస్టేబుల్‌కు గాయాలు

షాద్‌నగర్‌లోని ఆబ్కారీ కార్యాలయం పైకప్పు ముందు భాగం ఉన్నట్టుండి కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వర్షాల కారణంగానే శిథిలావస్థలోని భవనం పైకప్పు కూలిపోయినట్లు భావిస్తున్నారు. గాయపడిన కానిస్టేబుల్‌కు స్థానికంగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించారు.

# యువ వికాసం.. ఎందరికో అవకాశం




బొంరాస్‌పేట: యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసానికి నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్ 14 వరకు జిల్లావ్యాప్తంగా 50,197 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వాటిని ఆయా మండలాల అధికారులు పరిశీలించారు.

**ఎంపిక కమిటీ ఏర్పాటు..**

లబ్ధిదారుల ఎంపికకు మండల ప్రత్యేకాధికారి కన్వీనర్‌గా.. ఎంపీడీవో, బ్యాంకు మేనేజరు, కార్పొరేషన్ అధికారితో కమిటీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సిబిల్ స్కోరు మెరుగ్గా ఉన్నవారిని ఎంపిక చేసి దరఖాస్తులను జిల్లాకు పంపించారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కొంతమందికి ఆర్థిక సాయం మంజూరు చేస్తారని భావిస్తున్నారు. గత భారాస ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ప్రస్తుతం సిబిల్ స్కోరు ఆధారంగా ఎంపిక చేయనుండడంతో అవకాశం ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ నిరుద్యోగుల్లో నెలకొంది.

**రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు..**

ఈ పథకం కింద ఎంపికైన వారికి రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలిస్తారు. ఇందులో బ్యాంకు రుణం కొంత, మిగిలింది వివిధ కార్పొరేషన్లు రాయితీగా అందిస్తాయి. యువత నచ్చిన యూనిట్లు నెలకొల్పి జీవనోపాధి పొందాలి. రూ.50 వేల యూనిట్‌కు కార్పొరేషన్లు పూర్తి రాయితీ ఇస్తున్నాయి. రూ.లక్షలోపు రుణం తీసుకుంటే 80 శాతం, రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు తీసుకుంటే 70 శాతం, రూ.4 లక్షలు తీసుకుంటే 60 శాతం రాయితీ వర్తిస్తుంది. మిగతాది బ్యాంకు రుణం. బ్యాంకు రుణం ఇచ్చేందుకు ఒప్పుకుంటేనే పథకం మంజూరవుతుంది. వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా బీసీలవే ఉన్నాయి.

**సెప్టెంబరు వరకు కొనసాగనున్న ప్రక్రియ..**

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సెప్టెంబరు వరకు కొనసాగనుంది. జూన్‌లో రూ.లక్షలోపు రుణాలు ఇవ్వనున్నారు. జులైలో రూ.2 లక్షలు, ఆగస్టులో రూ.3 లక్షలు, సెప్టెంబరులో రూ.4 లక్షల రుణాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. యూనిట్లను మార్చుకోవడానికి ప్రభుత్వం అభ్యర్థులకు అవకాశమిచ్చింది. గతంలో నిరుద్యోగులకు ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలను మంజూరు చేసినా బ్యాంకులు ఇవ్వలేదు. దీంతో చాలామంది నిరుత్సాహానికి గురయ్యారు. ఇప్పుడు ఎంపికైన అభ్యర్థులందరికీ సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

# అందుబాటులో నాణ్యమైన విద్య

సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాగా అవతరించిన తర్వాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా కావాల్సిన వసతులు, సౌకర్యాలు కల్పిస్తుండటంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నారు. ఇంటర్ విద్యార్థులకు ప్రయోగశాలలు, విశాలమైన ఆట స్థలాలు, తరగతి గదులు, కంప్యూటర్ విద్యాబోధన అందుబాటులో ఉన్నాయి. ఓ వైపు ఇంటర్ తరగతులు నిర్వహిస్తూనే.. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులపై విద్యార్థులకు అధ్యాపకులు మార్గదర్శనం చేస్తున్నారు. ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.

**అన్నింటికీ సొంత భవనాలు**

జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అన్నింటికీ సొంత భవనాలు అందుబాటులో ఉన్నాయి. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేటల్లో పురాతన భవనాలు ఉండగా.. అవి శిథిలావస్థకు చేరాయి. కోనరావుపేట, చందుర్తిలలో ప్రహరీలు లేవు. కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీతో పాటు ఒకేషనల్(వృత్తివిద్య) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2024-25 విద్యాసంవత్సరంలో ప్రథమ సంవత్సరంలో 13,000, ద్వితీయలో 980 మంది చదువుకున్నారు. ప్రథమంలో 51 శాతం, ద్వితీయంలో 52 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2025-26 నూతన విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు మొదటి సంవత్సరంలో దాదాపు 400 మంది విద్యార్థులు చేరినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు.

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 10

ప్రభుత్వ అధ్యాపకులు 93

ఒప్పంద 7



అతిథి 8

**గతంతో పోలిస్తే మెరుగైన ఫలితాలు**

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతంలో పోలిస్తే ఇప్పుడు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో వివిధ కోర్సులకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. నాణ్యమైన విద్యతోపాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. కోనరావుపేట, చందుర్తి కళాశాలకు ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు సమకూరిన తరువాత గోడ నిర్మిస్తాం. పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించాలి.శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

# స్వచ్ఛతకు 'వంద'నం

కరీంనగర్ : పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం.. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనే సామర్థ్యం కల్పించే దిశగా పురపాలక శాఖ అన్ని నగరాలు, పట్టణాల్లో వంద రోజుల ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ప్రతి రోజు 'ఒక చర్య.. ఒక మార్పు' అనే నినాదంతో ప్రజా భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ఈ నెల 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు 50 అంశాలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**వ్యర్థాల వేరుపై ప్రచారం**

రద్దీ ప్రాంతాల్లో, నివాస గృహాల్లో పరిసరాల పరిశుభ్రతపై మైక్ ద్వారా ప్రచారం.వీధుల్లో పిచ్చి మొక్కల తొలగింపు.

తడి, పొడి చెత్తను వేరు చేసేలా అవగాహన కల్పించడం.

పరిసరాల శుభ్రతపై ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అతికించడం.

వేస్ట్ ఆడిట్ నిర్వహించడం.

ఇంటింటికీ అవగాహన

చెత్తను వేరు చేయడం, పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడం.

స్వశక్తి సంఘాలు, ఎన్‌జీవోలు, ప్రజాప్రతినిధులు, వార్డు అధికారులు, పారిశుద్ధ్య కార్మికులను భాగస్వాములను చేయడం.

బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేయడం.

గోడ చిత్రాలు

పరిశుభ్రత, చెత్త నిర్వహణ, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రతపై గోడ చిత్రాలు రాయించడం.

అభివృద్ధి పనులకు సంబంధించిన బొమ్మలను ఆకట్టుకునేలా గీయించడం.

స్వచ్ఛతపై క్విజ్, పెయింటింగ్, రచన, రంగోలి కార్యక్రమాల నిర్వహణ.

జూన్ 2.. కార్యాచరణ ప్రారంభం

సిబ్బందికి, వాలంటీర్లకు శిక్షణ, ర్యాలీలు, ప్రతిజ్ఞ నిర్వహణ, ప్రచార వ్యూహాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.

అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, నోడల్ అధికారుల నియామకం.

**పూడికతీత పనులు**

వర్షం నీరు సక్రమంగా ప్రవహించేలా రహదారులపై చెత్తా చెదారం



తొలగింపు.వరద కాలువల్లోని పూడికను తొలగించడం.

పారిశుద్ధ్య కార్మికులు, యంత్రాలు, పరికరాలు సమకూర్చుకోవడం.

దోమల నియంత్రణ డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం.

నిల్వ నీటిలో దోమల లార్వా పెరగకుండా ఆయిల్ బాల్స్, గంబూసియా చేప పిల్లలను వదలడం.

సులభ్ కాంప్లెక్స్‌ల తనిఖీ

నగరాలు, పట్టణాల్లోని సులభ్ కాంప్లెక్స్‌ల తనిఖీ. శుభ్రతపై పర్యవేక్షణ. నిర్వహణ, వినియోగంపై అభిప్రాయాల సేకరణ.

కంపోస్టు ఎరువు తయారీ

తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన కల్పించడం.

చెత్తను వేరు చేసే డబ్బాల పంపిణీ.

డంపింగ్‌యార్డుకు చెత్త తగ్గించేలా చూడటం.

పాఠశాలలో కంపోస్టు యూనిట్ ఏర్పాటు.

బర్తన్ బ్యాంకులు

ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ సామగ్రి వినియోగం తగ్గించేందుకు బర్తన్(స్టీల్ పాత్రల) బ్యాంకుల ఏర్పాటు.

కరీంనగర్ నగరపాలికలో స్వశక్తి సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న ఈ బ్యాంకుల ద్వారా ప్రతి వేడుకలో ఉక్కు, గాజు, స్టీలు పాత్రలు వాడేలా ప్రచారం చేయడం.

# అధికారుల అలసత్వం.. పూడికపై నిర్లక్ష్యం

గోదావరిఖని : ఈ ఏడాది తొలకరి ముందుగానే పలకరించింది. త్వరలోనే భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ముందస్తుగానే నగరాలు, పట్టణాల్లోని వరదకాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. వరద, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త వరద ప్రవాహానికి అడ్డుపడటంతో సమీప ఇళ్లల్లోకి వరద చేరుతోంది. ఈ నేపథ్యంలో నగర, పురపాలక అధికారులు స్పందించి ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తేనే ఆయా ప్రాంతాల్లో వరద ముంపు తప్పే అవకాశముంది.

**ముందు చూపుతోనే నివారణ**

రామగుండం నగరపాలక ప్రాంతంలోని ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనుల కోసం టెండర్లు నిర్వహించగా గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో తాజాగా మరోసారి పిలిచారు. దీంతో మురుగు కాలువల నిర్వహణ ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం అత్యవసరమైన చోట మాత్రం పూడిక తీస్తున్నారు.గోదావరిఖనిలోని 2ఎ వంతెన, ఫైవింక్లయిన్ వంతెన, కళ్యాన్‌నగర్‌లోని ఉల్లిగడ్డల బజారు, సంజయ్‌గాంధీనగర్, శాంతినగర్, ప్రశాంత్‌నగర్, రామగుండంలోని పాత అంగడి బజారు ప్రాంతాల్లో వరదలు ముంచెత్తే ప్రమాదముంది. గోదావరిఖనిలోని బి.ఎస్.ఎన్.ఎల్. క్వార్టర్లు, మైదానంలోని వర్షం నీరు బయటకు వెళ్లేందుకు సరైన వ్యవస్థ లేక క్వార్టర్లు జలమయమవుతాయి. పెద్దపల్లి నుంచి కరీంనగర్ ప్రధాన రహదారిలో ఆర్టీవో కార్యాలయం వద్ద వరద రాజీవ్ రహదారిని ముంచెత్తుతుంది. ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సి వస్తుంది. మంథనిలో ప్రధాన మురుగు కాలువల్లో పూడిక తీత పనులను దాదాపు పూర్తిచేయగా 100 రోజుల ప్రణాళికలో మిగతా ప్రాంతాల్లోని అంతర్గత, ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. వర్షం కురిసిందంటే చాలు సుల్తానాబాద్‌లోని స్వప్న కాలనీ జలమయమవుతుంది. ఈ ప్రాంతంలోని వరద, మురుగు కాలువల్లో పూడికను ఇటీవలే పురపాలిక తొలగించింది. మిగతా ప్రాంతాల్లోని వరద, మురుగు కాలువల్లో పూడికతీత పనులను చేపడుతున్నారు.

వరదకాలువల వివరాలు

రామగుండం 32.5 కి.మీ

సుల్తానాబాద్ 15.0 కి.మీ

మంథని 12.5 కి.మీ

పెద్దపల్లి 4.5 కి.మీ

## విలీనం.. అభివృద్ధికి దూరం

వేములవాడ: మున్సిపాలిటీలో తమ గ్రామాలు విలీనమైతే మెరుగైన అభివృద్ధి ఉంటుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. వీధుల్లో కనీసం మురుగు కాలువలు, సీసీ రోడ్ల వసతి నేటికీ సమకూరడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ మున్సిపాలిటీలో తిప్పాపూర్, నాంపల్లి, అయ్యోరుపల్లి, శాత్రాజుపల్లి, కోనాయిపల్లి గ్రామాలను ఐదేళ్ల క్రితం విలీనం చేశారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల పరిపాలన మున్సిపల్ పరిధిలోకి వెళ్లి పోయింది. అప్పటి నుంచి తమకు సమస్యలు మొదలయ్యాయని ప్రజలు అంటున్నారు. ఏచిన్న పని కావాలన్నా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాల్సి రావడంతో సమస్యలు మరింత పెరిగాయి. చాలా దూరంలో ఉన్న గ్రామాలను సైతం మున్సిపల్‌లో విలీనం చేయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. నాంపల్లి, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి గ్రామాలు పట్టణానికి దాదాపు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. ఏదేని అవసరాలకు వేములవాడలోని మున్సిపల్ కార్యాలయానికి రావడం తమకు ఇబ్బందిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**శివారు కాలనీల్లోనూ...**

ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణం రోజు రోజుకూ విస్తరిస్తుండటంతో శివారు ప్రాంతాల్లో కొత్తగా కాలనీలు వెలుస్తున్నాయి. ఈ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. పట్టణం చుట్టూ బైపాస్ రహదారులు, శివారు వీధులతో పాటు సాయినగర్, కోరుట్ల వైపు రోడ్డు, మల్లారం రోడ్డు, తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు నేటికీ లేవు. పట్టణం నుంచి మల్లారం వెళ్లే ప్రధాన రోడ్డు వెంబడి మురుగు కాలువ లేక పెద్ద ఎత్తున మురుగు రోడ్డుపై పారుతోంది. దుర్గంధం వెదజల్లడంతో తాము రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఆయా నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని అంటున్నారు. లేకుంటే వర్షాకాలంలో మురుగు సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

**మౌలిక వసతులేవీ...**

విలీన గ్రామాల్లో మౌలిక వసతులు అంతంతమాత్రమే ఉన్నాయి. చాలా గ్రామాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల సదుపాయం లేదు. వర్షాకాలంలో చాలా వీధులు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ మన్సిపల్‌లో రెండేళ్ల క్రితం టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.20 కోట్లతో పాటు ఇతరత్రా నిధులను మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి వెచ్చించినప్పటికీ అవి సరిపోలేదు. చాలా గ్రామాల్లోని అంతర్గత వీధుల్లో మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. వర్షాకాలంలో మురుగు వీధుల్లో పారుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమస్యలు మొరపెట్టుకున్నా పరిష్కారం కావడం లేదని అంటున్నారు.

**నిధులు మంజూరు కావాల్సి ఉంది**

గతంలో మంజూరైన నిధులతో పట్టణంలోని వివిధ వార్డులతో పాటు విలీన గ్రామాల్లోనూ మురుగు కాలువలు, సీసీ రోడ్ల పనులు చేపట్టాము. పలుచోట్ల ఇంకా మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

## ఆర్టీవో కార్యాలయానికి మోక్షమెప్పుడో..!

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గం మారుమూల గిరిజన ఏజెన్సీ ప్రాంతం. నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న ఈ ప్రాంతంలో 60 శాతం వరకు గిరిజనులే నివసిస్తున్నారు. నిరక్షరాస్యత ఎక్కువగా ఉండి ఉపాధి కోసం వలసలు వెళ్లే ప్రాంతంలో 2013లో ఆర్టీఓ కార్యాలయం మంజూరైనప్పటికీ దశాబ్ద కాలంగా దాని ఏర్పాటు కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. వాహనదారులు లైసెన్సు పొందాలన్నా.. రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా.. తిప్పలు తప్పడం లేదు. డివిజన్‌లో చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి, గుడిపల్లి, గుర్రంపోడ్, చింతపల్లి, కొండమల్లేపల్లి, దేవరకొండ మండలాలున్నాయి. డిండి మండలం నాగర్‌కర్నూల్ జిల్లాను ఆవరించి ఉంటుంది. అంటే దేవరకొండకు 40 కి.మీ దూరంగా విసిరేసినట్లుగా ఉంటుంది. చందంపేట మండలం పొగిళ్ల గ్రామం దేవరకొండకు 60 కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది. దాదాపు కృష్ణాపరివాహక ప్రాంతంలో గ్రామాలుంటాయి. వీరు వాహనాలు కొనుగోలు చేసినప్పుడు వాటి రిజిస్ట్రేషన్, లైసెన్సు రెన్యువల్, ఓనర్‌షిప్ మార్పిడి, ఫిట్‌నెస్ చేపట్టాలంటే మిర్యాలగూడకు తీసుకొని వెళ్లాల్సిందే. మిర్యాలగూడ దాదాపు 130 నుంచి 150 కిమీ వరకు ఉంటుంది.



డివిజన్‌లో దాదాపు 30వేల ద్విచక్రవాహనాలు, 5వేల వరకు ఆటోలు, 10వేల నాలుగు చక్రాల వాహనాలున్నాయి. ట్రాక్టర్లు దాదాపు 3వేల వరకు ఉంటాయి. వీటితోపాటు లారీలు 2500 ఉంటాయి.

వాహనదారులకు ఇక్కట్లు:

శ్రీనివాసాచారి, దేవరకొండ

డివిజన్‌లో ఆర్టీవో కార్యాలయం లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ కోసం దేవరకొండ నుంచి 80 కిమీ దూరంలో ఉన్న మిర్యాలగూడకు వెళ్లాలంటే ఒకరోజు సమయం పడుతుంది.

**ఏర్పాటుకు కృషి:**

నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్యే

నియోజకవర్గంలో ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు కోసం తన వంతుగా కృషిచేస్తున్నా. సంబంధిత అధికారులతో ఇప్పటికే దీనిపై చర్చించాం.

# అప్రమత్తతతోనే రక్ష



గోదావరిఖని: జగిత్యాల జిల్లాలో గతేడాది పోక్సో కేసుల్లో ఎనిమిది మందికి జైలు శిక్ష విధించారు. అయిదుగురికి జీవిత ఖైదుతోపాటు రూ.30 వేల చొప్పున జరిమానా విధించారు. మరో ముగ్గురు నిందితులకు అయిదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.15 వేల చొప్పున జరిమానా విధించారు. ఉమ్మడి జిల్లాలో తరచూ పోక్సో కేసులు నమోదవుతున్న తీరు బాలికల విషయంలో తల్లిదండ్రులు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేస్తున్నాయి.. అభం శుభం తెలియని చిన్నారులపై లైంగిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ చట్టం తీసుకు వచ్చింది. అయినా అమానుష చర్యలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. మరోవైపు చిన్న వయసులోనే ప్రేమల పేరిట మైనారిటీ తీరని బాలికలను వివాహాలు చేసుకుంటున్న వారు కూడా ఈ చట్టం చేతికి చిక్కుతున్నారు. ఉమ్మడి జిల్లాలో గతేడాది మొత్తం 116 పోక్సో కేసులు నమోదు కాగా, ఈ ఏడాది నాలుగు నెలల్లోనే 87 కేసులు నమోదు కావడం గమనార్హం. చిన్న వయసు నుంచే బాలికలకు స్వీయ రక్షణ చర్యలు తెలియజేయడంతోపాటు చట్టం ఎంత పదునైనదో జనంలో అవగాహన కలిగిస్తేనే ఇలాంటి అఘాయిత్యాలు తగ్గే అవకాశం ఉంది.

**బాలల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

తల్లిదండ్రులిద్దరూ పనులకు వెళితే ఒంటరిగా ఇంట్లో ఉండే పిల్లల రక్షణకు ఏర్పాట్లు చేయాలి

గుడ్, బ్యాడ్ టచ్ గురించి చిన్న వయసులోనే అవగాహన కలిగించాలి.

స్వీయ రక్షణ చర్యలు నేర్పించాలి.

ఒంటరిగా ఎక్కడికి వెళ్లకూడదని, వెళ్లాల్సి వచ్చినప్పుడు ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించాలి.

చిన్న వయసులో ప్రేమలతో కలిగే నష్టం తెలియజేయాలి.

కౌమార వయసులో బాలికలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారిలో కలిగే శారీరక, మానసిక మార్పులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలి. పిల్లలు సామాజిక మాధ్యమాలు ఎలా వినియోగిస్తున్నారో పరిశీలిస్తూ, అపరిచితులతో పరిచయాలు పెంచుకున్నట్లు గమనిస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అపరిచితులతో స్నేహాలతో కలిగే నష్టాలపై అవగాహన కలిగించాలి.

2012లో పోక్సో చట్టం ప్రవేశ పెట్టారు

ఈ చట్టం కింద నేరం రుజువైతే జీవిత ఖైదు విధించే అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలో ప్రత్యేక కోర్టులోనే విచారణ చేస్తారు. దీనికి ప్రత్యేక జడ్జి ఉంటారు. 18 సంవత్సరాల లోపు ఉన్న బాలబాలికలపై జరిగే దాడులు పోక్సో చట్టం కిందకు వస్తాయి. పోక్సో కేసుల్లో 18 సంవత్సరాలలోపు బాలురు నిందితులైనా వారికి ఎలాంటి మినహాయింపులు ఉండవు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ చేపడతారు. విచారణకు వచ్చే బాధితులు ఎవరికీ కనిపించకుండా చర్యలు చేపడతారు.

# టెండర్లలో వైఫల్యం



జగిత్యాల : జగిత్యాల పట్టణంలో ప్రధాన కూడళ్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పట్టణం జిల్లాకేంద్రంగా రూపాంతరం చెందడం.. జనాభాతోపాటు వాహనాలు పెరిగి రద్దీ తీవ్రం కావడంతో కూడళ్ల వద్ద ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ కింద రూ.22 లక్షలు వెచ్చించి కూడళ్ల ఆధునికీకరణకు సమాయత్తమైంది. పట్టణంలో 11 కూడళ్లను ఎంపిక చేశారు. ఈ ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ చేపట్టి సిగ్నలింగ్ వ్యవస్థ రూపొందించాలని భావించారు. కానీ నిధులు లేవనే కారణంతో ఏడు సార్లు టెండరు నిర్వహించినా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కూడళ్ల విస్తరణ అంశం పూర్తిగా అటకెక్కింది.

**ట్రాఫిక్‌కు అంతరాయం..** పట్టణంలో 11 ప్రధాన కూడళ్లున్నాయి. కొత్తబస్టాండు, వాణీనగర్, బీట్‌బజార్, తహసీల్‌చౌరస్తా, గీతావిద్యాలయం చౌరస్తా, అన్నపూర్ణ, బస్సుడిపో, ఐఎంఏ, మంచినీళ్లబావి, గొల్లపల్లిరోడ్డు తదితర కూడళ్లు నిత్యం రద్దీతో ఉంటాయి. ప్రధాన రహదారిలో మూడుచోట్ల ట్రాఫిక్ సిగ్నళ్లు ఉన్నా అవి పనిచేయడంలేదు. ట్రాఫిక్ సిబ్బంది, సిగ్నళ్లు లేకపోవడం, సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వెళ్తున్నారు. కొందరు అపసవ్య దిశ(రాంగ్‌రూట్)లోనూ రావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నెల కిందట గీతావిద్యాలయం వెళ్లే కూడలిలో ముగ్గురు మైనర్లు వాహనం నడిపి ఓ వ్యక్తి మరణానికి కారణమయ్యారు. ఇదే ప్రాంతంలో ఒకే నెలలో మూడు ప్రమాదాలు జరిగాయి. ద్విచక్ర వాహనదారుడు వ్యాను కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వాణీనగర్ చౌరస్తాలో వారం కిందట ద్విచక్రవాహనదారుడు బస్సుకింద పడి మృతిచెందాడు. **పెరిగిన వాహనాల రద్దీ** ప్రస్తుతం జిల్లాకేంద్రం కావడంతో పట్టణంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ప్రధానంగా తహసీల్‌చౌరస్తా, పాతబస్టాండు, గీతావిద్యాల యం, బస్సుడిపో, ఐఎంఏ జయశంకర్, గొల్లపల్లిరోడ్డులో కూడళ్లు ఇరుకుగా మారాయి. బస్సుడిపో వద్ద

వైద్య కళాశాల, మాతాశిశు సంరక్షణ కేంద్రం, డిపో, టీహబ్, పోలీసు ఠాణా, కలెక్టరేట్ సముదా యం అన్నీ ఒకేచోట ఉండటంతో నిత్యం వేలల్లో వాహనాలు వస్తుం టాయి. ఇక్కడ ఎలాంటి సూచికలు, రహదారి నిబంధనలు లేకపోవ డంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాతబస్టాండులో సాధారణ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, ప్రయాణ ప్రాంగణం, విద్యా సంస్థలు, ఆసుపత్రులు ఉండటంతో ఇక్కడ కాలు కదపలేని పరిస్థితి నెలకొంది. ఈ కూడళ్లను వెంటనే ఆధునికీకరించాలని స్థానికులు కోరుతున్నారు.

# గుణాత్మక బోధన.. గుణాత్మక శిక్షణ

పాల్వంచ: తెలంగాణలో కొన్ని గురుకులాలు కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్నాయి. మారుమూల గ్రామీణ, పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్యులుగా, ఇంజినీర్లుగా స్థిరపడే సువర్ణావకాశం కల్పిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'(సీఓఈ) గురుకులాలు అందుబాటులో ఉన్నాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లి 'జేఈఈ', 'నీట్' లాంటి జాతీయ పోటీ పరీక్షల శిక్షణకు రూ.లక్షలు వెచ్చించలేని పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ గురుకులాలు కొన్నింటిలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'(సీఓఈ)లు కొనసాగుతున్నాయి. వీటిలో సాధారణ ఇంటర్మీడియట్ బోధనతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సంబంధించిన శిక్షణ లభిస్తుంది. ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు జేఈఈ, నీట్ వంటి పరీక్షల్లో సత్తా చాటుతున్నారు. తాజాగా బీసీ గురుకులాలను 'సీఓఈ'లుగా మార్చేందుకు అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల్లో ఒక్కో గురుకులాన్ని 'సీఓఈ'గా మార్చనున్నారు.

**ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి..**

సాధారణంగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందితే విద్యార్థులు ఇంటర్ బోర్డు పరీక్షలకు సిద్ధమవుతుంటారు. 'సీఓఈ'లో చేరిన రోజు నుంచే నీట్, జేఈఈ వంటి పరీక్షల శిక్షణ మొదలవుతుంది. ఎంపీసీ, బైపీసీ కోర్సుల విద్యార్థులకే తర్ఫీదు ఉంటుంది. రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక బోధన కొనసాగుతుంది. ఇంటర్మీడియట్ అధ్యాపకులతో పాటు సబ్జెక్టు అసోసియేట్స్ నిపుణులు బోధిస్తారు. సాధారణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒక్కో పీరియడ్‌కు 45 నిమిషాలు ఉంటే.. ఇక్కడ రెండు గంటల పాటు సమయం కేటాయిస్తారు. ఓ గంట పాటు బోధించి మరో గంట చదివిస్తారు. 'నీట్' కోసం బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులు, జేఈఈ




అడ్వాన్స్‌డ్, మెయిన్స్ కోసం మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధిస్తారు. వారానికోసారి స్లిప్ టెస్టులు, నెలవారీగా గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రతిభను అధ్యాపకులు సమీక్షిస్తారు. ప్రత్యేక మెనూ అమలుచేస్తారు. వసతి సైతం అదేస్థాయిలో ఉంటుంది.

2025-26 విద్యాసంవత్సరం ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ప్రవేశ పరీక్ష కాకుండా విద్యార్థులు పదోతరగతిలో చూపించిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తాం. ప్రధానంగా సీఓఈలో ఇంటర్ విద్యతో పాటు జేఈఈ, నీట్ లాంటి జాతీయ పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తుంటాం. ఇంటర్మీడియట్ పరీక్షల్లోనూ రాష్ట్రస్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. సీఓఈలో కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. అన్వేష్, ప్రిన్సిపల్, లక్ష్మీదేవిపల్లి సీఓఈ

ఉభయ జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ సీఓఈలు

ఖమ్మం ఎస్సీ అంబేడ్కర్ సీఓఈ

ఖమ్మం (దానవాయిగూడెం) ఎస్సీ సీఓఈ

పాల్వంచ (లక్ష్మీదేవిపల్లి) ఎస్సీ సీఓఈ

పాల్వంచ (కిన్నెరసాని) ఎస్టీ సీఓఈ

భద్రాచలం ఎస్టీ సీఈఓ

దమ్మపేట ఎస్టీ సీఓఈ

ఏకలవ్య ఆదర్శ మోడల్ స్కూల్ (పాల్వంచ) సీఈఓ

## పల్లెల్లో ఆర్థిక సౌరభాలు

నల్గొండ : రైతులు, మహిళా సంఘాలు, ఇతరులు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అర్హులకు ప్రయోజనం అందించేందుకు పీఎం కేయిఎస్‌యుఎం-ఏ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని, బంజరు భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రెడ్కో సంస్థ అర్హత కలిగిన రైతుల నుంచి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నిలకడగా 25 సంవత్సరాల పాటు ఆదాయం పొందే ప్రాజెక్టు ఇది. ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హులెవరంటే..రైతులు(వ్యక్తిగతంగా), రైతు ఉత్పత్తి సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మండల గ్రామ సమాఖ్యలు, పంచాయతీ స్థానిక సంస్థలు భూమిని లీజుకు తీసుకొని కూడా సౌర ప్లాంట్ యూనిట్‌ను నిర్ణీత సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవచ్చు.

ముఖ్యాంశాలిలా..

మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం

ఒక్కో యూనిట్ సామర్థ్యం: 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల



వరకు. ఒక మెగావాట్ సౌర విద్యుదుత్పత్తికి మూడున్నర నుంచి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.

ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీ-ఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం కొనుగోలు చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: %www.tgredco.telangana.gov.in% ను సంప్రదించాలి.

పూర్తి సమాచారం, సందేహాలు నివృత్తికి..రెడ్కో జిల్లా కార్యాలయం నల్గొండలో సంప్రదించాలి. టెలిఫోన్ నంబర్: 08682 224447, చరవాణి నెంబరు: 98318 78596, 63049 03923 సంప్రదించవచ్చు.

**భూములు పరిశీలిస్తున్నాం**

పాండురంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ

ఉపయోగంలో లేని భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిపై మహిళా సంఘాలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసి సమాచారం పొందవచ్చు. కలెక్టర్ ఆదేశంతో నల్గొండ జిల్లాలో సౌర విద్యుదుత్పత్తికి కావాల్సిన ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పరిశీలించాల్సి ఉంది.

## నాణ్యతా ప్రమాణాలు పట్టేదెవరికి?

పెద్దపల్లి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉద్దేశించిన ఈ-నామ్ వ్యవస్థ వ్యాపారులకు వరంగా మారింది. పెద్దపల్లి మార్కెట్‌లో రైతులు తెచ్చిన పత్తికి నాణ్యతతో సంబంధం లేకుండా ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ విషయంలో భారత పత్తి సంస్థ(సీసీఐ) చెల్లించే మద్దతు ధరను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రస్తుత సీజన్ ఆరంభంలో 8 శాతం తేమ కలిగిన పత్తి క్వింటాలుకు రూ.7,520 ఉండగా ఇటీవల నాణ్యత తగ్గిందనే ఉద్దేశంతో సీసీఐ మద్దతు రూ.7,430కు కుదించింది. పత్తిలోని వివిధ ప్రమాణాల స్థాయిని బట్టి మద్దతు ధర అటు ఇటుగా మారుతోంది. **పట్టించుకోని అధికారులు** సీసీఐ పత్తిలో 8-12 వరకు తేమ శాతాన్ని అనుమతిస్తుంది. నిబంధనల ప్రకారం ఒక శాతం తేమ పెరిగితే ధర కూడా ఒక శాతం తగ్గుతుంది. 12 శాతం ఉంటే రూ.7,132కు కొనుగోలు చేస్తుంది. ఈ నిబంధనను వ్యాపారులకు వర్తింపజేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. శుక్రవారం పెద్దపల్లి మార్కెట్‌కు వచ్చిన పత్తిలో తేమ 18 శాతం ఉండగా ధర రూ.5003గా నిర్ణయించారు. ఈ మేరకు సంచిపై మార్కర్‌తో రాశారు. నిబంధనల ప్రకారం రూ.6,687 వరకు చెల్లించాలి. మార్కెట్‌లో నమోదైన గరిష్ఠ ధరను ప్రామాణికంగా తీసుకున్నా రూ.6,319 చెల్లించాలి. శుక్రవారం మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.7,022 వరకు నమోదైంది. అయితే ఇవేవీ వ్యాపారులకు ప్రామాణికంగా కనిపించడం లేదు.

**వ్యాపారికి నచ్చిందే ధర**

పెద్దపల్లి మార్కెట్‌లో 11 మంది క్రియాశీలక అడ్తీదారులుండగా వీరి వద్ద 7 నుంచి 8 మంది కొనుగోలుదారులు ఖరీదు చేస్తున్నారు.

వారం రోజులుగా ఇద్దరు, ముగ్గురు కొనుగోలుదారులే తీసుకుంటున్నారు. మిల్లర్లు మార్కెట్‌వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక ఆన్‌లైన్‌లో ఇతర మార్కెట్‌కు చెందిన ట్రేడర్లు కొనుగోలు చేసే స్థాయిలో వ్యవస్థం అభివృద్ధి చెందలేదు. నాణ్యతను నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేవు. సిబ్బందిని కూడా నియమించలేదు.

## బుక్కుతున్న డిపాజిత్తులు

నంద్యాల : పాములపాడు మండలం కనకయ్య కొట్టాలలో కేసీ కాల్వ 13వ డిస్ట్రిబ్యూటరీలో పనులు చేసినట్లు ఎం.బుక్కులు చేశారు. రూ.1.40 కోట్లతో చేసిన ఈ పనులకు సంబంధించి రూ.70 వేల డిపాజిట్ మొత్తం తిరిగి చెల్లించేందుకు రూ.5 వేల వరకు వసూలు చేశారు. బండి ఆత్మకూరు మండలం సంతజూటూరు నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలం వరకు జరిగిన పనులకు ఒక్కో బిల్లుకు రూ.1500 వరకు వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది. కేసీ కాల్వ పరిధిలో 2018లో చేసిన నీరు- చెట్టు పనుల డిపాజిట్ మొత్తాలకు సంబంధించి కొన్ని రోజులుగా ఎం.బుక్కులు చేస్తున్నారు. ఆయా పనులకు తుది(ఫైనల్) బిల్లు చేయాలంటే కచ్చితంగా నిర్ణీత మొత్తం లంచం ఇవ్వాల్సిందేనని కొంతమంది అధికారులు, సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే బిల్లులు చేయడం లేదని గుత్తేదారులు గగ్గోలుపెడుతున్నారు.

కార్యాలయంలో కాసుక్కూర్చున్నారు

ఉమ్మడి జిల్లా పరిధిలో కేసీ కాల్వ పొడవునా 2 వేల వరకు పనులు జరిగాయి. ఆయా పనులకు సంబంధించి గుత్తేదారులకు డిపాజిట్ మొత్తం రూ.3 కోట్ల వరకు చెల్లించాల్సిన ఉంది. నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 30 ఎం.బుక్కులకు సంబంధించి రూ.10 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. 500 మంది గుత్తేదారులకు ఒక్కొక్కరికి రూ.70 వేల నుంచి రూ.27 వేలు చొప్పున డిపాజిట్ మొత్తాలు తిరిగి ఇవ్వాల్సి ఉంది. రూ.27 వేలు రావాల్సిన గుత్తేదారుల నుంచి రూ.1500, రూ.70 వేలు రావాల్సిన వారి నుంచి రూ.2,500 వరకు కేసీ సిబ్బంది వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవ్వకుంటే పక్కన పెట్టేస్తారుఅడిగినంత ఇవ్వకుంటే ఎం.బుక్కులు కార్యాలయాల్లోనే ఉండిపోతున్నాయి. ఈ మొత్తాలు త్వరగా ఇస్తే పే అండ్ అకౌంట్స్ కార్యాలయానికి వెళ్తాయి. లేదంటే కేసీ కార్యాలయా ల్లోనే పేరుకుపోతున్నాయి. నందికొట్కూరు, బండిఆత్మకూరు, గడివేముల, శిరివెళ్ల మండలాలకు చెందిన కొన్ని పనులకు అడిగినంత ఇవ్వకపోవడంతో రోజులకొద్దీ ఎం.బుక్కులు కార్యాలయంలోనే ఉండిపోయాయి. చివరికి గుత్తేదారులు దిగొచ్చాకే బిల్లులయ్యాయి. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ గుత్తేదారు అధికారులను ప్రసన్నం చేసుకోవడంతో పెద్ద మొత్తంలో బిల్లులు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రూ.350 కోట్ల పనులకు చెల్లింపులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కేసీ కాల్వ పరిధిలో 2018లో నీరు- చెట్టు పనులు జరిగాయి. వీటిని సుంకేసుల ఆనకట్ట నుంచి చాగలమర్రి మండలం రాజోలి వరకు సుమారు 180 కి.మీల పొడవున చేపట్టారు. రూ.350 కోట్లు వెచ్చించి చెరువుల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్, ఆయకట్టు పరిధిలోని పొలాల్లో మట్టి రహదారులు వంటి పనులు చేశారు.

# సీజన్ మొదలైనా.. వసతులు కరవు

బంగారుపాళ్యం : మామిడి కాయల విక్రయాల్లో పేరుగాంచిన బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మౌలిక వసతులు కొరవడి రైతులు, వ్యాపారులు, మండీ వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.. ఈ ఏడాది సీజన్ ఇప్పుడిప్పుడే మొదలైంది.. అయినా ఇప్పటివరకు సౌకర్యాలు కల్పించకపోవడంపై ఆయా వర్గాలు నిరాశగా ఉన్నాయి.. అసలు వసతులు కల్పిస్తారో..? లేదో..? అని ఎదురుచూ స్తున్నాయి. స్థానిక మార్కెట్ యార్డులో ఏటా మామిడి కాయల సీజన్‌లో ఐదు నెలలు క్రయవిక్రయాలు జరుగుతాయి. కోట్లాది రూపాయల విలువైన కాయలను పంజాబ్, మహారాష్ట్ర, బిహార్, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలతో పాటు జిల్లాలోని పండ్ల గుజ్జు పరిశ్రమలకు తరలిస్తారు. పలమనేరు, కుప్పం, పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల నుంచి రైతులు మామిడి కాయలను ట్రాక్టర్లు, లారీలు, ఆటోలు తదితర వాహనాల్లో ఇక్కడి యార్డుకు తీసుకొస్తారు. ఇక్కడ 500 మందికి పైగా కూలీలు, వ్యాపారులతో మార్కెట్‌యార్డు రాత్రింబవళ్లు సందడిగా ఉంటుంది. కాయల కొనుగోలుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు, కూలీలు, రైతులు మౌలిక వసతులు లేమితో అవస్థలు పడుతున్నారు. మార్కెట్ యార్డులో శుద్ధి నీటి కేంద్రం లేదు. దీంతో ప్రైవేటు వారి వద్ద నుంచి నీరు కొనుగోలు చేసి మరీ తెచ్చుకుంటు



న్నారు. పదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రముఖ యార్డులో తగినన్ని వసతులు లేక కొనుగోలుదారులు, వ్యాపారుల తిప్పలు చెప్పనలవికావు. కనీసం మరుగుదొడ్లకు వెళ్లాలన్నా అవస్థే. అత్యవసరమైన నీటి కుళాయిలు లేవంటే ఇక్కడి పరిస్థితి ఎలాఉందో వేరే చెప్పనక్కర్లేదు. మరుగుదొడ్లు ఉన్నా కొన్నింటికి నీటి వసతి లేక పోవడంతో నిరుపయో గంగా ఉన్నాయి. దీంతో యార్డులోని మహిళా కూలీల తిప్పలు వర్ణనాతీతం. వారు ఎటు వెళ్లాలో తెలియక లోలోన మదనపడుతున్నా రు. ఇటీవల ఛైర్మన్‌గా నియమితులైన భాస్కర్ నాయుడు.. ఇక్కడి సమస్యలపై దృష్టి సారించి సమన్వయంతో వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

**వసతులు కల్పిస్తాం**

మామిడి కాయల క్రయవిక్రయాల యార్డుకు వచ్చే వ్యాపారులు, రైతులు, కూలీలకు వసతులు కల్పిస్తాం. ఇందుకు ప్రణాళిక రూపొందిం చాం. గంగయ్య, కార్యదర్శి, మార్కెట్ కమిటీ

# విద్యార్థుల జీవితాలకు.. నవోదయం

మదనపల్లె : గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేసింది. ఏటా ప్రవేశ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. మదనపల్లె మండలం వలసపల్లె నవోదయ విద్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకునేందుకు జూన్ 1న నోటిఫికేషన్ విడుదల చేశారు.

**విద్యాలయంలో సౌకర్యాలు..**

జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 12వ తరగతి వరకు ఇక్కడే ఉచిత విద్య పొందవచ్చు.



అలాగే భోజన, వసతి, దుస్తులు, పుస్తకాలు అందజేస్తారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి గృహాలున్నాయి. రన్నింగ్ ట్రాక్, మైదానం ఉంది. ప్రతి ఏటా వివిధ విద్యాలయాల నుంచి వచ్చిన విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తారు. సంగీతం, నృత్యం, ఎన్‌సీసీ, కరాటేలో శిక్షణ ఇస్తారు.

**పరీక్ష విధానం ఇలా...**

ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో మొత్తం 100 మర్కులకు ప్రశ్నలుం టాయి. మెంటల్ ఎబిలిటీ 40 ప్రశ్నలకు 50 మార్కులు, అర్థమెటిక్‌లో 20 ప్రశ్నలకు 25 మార్కులు, ల్యాంగ్వేజ్‌లో 20 ప్రశ్నలకు 25 మార్కులుంటాయి. వీటిలో విద్యార్థులు అర్హత సాధించాల్సి ఉంటుంది. జులై 29వ తేదీ ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ. దరఖాస్తు చేసుకున్న వారికి 2025 డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష ఉండనుంది.

**అర్హులు వీరే...**

విద్యార్థులు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2025-26 అయిదో తరగతి చదువుతున్న వారై ఉండాలి. విద్యాలయంలో ప్రవేశానికి గ్రామీణ విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల కోటాలో చేరాలనుకునే విద్యార్థులు 3, 4, 5 తరగతులు ఆ ప్రాంతాల్లోనే చదివి ఉండాలి. మొత్తం సీట్లలో మూడో వంతు బాలికలకు కేటాయిస్తారు.

**విద్యార్థులు సద్వినియోగం చేసుకోండి**

మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో చేరే అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో ఏఏ మండలాలైతే ఉన్నాయో వారంతా అర్హులే. అన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వేలాయుధన్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, నవోదయ విద్యాలయం

# ఎగుమతుల్లో వేగం.. కంటైనర్ డిపోతో సాకారం



అనంతపురం : ఎగుమతులు, దిగుమతుల్లో కీలకమైన ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో (ఐసీడీ) చిత్తూరు జిల్లావాసుల కల. డ్రైపోర్టులుగా వీటిని అభివర్ణిస్తుంటారు. స్థానికంగా అందుబాటులోకి వస్తే ప్రధానంగా వ్యవసాయ, ఉద్యాన, పారిశ్రామిక ఎగుమతులు జోరందుకుంటాయి. గత ప్రభుత్వ హయాంలోనే గుడిపాల మండలం సిద్ధంపల్లి కేంద్రంగా అందుబాటులోకి వస్తుందని ఘనంగా ప్రకటించి చివరకు చేతులెత్తేశారు. పారిశ్రామికంగా ఉమ్మడి జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ అంశంపై కూటమి ప్రభుత్వం వెంటనే దృష్టిపెడితే ఎన్నో ప్రయోజనాలు ఒనగూరుతాయి.

చిత్తూరు జిల్లా నుంచి మామిడి, గ్రానైట్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులు.. తిరుపతి జిల్లా నుంచి పారిశ్రామిక ఉత్పత్తులు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. గుజ్జు పరిశ్రమలకు సంబంధించిన యంత్రాలు దిగుమతి చేసుకుంటున్నారు. ఇందుకోసం వ్యాపారులు ఎక్కువగా చెన్నైలోని ఎన్నూర్ నౌకాశ్రయం ఆశ్రయిస్తున్నారు. అతితక్కువగా నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం వెళ్తున్నారు. మామిడి, గ్రానైట్ కంటైనర్లు దాదాపు 20,000 వరకు విదేశాలకు వెళ్తుండగా వివిధ పరిశ్రమల నుంచి మరో 15-20 వేల కంటైనర్లలో సరకు ఎగుమతి అవుతోంది.

**పెట్టుబడికి ఢోకా లేదు..** ఐసీడీ ఏర్పాటుకు అవసరమైన భూమిని ఎప్పుడో గుర్తించారు. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఒకరిద్దరు పెట్టుబడిదారులు వచ్చి స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. అయితే అధికారులు భూముల ధరలు ఎక్కువగా నిర్ణయించారని వారు వెనుకడుగు వేసినట్లు సమాచారం. మరోవైపు ఏడాదికి 6,000 కంటైనర్ల వరకు వ్యాపారం జరిగితే పెట్టుబడికి ఎలాంటి నష్టం ఉండదని, మనదగ్గర దాదాపు 40,00 కంటైనర్లు ఎగుమతి అవుతున్నందున భారీగా లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుందని, ఈ అంశంపై కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులను ఆహ్వానించి వారి సమస్యలపై చర్చించి పరిష్కరిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**కంటైనర్‌పై రూ.20 వేల వరకు మిగులు**

ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి జిల్లాల ఉత్పత్తులు చెన్నైకి తీసుకెళ్లడంతో అదనంగా రవాణా భారం పడుతోంది. స్థానికంగా ఏర్పాటయితే ఒక్కో కంటైనర్‌పై కనీసం రూ.15-20 వేలు మిగులుతుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీనికితోడు ఇక్కడి లారీ యజమానులకు వ్యాపారం దొరుకుతుంది. తద్వారా రవాణా రంగంలో వందలాది మందికి ఉపాధి లభిస్తుంది. ఎగుమతుల కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు ఆదాయం వస్తుంది.

**సమస్యలు, ప్రయోజనాలు ఇలా..**

నౌకాశ్రయానికి ఒక్కోసారి భారీగా సరకువస్తే డాక్యుమెంటేషన్‌కు 15-20 రోజుల వరకు నిరీక్షణ తప్పడం లేదు. రద్దీ లేకున్నా తక్కువలో తక్కువ నాలుగైదు రోజులు పడుతుంది. అదే మనదగ్గర తాత్కాలిక హ్యాండ్లింగ్ కేంద్రం అందుబాటులోకి వస్తే కస్టమ్స్ అనుమతుల ప్రక్రియ సులువుగా పూర్తవుతుంది. డాక్యుమెంటేషన్ ప్రక్రియ ఒకట్రెండు రోజుల్లో పూర్తవుతుంది. చెన్నైకి వెళ్లే అవస్థలు తప్పుతాయి. కంటైనర్ల కొరతను అధిగమించే అవకాశం ఉంటుంది. నిల్వ సామర్థ్యం సైతం పెరుగుతుంది. తమిళనాడులోని క్రిష్ణగిరికి చెందిన వ్యాపారులు సైతం ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. ఇలా చిత్తూరు, తిరుపతి, తమిళనాడు తోపాటు సమీప రాయలసీమ జిల్లాలు సైతం ఆశ్రయించడంతో ఎగుమతులు జోరందుకునే అవకాశం ఉంటుంది.

# విత్తులోనే.. విలాపం



చిత్తూరు : త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది.. జిల్లాను ముందస్తు తొలకరి వర్షాలు పలకరించాయి.. రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు.. వ్యవసాయ శాఖ ఖరీఫ్ ప్రణాళిక ప్రకటించింది.. అయితే కేటాయింపుల్లో భారీ కోత పెట్టింది.. సీజన్ ముంచుకొస్తున్నప్పటికీ జిల్లాకు అరాకొరగా విత్తు కేటాయింపు, సరఫరా జరిగింది.. ఈ నెల నాలుగో తేదీ నుంచి పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించారు.. కోత కారణంగా ఈ ఏడాది కష్టాలు తప్పవా అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో వర్షాధార పంటగా వేరుసెనగ సాగు చేస్తారు. దీని సాధారణ సాగు విస్తీర్ణం 51వేల హెక్టార్లు. పలమనేరు, చిత్తూరు, పూతలపట్టు, పుంగనూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లోని మండలాల్లో వేరుసెనగ విస్తారంగా సాగవుతుంది. నగరి నియోజకవర్గంలో ఖరీఫ్‌లో తక్కువగా, రబీలో ఎక్కువగా పండిస్తారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు రాయితీ విత్తు 26,234 క్వింటాళ్లు రైతులకు అందజేయాలని కేటాయించారు. గతేడాది 41 వేల క్వింటాళ్లు ఇచ్చారు. ఈ ఏడాది అనూహ్యంగా వాస్తవ కోటాలో 15 వేల క్వింటాళ్లు తగ్గించారు. ఈ ప్రభావం సాగుపై పడనుంది. అదనపు కోటాకు ప్రతిపాదనలు పంపి నెలరోజులు కావస్తున్నా అతీగతీ లేదు. అరకొర విత్తును ఎలా పంపిణీ చేయాలో.. రైతులకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదని వ్యవసాయ శాఖ అధికారులు మదనపడుతున్నారు. రాష్ట్రస్థాయి అధికారుల అనాలోచిత నిర్ణయాలు శాపంగా మారాయని, కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవాలనే రాష్ట్ర, జిల్లా స్థాయిలో కొందరు అధికారులు కంకణం కట్టుకున్నారనే ఆరోపణలు మరోవైపు ఉన్నాయి.

**ప్రశ్నించలేరా..?** జిల్లాకు కేటాయించిన విత్తులో గతేడాదితో పోలిస్తే 15 వేల క్వింటాళ్లు కోత పెట్టారు. సీఎం చంద్రబాబు సొంత జిల్లాకే ఇంత పెద్దఎత్తున కోత పెట్టడంతో ఆ శాఖ అధికారులే విస్తుపోతున్నారు. స్పందించాల్సిన జిల్లా ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారనే ప్రశ్న రైతుల నుంచి వినిపిస్తోంది. అసలు వీరికి ఈ సమస్యపై అవగాహన ఉందా అనేది అనుమానమే.

**అదనపు కోటాకు ప్రతిపాదనలు..**

విత్తన కొరత వాస్తవమే. అదనపు కోటాకు ప్రతిపాదనలు పంపాం. రాష్ట్ర అధికారులతో మాట్లాడుతున్నాం. అర్హులైన ప్రతి రైతుకు రాయితీ విత్తు పంపిణీకి చర్యలు తీసుకుంటాం. మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, చిత్తూరు

# అస్తవ్యస్త విస్తరణ



అనకాపల్లి : కొన్ని కథలు కంచికి చేరవు.. అలా కొనసాగుతూనే ఉంటాయి. అనకాపల్లిలో రహదారుల విస్తరణ కూడా ఇలా కంచికి చేరని కథలా సాగుతూనే ఉంది. అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారాక ప్రజల రాకపోకలు.. వాహనాల రద్దీ విపరీతంగా పెరిగాయి. ఇందుకు అనుగుణంగా పట్టణ రహదారులు లేవు. వాహనదారుల ఇబ్బందులు తీరుస్తామంటూ విస్తరణ ప్రక్రియ మొదలుపెట్టినా పూర్తి చేయలేకపోతున్నారు. అసంపూర్తి.. అస్తవ్యస్త విస్తరణ పనులతో పట్టణ ప్రజలు.. పడరాని కష్టాలు పడుతున్నారు.

**ఆలయానికి రావాలంటే అవస్థలే :** ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మ ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఇరుగ్గా ఉన్న ఆలయ రహదారిని విస్తరించాలని కొన్నేళ్లగా చెప్పడం మినహా ఆచరణలోకి రావడం లేదు. ఈ రహదారి 2.2 కిలోమీటర్లు పొడవు ఉంది. విస్తరణకు 189 భవనాలు ఆటంకంగా ఉన్నట్లు గుర్తించారు. ముందుగా ప్రభుత్వ భవనాలకు చెందిన ప్రహరీలను తెదేపా ప్రభుత్వ హయాంలోనే తొలగించారు. తర్వాత అయిదు పర్యాయాలు ప్రణాళికా విభాగం అధికారులు కొలతలు తీశారు. ఇంతకన్నా ఒక్క అడుగు ముందుకు పడలేదు. దూరప్రాం తాలకు చెందిన భక్తులు ఆటోలు, కార్లు, వ్యాన్లులో వస్తుంటారు. వాహనదారులు తరచూ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు.


**అలా వదిలేశారు:** రైల్వేస్టేషన్ నుంచి చోడవరం రహదారిలోకి చేరాలంటే నాయిళ్లవీధి మీదుగా రావాలి. ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ.. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో దీనిని 60 అడుగులకు విస్తరించారు. ఆరు భవనాల యజమానులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వాటి జోలికి పోలేదు. మిగిలిన రహదారిని విస్తరించి నూతనంగా రహదారి ఏర్పాటు చేశారు. కొన్ని భవనాలు అడ్డుగా ఉన్నందున ఇబ్బందులు తప్పడం లేదు. చింతావారి వీధిదీ ఇదే పరిస్థితి. దీని పొడవు 0.2 కిలోమీటర్లు. తెదేపా ప్రభుత్వ హయాంలో విస్తరణ మొదలుపెట్టారు. మొత్తం 56 భవనాలు ఉండగా వాటిలో.. 48 తొలగించి రహదారిని విస్తరించారు. మిగిలినవారు న్యాయస్థానాలను ఆశ్రయించారు. వాస్తవానికి న్యాయ స్థానాల్లో కేసులు వేసిన వారితో సంప్రదించి వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి. ప్రజాప్రతినిధులు, ప్రణాళికా విభాగం అధికారులు వాటి జోలికి పోవడం లేదు. దీనివలన నాయిళ్ల, చింతావారి వీధులను విస్తరించినా పూర్తి స్థాయి ప్రయోజనం చేకూరలేదు.

**అష్టవంకర్లతో పెరుగుబజారు:** పట్టణంలోని వ్యాపార కేంద్రాల్లో పెరుగుబజారు రోడ్డు ముఖ్యమైనది. ఇక్కడ అనేక కిరాణా, బంగారం, ఫ్యాన్సీ, వస్త్రాలు, రెడీమేడ్ దుస్తుల వ్యాపారాలు ఉన్నాయి. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ రహదారి విస్తరణ పనులు తెదేపా హయాంలోనే ప్రారంభించినా ఇంతవరకు పూర్తి కాలేదు. ఈ మార్గాన్ని అష్టవంకర్లతో 50 అడుగుల మేర విస్తరించారు. ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించారు. రహదారి నిర్మాణం మాత్రం చేపట్టలేదు. దీనిపై పలు ఆరోపణలు రావడంతో జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. ఇటీవల జిల్లా సర్వే అధికారులు తిరిగి కొలతలు తీశారు. కొంత మందికి టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది.

జీవీఎంసీ జోనల్ కమిషనర్ బి.వి.రమణను వివరణ కోరగా ప్రణాళికా విభాగంలో సిబ్బంది కొరత కారణంగా కొంత ఆలస్యం అవుతోందని చెప్పారు. పెరుగు బజారులో మిగిలిన వారికి టీడీఆర్‌లు త్వరలోనే ఇస్తామన్నారు. న్యాయస్థానాల్లో కేసులు వేసిన వారితో సంప్రదింపులు చేస్తామని తెలిపారు. నూకాలమ్మ రహదారి విస్తరణ పనులు చేపడతామని వివరించారు.

# ఆవకు రక్షిత కవచం

అచ్యుతాపురం : జిల్లాకే విశిష్టమైన కొండకర్ల ఆవను సంరక్షించడానికి ఎట్టకేలకు అధికారులు ముందుకొచ్చారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యపు కోరలకు చిక్కి రూపు కోల్పోతున్న ఈ జలవనరును భద్రంగా కాపాడేదిశగా కొండకర్ల ఆవను రక్షిత ప్రాంతంగా గుర్తించారు. అరుదైన జీవజాలం మనుగడకు, ఈ ప్రాంత రైతులకు ఈ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందని ప్రకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొల్లేరు తరవాత అతిపెద్ద మంచినీటి సరస్సు కొండకర్ల ఆవ. అచ్యుతాపురం, మునగపాక మండలాల పరిధిలో చుట్టూ కొండల మధ్య సువిశాలంగా విస్తరించి ఉంటుంది. పర్యాటకంతోపాటు పరిసర రైతులకు సాగునీటికి, ఈ ప్రాంతంలో భూగర్భజలాల పెంపునకు ఇది దోహదపడుతోంది. అనకాపల్లి శారదా నది నుంచి కొండకర్ల ఆవకు వర్షాకాలంలో ప్రతి ఏడాది నీరు వస్తుంది. దేశ, విదేశాలకు చెందిన 170 రకాలైన పక్షులు ఆవలో నివాసం ఏర్పాటు చేసుకుని సంతానోత్పత్తి చేస్తుంటాయి. వీటితోపాటు అరుదైన నీటి కుక్కలు, పిల్లలు ఇక్కడ నివాసం ఉంటాయి. తూర్పుకోస్తా పరిరక్షణ నిపుణుల బృందం ఇటీవల కొండకర్ల ఆవలో సర్వే నిర్వహించి ఇక్కడ అరుదైన నీటికుక్కలతోపాటు అంతరించిపోయే జాతుల్లో ఉన్న కుందేళ్లు, కొండచిలువలు, అరుదైన చేపలు ఇక్కడ ఉంటున్నాయని నిర్ధారించారు. ఆవ చుట్టూ ప్రత్యేకమైన ట్రాప్ కెమెరాలను ఏర్పాటుచేసి



మరీ వీటి ఉనికిని గుర్తించారు. జీవవైవిధ్య నిధిగా మారిన కొండకర్ల ఆవను రక్షిత ప్రాంతంగా గుర్తించడంతో వీటన్నింటికీ రక్షణ లభిస్తుంది. పర్యాటకం నిమిత్తం పర్యావరణాన్ని ధ్వంసం చేయకుండా ఈ నిర్ణయం దోహదపడుతుంది. ప్రస్తుతం ఆవ స్వరక్షణకు సంబంధించి ఏ శాఖా బాధ్యత వహించడం లేదు. పర్యాటక, జలవనరుల శాఖ రెండూ ఇది తమకు సంబంధించి వ్యవహారం కాదంటూ తప్పుకొంటున్నాయి. రక్షిత ప్రాంతంగా ప్రకటించిన నేపథ్యంలో ఇకపై కొండకర్ల ఆవలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. జంతువుల వేట, చెట్ల నరికివేతపై నిషేధం ఉంటుంది.

విస్తీర్ణం : 2 వేల ఎకరాలు
ఆధారపడిన గ్రామాలు: 25
మత్స్యకార కుటుంబాలు : 250
పర్యాటకుల సంఖ్య : ఏటా 20 వేల వరకు


గుర్తించడం ఆనందం : కొండకర్ల ఆవను రక్షిత ప్రాంతంగా గుర్తించడం చాలా ఆనందంగా ఉంది. దీని పరిధిలో రైతులతోపాటు దీనిపై ఆధారపడే మత్స్యకారులకు ఈ నిర్ణయంతో ఎంతో మేలు జరిగింది. వెంటనే సర్వే నిర్వహించి చుట్టూ హద్దులు పక్కాగా నిర్ణయించాలి. రక్షిత ప్రాంతంగా గుర్తించడం వల్ల ఈ జలవనరును భవిష్యత్తులో ఆక్రమణల పాలవకుండా రక్షించడానికి అవకాశం ఉంటుంది. కాండ్రేగుల జోగినాయుడు, ఆవనీటి సంఘం అధ్యక్షుడు, హరిపాలెం

మత్స్యకారులకు మేలు : కొండకర్ల ఆవపై ఆధారపడిన కొండకర్ల, వాడ్రాపల్లికి చెందిన పలు కుటుంబాలు చేపల వేటతోపాటు ప్రకృతి ప్రేమికులకు ఆవ అందాలను చూపిస్తూ జీవనం సాగిస్తున్నాయి. ఆవను రక్షిత ప్రాంతంగా గుర్తించడం వల్ల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతోంది. ఆక్రమణలను అడ్డుకోవడానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుంది. మత్స్యకారులు మేలు జరిగే నిర్ణయంగా భావిస్తున్నాం. పిల్లి గోవిందరావు, మత్స్యకారుడు, కొండకర్ల

# పూర్వ వైభవం దిశగా గోదావరి!

ఉండి : పశ్చిమలో ఖరీఫ్ వరి సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. గత ప్రభుత్వ హయాంలో కాలువల అభివృద్ధి, నిర్వహణ పనులపై నిర్లక్ష్యం వహించడంతో వరి సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఇటీవల పలు చోట్ల కాలువల్లో మట్టి పూడికతీత పనులు చేపట్టడంతో ఈ సారి 3 వేల ఎకరాల్లో అదనంగా వరి సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

ఎంటీయూ 1318 రకానిదే అగ్రస్థానం.. జిల్లాలో వరి సాగుకు అనువైన భూముల విస్తీర్ణం 2.89 లక్షల ఎకరాలు. గతేడాది 2.05 లక్షల ఎకరాల్లోనే పంట పండింది. ఈ ఏడాది 2,08,736 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. ప్రధానంగా ఎకరానికి 3,050 కిలోల వరకు ఉత్పత్తినిచ్చే ఎంటీయూ 1318 వరి రకాన్ని 97,834 ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉందని గుర్తించారు. తర్వాత స్థానంలో ఎంటీయూ 7029 (స్వర్ణ) 47,505 ఎకరాల్లో, పీఆర్ 126 రకం 11,290 ఎకరాల్లో సాగయ్యే అవకాశాలున్నాయి. ఖరీఫ్ సాగుకు



52,500 క్వింటాళ్ల విత్తనాలు అవసరం. రైతుల నుంచి అత్యధికంగా 47,675 క్వింటాళ్ల వరకు సేకరించుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రైవేటు డీలర్ల నుంచి 4,600 క్వింటాళ్లు అందుబాటులో ఉంటాయి. మరో 225 క్వింటాళ్ల విత్తనాలను రాయితీపై శాఖాపరంగా సరఫరా చేయనున్నారు.

**1.05 లక్షల మందికి సీసీఆర్‌సీ కార్డులు**

ఈ ఏడాది 1,05 లక్షల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులివ్వాలనేది లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు ఒక్క శాతం కూడా పంపిణీ పూర్తి కాలేదు. తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌లో అత్యధికంగా 40,004, తదుపరి స్థానాల్లో నరసాపురం- 38,297, భీమవరం- 26,299 మందికి కార్డులివ్వాలనేది లక్ష్యం.

గతేడాది కౌలు రైతులకు రూ.357 కోట్ల మేర రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా రూ.247 కోట్లే అందించగలిగారు. ఈ ఏడాది ఆ మొత్తాన్ని అధిగమించాలనే యోచనతో ముందుకెళ్తున్నారు. మొత్తం రుణ ప్రణాళిక రూ.5,050 కోట్లుగా నిర్దేశించుకున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. నారుమడులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కాలువలకు నీరొచ్చిన వెంటనే రైతులు నారుమడులు వేసుకోవాలని సూచించారు.

# మరీ.. ఇంత జాప్యమా?

చిత్తూరు : కొత్త బియ్యం కార్డు పొందాలనుకుని ఎంతోకాలంగా నిరీక్షిస్తున్న వారికి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది.. ఈ నేపథ్యంలో దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా అందుతున్నాయి.. నిర్దేశిత రోజుల్లో బియ్యం కార్డుల సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.. అయితే కొందరు మండల, క్షేత్రస్థాయి అధికారులు దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. కొన్ని మండలాల్లో గ్రామ సచివాలయ ఉద్యోగులతోపాటు దళారులు వసూళ్ల పర్వం మొదలుపెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.. మే ఏడో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు.. జిల్లాలో ఇప్పటి వరకు 39,791 దరఖాస్తులు అందాయి.. వీటిని సత్వరమే పరిశీలించి ఆమోదించడంలో రెవెన్యూ అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారని దరఖాస్తులు ఆరోపిస్తున్నారు.

**అర్బన్‌లోనే భారీగా పెండింగ్..**

బియ్యం కార్డులకు సంబంధించి లబ్ధిదారులు ఏడు రకాల సేవలకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటారు. క్షేత్రస్థాయి అధికారులు వాటిని పరిశీలించి అర్హుల దరఖాస్తులు తహసీల్దార్ లాగిన్‌కు పంపుతారు. తహసీల్దార్ డిజిటల్ కీతో ఆమోదించగానే నూతన కార్డుల జారీతో పాటు అన్ని సేవలు పూర్తవుతాయి. చిత్తూరు



అర్బన్‌లో బియ్యం కార్డుల సమస్యలకు 2,314 దరఖాస్తులు అందాయి. వీటిలో 1,540 దరఖాస్తులు తహసీల్దార్ లాగిన్‌లోనే నేటికీ పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలోనే అత్యధికంగా చిత్తూరు అర్బన్‌లో పెండింగ్‌లో ఉండటం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి నిర్దేశిత లక్ష్యం ప్రకారం బియ్యం కార్డు సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**వచ్చిన దరఖాస్తులు ఇలా..**

చిరునామా మార్పు : 841
ఆధార్ సవరణకు : 532
సభ్యుల చేరికకు : 30,464
సభ్యుడి తొలగింపునకు : 672
కొత్త కార్డుకు : 3,926
కార్డు విభజనకు : 3,301
కార్డు సరెండర్ : 41
చౌక దుకాణం నవీకరణకు : 14

# కన్నలి కాల్వకు.. తూట్లు

శ్రీకాళహస్తి : స్థిరాస్తి వ్యాపారులు, రైస్ మిల్లర్లు కన్నలి కాల్వకు తూట్లు పొడుస్తున్నారు. శ్రీకాళహస్తిలోని దాదాపు ఏడు వార్డులకు సంబంధించిన కాల్వల్లో వచ్చే వర్షపునీరు వెళ్లేందుకు వీలుగా ఈ కాల్వను అభివృద్ధి చేశారు. పట్టణం నుంచి తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం మీదుగా కన్నలి చెరువు వరకు లింకు కాల్వ ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఈ కాల్వ అభివృద్ధికి తెదేపా హయాంలో పురపాలక సంఘానికి చెందిన రూ.2 కోట్లు నిధులు వెచ్చించి పటిష్ఠ పరిచారు. వైకాపా హయాంలో నిధులు ఇస్తామంటూనే పుణ్యకాలాన్ని పూర్తిచేశారు. ఈ పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

**అడుగడుగునా తవ్వకాలు..**



జలవనరుల శాఖ పరిధిలో ఉన్న ఈ కాల్వలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే విధిగా సంబంధిత అధికారులు ఆమోదం అవసరం. అయితే ఇటీవల కాలంలో వ్యాపారులు, రైస్ మిల్లర్లు తమంతట తాము కాల్వను తవ్వేసి పైపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా పైపులు అమర్చుకోవడంతో కాల్వ వెడల్పు తగ్గిపోవడంతో పాటు రానున్న రోజుల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారే అవకాశముంది. రాత్రికి రాత్రి ఓ రైస్‌మిల్ యజమాని జేసీబీ సాయంతో ఎంచక్కా కాల్వను తవ్వేసి పైపులు అమర్చడం పట్ల విమర్శలు గుప్పుమన్నాయి. దీంతో చాలా దూరం కాల్వ పూర్తిగా పూడిపోయింది. మళ్లీ కాల్వ తవ్వకాలు చేపట్టాలంటే వ్యయంతో కూడిన పని. ఇలాంటి అనధికారిక తవ్వకాలు జరగకుండా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు.. కాల్వలో పైపులు అమర్చుకునేందుకు ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదు. పనులు చేస్తుండటం మా దృష్టికి వచ్చింది. అక్కడి ఆయకట్టు ఛైర్మన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించాం. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం .నాగరాజు, ఏఈ, జలవనరుల శాఖ, తొట్టంబేడు

# హస్తకళల అభివృద్ధిలో అస్త్రసన్యాసం

శ్రీకాళహస్తి : హస్తకళలకు కాణాచిగా శ్రీకాళహస్తి ఎంతో ప్రాభవం సంతరించుకుంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన వాటి అభ్యున్నతికి కేంద్ర జౌళిశాఖ సైతం స్పందించి హస్తకళా గ్రామం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వైకాపా ప్రభుత్వం పుణ్యామాని పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

శ్రీకాళహస్తి కలంకారీతోపాటు ఇక్కడి కొయ్యబొమ్మలకు ఎంతో గుర్తింపు ఉంది. ఏర్పేడులోని మాధమాల, పాపానాయుడుపేట, కేవీబీపురంలోని కర్లపూడి, బీఎన్‌కండ్రిగలోని పల్లమాలతోపాటు తిరుపతి గ్రామీణ ప్రాంతాల్లో వెదురుతో తయారు చేసే ఎన్నో వస్తువులకు డిమాండ్ ఉంటోంది. చేనేత వస్త్రాలకు గుర్తింపు లభిస్తోంది. పర్యాటకుల ఆసక్తికి తగ్గట్టు హైదరాబాదులోని హైటెక్‌సిటీ తరహాలో ఇక్కడ హస్తకళల గ్రామం (క్రాఫ్ట్ విలేజ్) ఏర్పాటుకు భవన నిర్మాణ పనులు 2020 ఫిబ్రవరిలో ప్రారంభించారు. ఆర్‌అండ్‌బీ పర్యవేక్షణలో జరిగే ఈ పనులకు ప్రభుత్వం రూ.7.5 కోట్లు నిర్ణయించింది. తొలివిడతగా రూ.4.77 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో వివిధ కళలకు అవసరమైన రీతిలో భవనాలు నిర్మించారు. వసతుల కల్పనకు మరింత నిధులు మంజూరు చేయాల్సి ఉంది. అనుకున్న ప్రకారం 2022 జూన్ నాటికి పనులు పూర్తికావాల్సి ఉండగా వైకాపా ప్రభుత్వం నిస్తేజంగా వ్యవహరించింది.

**అసాంఘిక కార్యక్రమాలు**

హస్తకళా గ్రామం ఏర్పాటుకు నిర్మించిన భవనాలు అసంపూర్తిగా ఉండటంతో శిథిలాలుగా మారుతున్నాయి. ఇదివరకు తిరుపతి–రేణిగుంట రోడ్డుకు సమీపంలో ఉండగా ఆరు వరుసల జాతీయ రహదారి పనులతో ఇక్కడి భవనాలు మరుగునపడిపోయాయి. దీంతోపాటు ఖాళీగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు ఆనవాళ్లుగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ ప్రాజెక్టుకు మోక్షం కలుగుతుందని హస్త కళాకారులు ఎంతో ఆశతో ఉన్నారు.

# లేదు పర్మిట్టు.. అమ్మేస్తున్నారు ఇష్టం వచ్చినట్టు!



అనంతపురం : జిల్లాలో మద్యం విక్రయాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. దుకాణాలను దక్కించుకున్న గుత్తేదారులు లాభాపేక్షతో ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా రేయి, పగలు తేడా లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. మద్యం అమ్మకాలు మూడు పువ్వులు..ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయి. నగరంలో 30 దుకాణాలు ఉండగా, రూరల్‌లో 4 ఉన్నాయి.

**ప్రతి దుకాణానికీ..**

ప్రతి దుకాణం వద్ద అనధికారికంగా గదులు, డాబాలు ఏర్పాటు చేసుకున్నారు. నగర శివారులోని రుద్రంపేట వద్ద దుకాణం నివాస గృహాల మధ్య ఉంది. దుకాణం గోదాముకు అనుసంధానంగా ఉంది. అర్ధరాత్రి దాకా అమ్మకాలు జరుగుతుంటాయి. మందుబాబులు మత్తులో అల్లరి చేస్తూ స్థానికులకు నిద్ర లేకుండా చేస్తున్నారు.

అలాగే కళ్యాణదుర్గం బైపాసు నుంచి బళ్లారి బైపాసు కూడలి మధ్య సర్వీసు రోడ్డుకు ఆనుకుని ఉన్న ఓ దుకాణం.. ఆ దుకాణం ఉన్న భవనం పైభాగాన్ని పర్మిట్టు గదిగా ఏర్పాటు చేశారు.

నగరంలో సోమనాథనగర్‌కు సమీపంలో ఉన్న దుకాణంలో కొనుగోలు చేసిన వారు తాగడానికి వెనుకభాగంలో డాబా ఏర్పాటు చేశారు.

**ఎమ్మార్పీ ధరలపై రూ.10 అదనం**

ప్రతి మద్యం సీసాపై ప్రభుత్వం 14 శాతం కమిషన్ ఇస్తోంది. ఇది చాలదన్నట్లు గుత్తేదారులు సీసాపై రూ.10లు అదనంగా అమ్ముతున్నారు. మీడియాలో కథనాలు, ఫిర్యాదులు వెల్లడంతో ఇటీవల పాతూరులోని ఓ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా ధరలు పెంపు నిజమేనని తేలింది.

**లోపించిన పర్యవేక్షణ**

అబ్కారీ అధికారుల పర్యవేక్షణ లోపభూయిష్టంగా ఉండటంతో మద్యం అమ్మకాల్లో నిబంధనలు, ఆదేశాలను గాలికి వదిలేస్తున్నారు. ఒక్కో దుకాణం నుంచి డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి నెలకు రూ.20 వేలు (ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు రూ.10 వేలు), ఈఎస్ కార్యాలయానికి రూ.13 వేలు, స్టేటు టాస్క్‌ఫోర్స్‌కు రూ.3 వేలు, లోకల్ పోలీస్ స్టేషనుకు రూ.25 వేల చొప్పున దుకాణదారులు మామూళ్లు సమర్పిస్తున్నట్లు తెలిసింది.

**నిబంధనలు పాటించాల్సిందే**నాగమద్దయ్య, డిప్యూటీ కమిషనర్, అనంతపురం ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి దుకాణదారుడు నిబంధనలు పాటించాల్సిందే. దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10వరకు మాత్రమే నడవాలి. ఎన్‌ఫోర్స్‌మెంటు, టాస్క్‌ఫోర్సు, స్థానిక ఎక్సైజ్ స్టేషన్ల పోలీసుల ద్వారా దాడులు చేయిస్తాం. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు అమ్మితే జరిమానాతో పాటు దుకాణం అనుమతులు రద్దు చేస్తాం.

# పరిహారం.. అయోమయం..!



అనంతపురం : ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న బైపాస్ నిర్మాణంలో పరిహారం అందక భూనిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. భూమి సేకరించిన తర్వాత పరిహారం తక్కువగా ఇస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఒప్పుకోవడం లేదు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామంటూ వారు హెచ్చరికలు చేస్తున్నారు. తమకు పరిహారం పెంచే వరకూ ముదిగుబ్బలోని బైపాస్ నిర్మాణ పనులు జరగనివ్వమని గత నెల 26వ తేదీ నుంచి రైతులు ఆందోళన చేస్తున్నారు. వారం రోజులుగా నిర్మాణ పనులు అడ్డుకుంటూ నిరసనలు చేపట్టారు.

**1.6 కిలోమీటర్ల బైపాస్ నిర్మాణం**

342వ జాతీయ రహదారిని ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి రూ.300 కోట్లతో 10 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. అందులో భాగంగా ముదిగుబ్బలో 1.6 కిలోమీటర్ల బైపాస్ నిర్మాణానికి 16 ఎకరాల భూమిని సేకరించారు. సుమారు 20 మంది రైతులు భూములు కోల్పోతున్నారు. ముదిగుబ్బ శివారులో ఎకరం భూమి మార్కెట్ విలువ ప్రకారం రూ.కోటి ధర పలుకుతుంటే రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా రూ.లక్షల్లో పరిహారం అందజేస్తున్నారు. అందులో గుంజేపల్లి పరిధిలోని భూములకు ఎకరానికి రూ.12 లక్షలు, దొరిగల్లు పరిధిలోని భూములకు రూ.7.5 లక్షలు పరిహారం ఇస్తామని చెప్పడంతో రైతులు ఒప్పుకోవడంలేదు. వరుసగా ఐదు రోజులు నిర్మాణ పనులను అడ్డుకుని ధర్నా చేశారు.

**గడువులోపు పూర్తయ్యేనా..?**

ముదిగుబ్బ నుంచి కోడూరు మధ్య 342వ జాతీయ రహదారి నిర్మాణ పనులు 2023లో ప్రారంభమయ్యాయి. ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి, గోరంట్ల మీదుగా చిలమత్తూరు మండలంలోని కోడూరు వరకు 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మిస్తున్నారు. మొదటి విడతలో ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి 90 శాతం పనులు పూర్తయ్యాయి. ముదిగుబ్బ, బుక్కపట్నం మండలాల పరిధిలోని ఆర్వోబీ, కల్వర్టుల దగ్గర పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. పుట్టపర్తి సమీపంలో రోడ్డు నిర్మాణం ఇంకా చేపట్టాల్సి ఉంది. అలాగే పుట్టపర్తి నుంచి కోడూరు మధ్యలో నిర్మాణ పనులు ఇంకా జరుగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబరులోపు పనులు పూర్తికావాల్సి ఉండగా ఇంకా ముదిగుబ్బలో భూనిర్వాసితులు ఆందోళనలు చేస్తుండటంతో గడువులోపు పూర్తవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

గిడ్డయ్య, ఎన్‌హెచ్ డీఈ, పుట్టపర్తి

భూసేకరణ చట్టం 2013 ప్రకారం రిజిస్ట్రేషన్ విలువ కంటే రెండున్నర రెట్లు ఎక్కువగా పెంచి పరిహారం ఇస్తున్నాం. అందుకు రైతులు ఒప్పుకోవడం లేదు. భూపరిహారం పెంచాలని రైతులు ధర్నా చేస్తున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

# పట్టు రైతులకు కలిసొచ్చిన కాలం

అనంతపురం : వేసవి కాలంలో ఎన్ని జాగ్రత్తలు పాటించినా బైవోల్టిన్ పట్టు పంట చేతికి రావటం కష్టం. ఈ సంవత్సరం ఎండ తీవ్రత కొద్దిరోజులకే పరిమితం కావటం, జూన్‌లో కురవాల్సిన వర్షాలు మే నెలలోనే రావడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ప్రతికూల కాలంలో పట్టు రైతుల చేతికి పంటలు అందాయి. ఇదే సమయంలో మార్కెట్లో ధరలు నిలకడగా ఉండటంతో కొంత గిట్టుబాటు లభించింది. వేసవిలో పంటలు చేతికి అందవని రైతులు మల్బరి ఆకును ఔషధ తయారీకి విక్రయించేందుకు పూనుకొన్నారు. దీనికి తోడు పంటలు చేతికి అందటం, మార్కెట్లో గూళ్ల ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు తిరిగి పట్టు సాగుపై దృష్టి సారించారు.

**మార్కెట్కు పెరుగుతున్న రాబడి** హిందూపురం మార్కెట్‌కు పట్టుగూళ్ల రాబడి రోజురోజుకు పెరుగుతోంది. గత సోమవారం 5 టన్నులు, మంగళవారం 6, బుధవారం 4 టన్నుల బైవోల్టిన్ పట్టుగూళ్లు వచ్చాయి. ఈ గూళ్లు అత్యధికంగా కిలో రూ.706, అతి తక్కువగా రూ.366, సరాసరి రూ.550 ధరలు పలికాయి. గడచిన రోజుల్లో స్థానిక మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేవని మడకశిర తదితర ప్రాంతాలకు చెందిన రైతులు కర్ణాటక ప్రాంతం శిద్దలఘట్ట, రాంనగర్‌లకు పట్టుగూళ్లు తీసుకునివెళ్లేవారు ప్రస్తుతం ధరలు స్థానికంగానే అధికంగా ఉండటంతో రైతులు ఇక్కడికే గూళ్లు తీసుకొస్తున్నారు. దీనివల్ల గూళ్లకు ఇతర పాంత్రాలకు వెళ్లుతున్న రీలర్లు స్థానికంగానే గూళ్లను కొనుగోలు చేస్తూ రీలింగ్ యూనిట్ల



ద్వారా సిల్క్ తీస్తున్నారు.

**వాతావరణ మార్పులు సహకరించాయి**గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ సంవత్సరం వాతావరణంలో ఏర్పడిన మార్పులు బైవోల్టిన్ పట్టురైతులకు ఎంతో సహకరించాయి. వేసవిలో రైతులు ఎన్ని జాగ్రత్తలు తీసుకొన్నా పంటలు చేతికి అందేవి కావు ప్రస్తుతం వందగుడ్లకు వంద కిలోల గూళ్ల దిగుబడి వస్తోంది. ఇది ఎంతో శుభపరిణామంసురేశ్, పట్టుపరిశ్రమ సహాయ సంచాలకుడు, హిందూపురం

# మంగళంపాడు చెరువులో మళ్లీ మట్టి తవ్వకాలు

సూళ్లూరుపేట : డివిజన్‌లో మట్టి తవ్వకాలు ఆగడం లేదు. వీటిని అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తుంది. దాంతో మట్టి, గ్రావెల్ అక్రమార్కుల దందా యథేచ్ఛగా జరుగుతుంది. అసైన్మెంట్, ప్రభుత్వ భూములు, పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. సూళ్లూరుపేట పురపాలక సంఘానికి సంబంధించి మండలంలోని మంగళంపాడు చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మిస్తున్నారు. ఇక్కడ రూ.120 కోట్లతో వేసవి నీటి నిల్వ ట్యాంకు, దీనికి అనుబంధంగా గొట్టాలు పూడ్చడం, పురపాలికలో పలుచోట్ల నీటి పథకాలు ఏర్పాటు చేస్తున్నారు. మంగళంపాడు చెరువులో ఎస్ ఎస్ ట్యాంక్ నిర్మిస్తున్న స్థలం పక్కనే రెండు రోజుల నుంచి రాత్రివేళ మట్టి, గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా జరుపుతున్నారు. రాత్రివేళ గుట్టు చప్పుడు కాకుండా పెద్ద పెద్ద యంత్రాలతో తవ్వకాలు జరిపి పెద్ద టిప్పర్ల ద్వారా సూళ్లూరుపేట ప్రాంతంలోని



స్థిరాస్తి క్షేత్రాలకు తరలిస్తూ దందా ముఠా రూ.లక్షలు గడిస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమార్కులకు అధికార పార్టీ నేతలతో పాటు అధికారుల అండదండలతో రాత్రివేళ మంగళంపాడు చెరువులో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో అధికారులు ఇటువైపు చూడడం లేదు. ఇప్పటికీ ఈ చెరువులో మట్టి తవ్వకాలతో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. చెరువులో మట్టి తవ్వకాలు జరగకుండా చూడాలని ప్రజారోగ్య శాఖ ఇంజనీర్లు పలుమార్లు పోలీసులు, జలవనరుల, రెవెన్యూ శాఖ అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. అయినా పట్టించుకోవడం లేదు. ఈ విషయమై జల వనరుల శాఖ ఏఈ రమేష్‌ను వివరణ కోరగా ఆయన సమాధానం దాటవేశారు.

# దశాబ్దాల సమస్యకు పరిష్కారం

పుత్తూరు : తిరుపతి బైపాస్ రోడ్డులోని కేఎల్ఎం ఆసుపత్రి సమీప నూతన ఆర్వోబీ అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్‌కు మోక్షం లభించింది. తిరుపతి–చెన్నై 205 జాతీయ రహదారి విస్తరణ పనులు చంద్రగిరి సమీప కాలూరు క్రాస్ నుంచి పుత్తూరు మరాఠీగేటు వరకు 2010లో రూ.600 కోట్లతో ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ చేపట్టింది. సదరు పనులు పూర్తికాకనే ఆ గుత్తేదారు సంస్థ ఎస్వీపురం వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేసి టోలు వసూలు చేసింది. అప్పట్లో కాలూరు క్రాస్, కేఎల్ఎం ఆసుపత్రి వద్ద ఆర్వోబీ, గాజులమండ్యం వద్ద రోడ్డు పనులు, పాదిరేడు వద్ద రోడ్డు, వంతెన, టోల్‌ప్లాజా వద్ద అసంపూర్తి పనులు, పుత్తూరు గోవిందపాళెం వద్ద రోడ్డు, నారాయణవనం బైపాస్ రోడ్డు వద్ద పైవంతెన పనులు ఆగిపోయాయి. వీటిని చేపట్టాలని ప్రజాప్రతినిధులు సైతం వినతులు ఇచ్చారు. ఎట్టకేలకు 2023 జూన్‌లో రూ.120 కోట్లు ఆయా పనులు చేపట్టేందుకు మంజూరు చేశారు. టెండర్లు పిలిచి గుత్తేదారులకు పనులు అప్పగించారు.

**సాగిన పనులు..**



2023 జూన్‌లోనే పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు సాగుతూనే ఉన్నాయి. దీనిపై పలుమార్లు కథనాలు వెలువడటంతో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఎప్పటికప్పుడు గుత్తేదారులపై ఒత్తిడి పెంచారు. ఎట్టకేలకు గాజులమండ్యం మినహా అన్ని అసంపూర్తి పనులు చేపట్టారు. అందులో భాగంగా పూడి–రేణిగుంట రైల్వే స్టేషన్ల మధ్య కేఎల్ఎం ఆసుపత్రి సమీపంలోని ఆర్వోబీ నిర్మాణం గతేడాది విజయదశమి నాటికి పూర్తి చేయాలనేది లక్ష్యం. అయితే రైల్వే అధికారుల అనుమతులు ఆలస్యం కావడంతో పలుమార్లు కలెక్టర్ వెంకటేశ్వర్, హైవే అధికారులు వారితో మాట్లాడి అనుమతి తీసుకుని వంతెన నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో ప్రస్తుతం వంతెనపై రాకపోకలు మొదలయ్యాయి. దీంతో ఇక తిరుపతి–చెన్నై, పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే. గతంలో ఒకే మార్గం ఉండటంతో నిత్యం ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగేది. ప్రస్తుతం వంతెన పూర్తి కావడంతో ఆ కష్టాలు తీరాయని వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చిగురిస్తున్న.. చింత ధరలు

పుంగనూరు : ఏడాది పొడవునా ఉపాధి లభించే చింత పరిశ్రమ నష్టాల ఊబి నుంచి గట్టెక్కనుంది. రెండేళ్లుగా చింత వ్యాపారం నష్టాల బాటలో సాగడంతో వ్యాపారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఈ సీజన్‌లో ప్రస్తుత ధరలు వ్యాపారులకు ఊరటనిస్తున్నాయి. ఏటా ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో పొట్టు కాయను స్థానిక వ్యాపారులు దిగుమతి చేసుకోవడం పరిపాటి. గతంలో కొనుగోలు చేసి నిల్వ ఉంచగా ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఎగుమతులు ఊపందుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు.

**ఏడాది పొడవునా ఉపాధి..**

స్థానికంగా లభ్యమయ్యే చింతపండుతోపాటు పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు. సాధారణంగా సీజన్‌లో ఇక్కడ నిల్వ చేసుకుని తిరిగి అవసరాలకు అనుగుణంగా ఏడాది పొడవునా వివిధ ప్రాంతాలకు చపాతీ, పూపండు, కరిపులి రకాలుగా విభజించి ఎగుమతి చేస్తారు. కట్టెకాయ నుంచి వివిధ రకాల పండుగా విభజించే వరకు కూలీలతో పని ఉంటోంది. దీంతో ఇక్కడ ఏడాది పొడవునా కూలీలకు ఉపాధి లభిస్తుంది.

# టిడ్కో లబ్ధిదారులకు తీపి కబురు

పుట్టపర్తి : పట్టణాల్లో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల హామీ అమలు దిశగా కీలకమైన ముందడుగు వేసింది. పేదలందరికీ ఇళ్లు నిర్మించాలనే సంకల్పంతో 2014-19 మధ్య కాలయంలో నాటి తెదేపా ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి ధర్మవరం, కదిరి, హిందూపురం మున్సిపాలిటీల్లో నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో టిడ్కో సౌజన్యంతో ఇళ్ల నిర్మాణానికి పునాది వేసింది. త్వరలో సొంతిల్లు సాకారం అవుతుందని, ఆశతో లబ్ధిదారులు అప్పులు చేసి కంతులు చెల్లించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి. ఐదేళ్ల పాలనలో ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. ఎక్కడికక్కడ పనులు నిలిచిపోవడంతో పేదల సొంతింటి కల సాకారం కాలేదు. చెల్లించిన డిపాజిట్‌కు ఆరేడేళ్లుగా వడ్డీలు చెల్లిస్తూ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ హామీ మేరకు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో భవనాలను పూర్తి చేసి, జూన్ నాటికి నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు వచ్చే జూన్ నాటికి జిల్లాలోని 4,176 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్ణయించారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అనుకున్న తేదీ నాటికి గృహాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

**త్వరలో పూర్తి చేసేలా చర్యలు చేపడతాం..**

షబానా, టీడ్కో డీఈ జిల్లాలో అర్థాంతరంగా ఆగిపోయిన టిడ్కో సామూహిక భవనాలు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో 4,176 మందికి జూన్ నాటికి సొంతింటి తాళాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ దిశగా చర్యలు చేపట్టింది.

# సహజ పద్ధతుల్లో సాగే ఉత్తమం

హిందూపురం : దీర్ఘకాలిక రోగాలు దూరం కావాలంటే సహజ పద్ధతుల్లో పండించే పంటలే శరణ్యమని విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి రైతు నీటిని పొదుపుగా వాడుకోవడంలో ప్రకృతి వ్యవసాయ పరిశోధకుడు సుభాష్ పాలేకర్ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేసినపుడు నిబంధనలకు విరుద్ధంగా బోర్ల తవ్వకాన్ని అడ్డుకున్నట్లు గుర్తుచేశారు. శనివారం పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉద్యానవనం, వ్యవసాయ శాఖ, ఆర్డీటీ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మన వ్యవసాయం, పంటలు, వంటకాలు, ఆరోగ్యంపై సదస్సు, చిరుధాన్యాల మేళాను ప్రారంభించారు. ఇజ్రాయెల్ లాంటి దేశాల్లో తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధిస్తున్న విషయాన్ని



జనార్ధన్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రకృతి వ్యవసాయ స్వతంత్ర ప్రచారకర్త విజయరావ్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో ప్రతి రైతు ఎకరాకు రూ.3 నుంచి 6 లక్షల వరకు లాభాలు పొందవచ్చన్నారు. పురుగు మందులు, రసాయన ఎరువులు లేకుండా చెన్నంగి, కొలతేర్ రకాల వరి వంగడాలను పండించాలన్నారు. ఎ.ఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి అనుకూల వంటలు తినాలంటే పంటల సాగులో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. సహాయ కలెక్టర్ వినూత్న, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఎన్ఐఆర్డీ డైరెక్టర్ డబ్ల్యూఆర్ రెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి గోపాల్‌రెడ్డి, ఏపీఎంఏఎస్ సీఈఓ సీఎస్ రెడ్డి, 18 ఎన్‌జీఓల ప్రతినిధులు పాల్గొన్నారు ఆకట్టుకున్న స్టాళ్లు: చిరుధాన్యాల మేళాలో భాగంగా వివిధ రకాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కట్టె గానుగ నూనెలు, చిరుధాన్యాలతో తయారు చేసిన తినుబండారాలు, వివిధ ప్రాంతాల్లో ప్రాముఖ్యం ఉన్న విత్తనాల ప్రదర్శన, కూరగాయలు, పండ్లు, తదితర రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

# ఎండిన ఆకులు.. చెదిరిన రూపురేఖలు..!

ఆరిలోవ : ఘన చరిత్ర గల ముడసర్లోవ ఉద్యానవనంలో ఇటీవల అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం స్థానికులను కలవరపరిచింది. అటు పచ్చని సింహగిరులు..ఇటు గలగలపారే సెలయేరు.. ప్రకృతి రమణీయత ఉట్టిపడే ప్రాంతంలో ఈ ఉద్యానవనాన్ని 1902లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. నాటి నుంచి దశాబ్దాలపాటు విశాఖ నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచింది. 1980 దశకంలో పదుల సంఖ్యలో సినిమాలను ఇక్కడ చిత్రీకరించారు. అలాంటి ఉద్యానవనాన్ని గత ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది.వైకాపా ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ పాలకులు ప్రపంచ స్థాయి ఉద్యానవనంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వాస్తవంలో ఒక్క పైసా ఖర్చు చేయలేదు. కొత్తగా ఒక్క మొక్క కూడా నాటించలేదు. ఉన్న మొక్కలకు నీరు పోసి సంరక్షించలేదు. గడ్డి ఎండిపోతున్నా, పిల్లల ఆట పరికరాలు విరిగిపోయినా పట్టించుకోలేదు. రాలిన ఆకులను ఏరోజుకారోజు డంపింగ్‌యార్డుకు తరలించే ఏర్పాట్లు చేయలేదు. ఫలితంగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అక్రమాలకు అడ్డాగా మారి: ఉద్యానవనం నిర్వహణను వాస్తవంగా జీవీఎంసీ ఉద్యాన విభాగం చూడాలి. కాని నాటి పాలకులు నీటిసరఫరా విభాగానికి అప్పగించారు. సందర్శకుల నుంచి రుసుములు వసూలు చేయడానికి టెండరు పిలిచి గుత్తేదారుకి అప్పగించారు. ఎన్నడూలేని విధంగా నాడు ఉద్యానవనంలో టెంట్లు వేసి పార్టీలు నిర్వహించే సంస్కృతిని తెచ్చారు. కార్తికమాసంలో గుత్తేదారు ఒక్కో టెంటుకు సుమారు రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు అనధికారికంగా వసూలు చేశాడు. టెంట్లు, కుర్చీలు, టేబుళ్లను కూడా ఆయనే సరఫరా చేశాడు. వసూలు చేసిన మొత్తంలో భారీగానే నాటి వైకాపా పాలకులు, అధికారులకు అందేవని ఆరోపణలు వచ్చాయి. ఐదేళ్లు కేవలం జేబులు నింపేసుకోవడంపై దృష్టిపెట్టిన గుత్తేదారు ఉద్యానవనం నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న దృష్ట్యా ముడసర్లోవ ఉద్యానవనాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**అందులో సగం వెచ్చించినా మెరుగయ్యేది..**జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం మేరకు రెండేళ్ల క్రితం ముడసర్లోవ ఉద్యానవనం పక్కన పెద్ద వృక్షాలున్న ప్రాంతంలో హార్స్ రైడింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. దీనికి సుమారు రూ. 3కోట్లు వెచ్చించారు. రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో నిర్మిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో మధ్యలో ఆపేశారు. అంటే రూ. 1.5కోట్లు ఖర్చు పెట్టినా ముడసర్లోవ ఉద్యానవనానికి వచ్చేదని స్థానికులు చెబుతున్నారు.

# ముసిలో మసి.. ఆరోగ్యం నుసి



ఒంగోలు : రెండు బ్లేడ్ల(యంత్రాలు)తో గ్రానైట్ రాళ్లను కోయడం ద్వారా రెండు నెలలకు సుమారు 15 ట్యాంకర్ల(45 వేల లీటర్ల) ద్రవ వ్యర్థాలు విడుదలవుతాయి. వీటిని డంపింగ్ యార్డులకు తరలించి నిల్వ చేయాల్సి ఉంటుంది. ఆ విషయాన్ని కొందరు యజమానులు విస్మరిస్తున్నారు. వాగులు, చెరువుల్లో పారబోస్తూ అటు గాలి.. ఇటు నీటిని చేజేతులారా కలుషితం చేస్తున్నారు. తెల్లని రాతిపొడి దుమ్ము, ధూళి మాదిరిగా గాలిలో కలుస్తూ శ్వాస కోశ వ్యాధులకు కారణం అవుతుండగా.. నీటిలో పారుతూ జలాన్ని గరళంగా మారుస్తోంది. అయినా కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారులు చేష్టలుడిగి చూస్తుండిపోతున్నారు.

**ఆ నీరే సాగుకు దిక్కు**

ముసి నది వెలిగొండలోని దొక్కలసాల నుంచి ప్రారంభమవుతుంది. మార్కాపురం, దర్శి, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల మీదుగా ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ నదిపై నిన్నూరుపాడు, అనకర్లపూడి, ముప్పరాజుపాలెం, పెరివేపి, ముప్పవరం, వెన్నూరులో ఆరు ఎత్తిపోతల పథకాలున్నాయి. వాటి ఆధారంగా రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఈ నదితో పాటు బూదవాడ వాగు, సంతనూతలపాడు మండలం గుళ్లవాగు, చీమకుర్తి మండలం మువ్వవారిపాలెం చెరువులోనూ గ్రానైట్ ద్రవ వ్యర్థాలను కలుపుతున్నారు. ఆ నీటి వనరుల ఆధారంగా సుమారు పది వేలకు పైగా ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. గ్రానైట్ ద్రవ వ్యర్థాలు కలుస్తుండంతో జలాలు కలుషితం అవుతున్నాయి.

**గుర్తించినా లేవు చర్యలు**

చీమకుర్తి, ఆర్ఎల్‌పురం, యల్లయ్యనగర్, దేవరపాలెం, రామతీర్థం, మర్రిచెట్లపాలెంలో ప్రయాణించాలంటే మాస్కు లేదా చేతిరుమాలు తప్పనిసరి. స్థానికులతో పాటు ప్రయాణికులు కళ్లకు అద్దాలు, ముక్కుకు చేతిరుమాలు కట్టుకునే కనిపిస్తారు. ఇక్కడ గాలి నాణ్యత సాధారణంగా ఉండాల్సిన 50 కంటే 130 ఏక్యూఐ ఉందని, పీలిస్తే రోగాలు వస్తాయని పీసీబీ అధికారులు గతంలోనే హెచ్చరించారు. దీనికి కారణం ద్రవ వ్యర్థాలు(స్లర్రీ) ఆరిన తరువాత గాలిలో కలిసిపోవడమేనని నిర్ధారించారు. అయినా నివారణ చర్యలు శూన్యం.

**ప్రతి నెలా 15 వేల ట్యాంకర్లు**

గత నెల 15న పీసీబీ అధికారులు మర్రిచెట్లపాలెంలోని ముసి వాగును పరిశీలించారు. గ్రానైట్ రాళ్లముక్కలతో పాటు ద్రవ వ్యర్థాలూ పారబోసినట్లు గుర్తించి వాగుకు ఇరువైపులా ఉన్న 11 పరిశ్రమలకు నోటీసులు జారీ చేశారు. వారితో సమావేశమై జల వనరులను కలుషితం చేయొద్దని గట్టిగా హెచ్చరించారు. అయినా ఫలితం శూన్యం. జిల్లాలో కార్యకలాపాలు సాగించే వెయ్యి పరిశ్రమల నుంచి ప్రతినెలా వెలువడే 15 వేల ట్యాంకర్ల వ్యర్థాలు ఖాళీ స్థలాలు, జల వనరుల్లో కలిసిపోతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేస్తేనే రోగాలు దరి చేరకుండా ప్రజల ప్రాణాలు పదిలంగా ఉంటాయి. ఈ విషయమై జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. 'డంపింగ్ యార్డు ఏర్పాటుకు గుర్తించిన ప్రభుత్వ స్థలానికి సర్వే నంబరు లేదు. యార్డు ప్రాధాన్యం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం' అని జేసీ గోపాలకృష్ణ తెలిపారు.

లీజుకిచ్చిన అన్ని క్వారీలు: 238

స్టోన్ క్రషర్లు: 60గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్లు: 1,500

కార్యకలాలు సాగిస్తున్నవి: 1,000

రెండు నెలలకు విడుదలయ్యే వ్యర్థాలు: 7,500 ట్యాంకర్లు

ప్రభావిత ప్రాంతాలు: చీమకుర్తి, సంతనూతలపాడు, కొండపి, పొదిలి, మద్దిపాడు, కనిగిరి

సమస్య ఎదుర్కొనేవారు: సుమారు రెండు లక్షల మంది

# గూడుకు స్థలాలే అడ్డు



ఒంగోలు : గత ప్రభుత్వ ఊరికి దూరంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భూములు లేదా వాగులు, వంకలు, శ్మశానాల స్థలాలను సేకరించి పేదలకు ఇంటి పట్టాలిచ్చింది. ఇల్లు మంజూరు చేసి కట్టుకోవాలని సూచించింది. అదే సమయంలో శివారు ప్రాంతాలు కావడం.. మౌలిక వసతులు ఏర్పాటులో నిర్లక్ష్యం వహించింది. వైకాపా హయాంలోని ఈ పాపాలు.. పేదల గృహయోగానికి ఇప్పుడు శాపాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా.. పక్కాగృహాల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. **ఇప్పటికి 3,071 పూర్తి:** పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పక్కాగృహ నిర్మాణాలపై దృష్టి పెట్టింది. ప్రధాన మంత్రి ఆవాస యోజన 2.0 కింద నూతనంగా కేటాయించనున్న ఇళ్ల నిర్మాణాల మంజూరుకు సర్వే చేయించింది. మరోపక్క గత ప్రభుత్వ హయాంలో పలు దశల్లో ఆగిన ఇళ్ల పూర్తికి లబ్ధిదారులను ప్రోత్సహిస్తోంది. అందుకు సకాలంలో బిల్లులు విడుదల చేస్తూ వారికి ఆసరాగా నిలుస్తోంది. అయినా గత ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్లలో ఇల్లు కట్టుకునేందుకు అంతగా అసక్తి చూపడం లేదు. **గగనంగా మారిన లక్ష్య సాధన:** జూన్ 12న రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు అన్ని నియోజకవర్గాల వారీగా లక్ష్యాలను కేటాయించింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,839 పక్కాగృహాలు పూర్తి చేయాలనేది లక్ష్యం. గతేడాది జూన్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు 3,071 ఇళ్లు(35 శాతం) మాత్రమే పూర్తయ్యాయి. మరో నెల రోజుల్లో 5,768 గృహాలు(65 శాతం) పూర్తి కావడం గగనంగా మారింది. ఏడాదిగా మార్కాపురంలో అత్యధికంగా 655బీ కొండపి నియోజకవర్గంలో 161 పక్కాగృహాలే పూర్తయ్యాయి.

# గుండ్లకమ్మ గట్టెక్కించేనా!



మద్దిపాడు : ఎండలు మండుతున్న నేపథ్యంలో వేసవిలో నీటి గండం ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నారు. కీలకమైన గుండ్లకమ్మ జలాశయంలో 2.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మళ్లీ వర్షాలు కురిసే వరకూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వవని అధికారులు చెబుతున్నారు. అయితే నిర్వహణ పనుల నిమిత్తం ఇక్కడి సీపీడబ్ల్యుఎస్ పథకం నుంచి తాగునీటిని వరకూ నిలిపివేయనున్నారు. దీనివల్ల 69 గ్రామాలకు నీరందదని అధికారులు చెబుతున్నారు. గుండ్లకమ్మ జలాశయం నుంచి ఒంగోలు నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని లక్షలాదిమందికి తాగు నీరందిస్తున్నారు. ప్రధానంగా మేదరమెట్ల సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం (సీపీడబ్ల్యూఎస్) ద్వారా 1.5 లక్షల మందికి, ఒంగోలు నగరవాసులకు శుద్ధి చేసిన జలాలు అందిస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ప్రతిరోజు 25 క్యూసెక్కులు సరఫరా అవుతున్నాయి. ఒక్క ఒంగోలు నగరానికే 40 మిలియన్ లీటర్లు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొరిశపాడు, అద్దంకి, జె.పంగులూరు, ఒంగోలు రూరల్ మండల పరిధిలోని లక్షన్నర మందికి 65 లక్షల లీటర్ల నీరిస్తున్నారు.

**తాగునీటి అవసరాలకే..**గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం ఒక్కొక్కరికి 55 లీటర్లు, నగరంలో ఒక్కొక్కరికి 133 లీటర్ల చొప్పున సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలోని నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. లీకేజీలు నివారించామని, వేసవిలో గట్టెక్కుతామని వారు భరోసా ఇచ్చారు.

**69 గ్రామాలకు నిలుపుదల**

గుండ్లాకమ్మ జలాశయంలోని మేదరమెట్ల సమగ్ర రక్షిత తాగునీటి సరఫరా పథకం నుంచి మూడు రోజుల పాటు నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నారు. ఈ పథకంలో కొత్త మోటార్ల బిగింపు, మరమ్మతుల నిమిత్తంవరకు స్కీమ్ పరిధిలోని 69 గ్రామాలకు నీరు సరఫరా కాదని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాబు తెలిపారు.

# పనులు గాలికి..కాసులు జేబుల్లోకి

పెద్దారవీడు : జాతీయ ఉపాధి హామీ పథకం కొందరు అక్రమార్కులకు వరంలా మారింది. నిబంధనల ప్రకారం చేసిన పనుల చిత్రాలు, వివరాలను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. ఆచరణలో అందుకు విరుద్ధంగా సాకులు చూపుతున్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాలైన పెద్దారవీడు మండలం సుంకేసుల, కలనూతల, గుండంచర్ల గ్రామాలకు అంతర్జాల సిగ్నల్ సమస్య ఉంది. దీంతో ఆ నిబంధన నుంచి అధికారులు కొంత వెసులుబాటు కల్పించారు. దీంతో అక్రమార్కులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇదే అదనుగా రేగుమానుపల్లి, పోతంపల్లి, సానికవరం తదితర గ్రామాలకు చెందిన కొందరు కూడా సిగ్నల్ సమస్య అంటూ సాకులు చెబుతున్నారు. వాస్తవానికి ఆ సమస్య లేకున్నా.. పీడీ కార్యాలయంలోని కొందరికి ముడుపులు ముట్టజెప్పి సరే అనిపించుకున్నారు. పనులకు సంబంధించి చిత్రాలు నమోదు చేయకుండానే బిల్లులు చేయించుకుంటున్నారు. **పనికి రాకున్నా డబ్బులు**కొందరు సిబ్బంది బహిరంగంగానే శ్రామికులతో బేరాలకు దిగుతున్నారు. పనులకు రాకున్నా మాకింత.. మీకింత అంటూ నగదు చెల్లిస్తున్నారు. ఇస్టానుసారం మస్టర్లు నమోదు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం.. పరిశీలించి హాజరు తీసుకుని, కొలతలు చూడాల్సిన టెక్నికల్ అసిస్టెంట్లు కార్యాలయంలోనే కూర్చుని బిల్లులు చేస్తుండటం అక్రమార్కులకు మరింతగా కలిసి వస్తోంది. ఈ విషయాలపై ఆ పథకం మార్కాపురం క్లస్టర్ ఏపీడీ నిర్మలాదేవి మాట్లాడుతూ.. ఉపాధి కూలీల నుంచి ఫిర్యాదులు అందితే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. టీఏలను తీసుకుని పనుల వద్దకు వెళ్లి నేరుగా తనిఖీలు చేస్తామని తెలిపారు.

# జలం నిలవాలి జనం మురవాలి

కర్నూలు : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా జలభగ్నం చేసింది.. నిర్వహణకు పైసా ఇవ్వలేదు.. కేసీ చెదిరింది.. ఎస్సార్బీసీ ఏడిపిస్తోంది.. అలగనూరు కుప్పకూలింది.. గోరుకల్లు లీకేజీ అవుతోంది.. అవుకు అధోగతి పాలైంది.. పెండింగ్ ప్రాజెక్టుల దస్త్రాన్ని అటకెక్కించారు.. తుంగభద్ర, హంద్రీ, కృష్ణమ్మ నదులు పారుతున్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల ఎకరాలు బీళ్లుగా మారాయి.. ప్ర'జల'కు ప్రాధాన్యం ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జలాశయాల నిర్వహణకు నిధులు విడుదల చేసింది.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టబోతున్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలవనరుల బాగుకు రూ.1,568 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు.

**వీటికి మోక్షం కలిగేనా**

పశ్చిమ ప్రాంతంలో ఆర్డీఎస్, వేదవతి జలాశయాల నిర్మాణానికి గతంలో తెదేపా పునాది వేసింది. 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూ.1,942 కోట్లతో వేదవతి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటివరకు రూ.90 కోట్లు ఖర్చు చేశారు. దీన్ని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది.

కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలకు నీరందించేలా రూ.1,985 కోట్ల వ్యయంతో ఆర్డీఎస్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రూ.12.60 కోట్ల వరకు వెచ్చించారు. అందుబాటులోకొస్తే 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సుంకేసుల (రూ.27 కోట్లు)

కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల పరిధిలో 2.65 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే సుంకేసుల జలాశయానికి రూ.27 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కాల్వ అధ్వానంగా మారడంతో 1,500 క్యూసెక్కులు ప్రవహించని పరిస్థితి నెలకొంది.సుంకేసుల, అలగనూరు, ముచ్చుమర్రి జలాశయాలకు కలిపి తొలుత రూ.107 కోట్లకు ప్రతిపాదించారు.. ఆ తర్వాత రూ.27 కోట్లకు కుదించారు.

ఎస్సార్బీసీ (రూ.89 కోట్లు)

శ్రీశైలం కుడిగట్టు కాల్వకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుంటారు. జలాశయం పనులు పూర్తికాకపోవడంతో 12 టీఎంసీలు నిల్వ చేయని పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లు నిర్వహణ చేపట్టకపోవడంతో కట్ట కుంగింది. ఈ నేపథ్యంలో రూ.89 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు.

అవుకు (రూ.40కోట్లు)

గత ఐదేళ్లుగా అవుకు జలాశయం నిర్వహణ పనులు చేపట్టలేదు. గేట్ల వద్ద నీటి లీకేజీ కొనసాగుతోంది. గత ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.. రెండో విడత పనులకు సంబంధించి రూ.24 కోట్లు గుత్తేదారుకు చెల్లించాల్సి ఉంది.

వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని అవుకు సొరంగం, జలాశయం నిర్వహణకు రూ.40 కోట్ల వరకు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

హంద్రీనీవా (రూ.700కోట్లు)

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వను విస్తరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మల్యాల నుంచి జీడిపల్లి (0-216 కి.మీ.) వరకు కాల్వ వెడల్పు, లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.700 కోట్లు అవసరమని ఇంజినీర్లు ప్రతిపాదించారు.

ప్రస్తుతం కాల్వలో 1,900 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. విస్తరించి 3,850 క్యూసెక్కులు తరలించనున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గురు రాఘవేంద్ర (రూ.57కోట్లు)తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టు స్థిరీకరించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా కనీసం విద్యుత్తు బిల్లులు చెల్లించలేదు.. నిర్వహణలేక మోటార్లు సతాయిస్తున్నాయి. వీటిని బాగు చేసేందుకు రూ.57 కోట్లు అవసరమవుతాయి.

శ్రీశైలం (రూ.18కోట్లు)కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.18 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులతో కొంతవరకు పనులు చేసేందుకు అవకాశముంటుంది, డ్రిప్ ద్వారా నిధులు విడుదలైతే తప్ప పూర్తిస్థాయిలో పనులు చేసేందుకు అవకాశముండదని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్ రూ: 313 కోట్లు

కేసీ, రాజోలి, జొలదరాశి (235)

గాజులదిన్నె (35)

చెరువుల నిర్వహణ (46)

సిద్ధాపురం ఎత్తిపోతల (8)

# ఉపాధి మేడలు

కర్నూలు : ఐదేళ్ల వైకాపా కాలంలో భవన నిర్మాణ రంగం కుదేలైంది. 'కొత్త ఇసుక విధానం' పేరిట రీచ్‌లను మూసేశారు. ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. భవనాలు, ఇళ్ల పనులన్నీ ఆగిపోవడంతో కార్మికులకు నెలల తరబడి ఉపాధి కరవైంది. ఇతర రాష్ట్రాలకు వలస పోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అర్ధాకలితో అలమటించేలా చేసింది. కొందరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కార్మికులకు చేతినిండా పని దొరుకుతోంది. పనుల స్థాయిని బట్టి రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు కూలి లభిస్తోంది. ఏడాదిలో అక్టోబరు నుంచి మే వరకు నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఉంటుంది. 'కూటమి' ప్రభుత్వం పల్లె పండగ పేరుతో సిమెంటు దారులు నిర్మిస్తోంది.



ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1,000, రూ.1,500, రూ.2 వేలకు అందుబాటులో ఉంది. కారుచౌకగా ఇసుక లభిస్తుండటంతో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు."నగరంలో మూడు సెంట్లలో ఇంటి నిర్మాణానికి దసరా రోజున శంకుస్థాపన చేశాం.. రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు" బ్యాంకు ఉద్యోగి నవీన్ పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాల్లో ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లు వెచ్చించి ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నట్లు అంచనా. ఒక్క కర్నూలు నగరంలోనే గత నెలలో వంద ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు.

**దండిగా ఇసుక నిల్వలు** గతంలో టన్ను రూ.326 ఉండగా.. దాన్ని కూటమి ప్రభుత్వం రూ.320కు తగ్గించింది. ప్రస్తుతం సి.బెళగల్ మండలంలోని డీసిల్టింగ్ పాయింట్లలో టన్ను రూ.202, మరలి ఇసుక రీచ్‌లో రూ.119, గుడికంబాలి రూ.39, నదిచాగిలో రూ.40 నామమాత్రపు ధరకు ఇసుక లభిస్తోంది.ఉమ్మడి జిల్లాలో కార్మికుల సంఖ్య 1,45,350

# అక్రమాల లోతెంత?

విశాఖపట్నం: భీమిలి వద్ద తీరంలో వైకాపా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సాగించిన అక్రమాల లోతులను అధికారులు పరిశీలిస్తున్నారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన కట్టడాలను పూర్తిగా తొలగించి పూర్వస్థితి తీసుకురావాలని హైకోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ నేపథ్యంలో పునాది ఎంత లోతు ఉంది? ఎంత ఖర్చు అవుతుంది? అని అంచనా వేయడానికి నిర్ణయించుకున్నారు. రెండు రోజుల కిందట మనుషులతో పునాదుల వద్ద సమాంతరంగా తవ్వి లోతును గుర్తించేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. దీంతో బుధవారం జేసీబీతో పునాది పక్కన ఇసుక తవ్వి లోతు పరిశీలించారు. పునాదిని నిర్మించిన తీరు చూసి ప్లానింగ్ అధికారులు ఖంగుతిన్నారు. 588 మీటర్ల పొడవున్న పునాది సుమారు 6-8 అడుగుల్లోతు వరకు ఉంది. అడుగు భాగాన పునాది వెడల్పు 10 అడుగుల మేర ఉంది. కోర్టు ఆదేశాల ప్రకారం ఇదంతా పూర్తిగా తొలగించడానికి రూ.50 లక్షలపైగా ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే



స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ, ఇతర నిర్మాణాలు కూల్చడానికి రూ.4లక్షలు ఖర్చు అయినట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. కట్టడాలు కూల్చడానికి పెట్టిన ఖర్చు నేహారెడ్డికి చెందిన అవ్యాన్ సంస్థ నుంచి వసూలు చేయాలని కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

**నక్షత్రాల హోటల్‌కేనా?:** విజయసాయిరెడ్డి కుమార్తె భీమిలి తీరాన్ని ఆనుకుని అవ్యాన్ ఎల్‌ఎల్‌పీ సంస్థ పేరిట ఉన్న స్థలంలో భారీ నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికలు చేశారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘన అంశం తెరపైకి వచ్చిన సమయంలో ఐదు నక్షత్రాల హోటల్ నిర్మాణం కోసమే శాశ్వత కట్టడాలు చేపడుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సముద్రానికి దగ్గరిగా నిర్మించిన ప్రహరీ పునాదులు పరిశీలించగా.. అడుగున పది అడుగుల మేర వెడల్పుతో కాంక్రీట్ పర్చడం హోటల్ కోసమేనని స్పష్టమవుతోందని పలువురు భావిస్తున్నారు.

17న పరిశీలన: తీరంలో శాశ్వత కట్టడాలను కూల్చడానికి అయ్యే ఖర్చుతోపాటు, నిర్మాణాల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అధ్యయనం చేసేందుకు కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అధికారులతో నిపుణుల కమిటీతో అంచనా వేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నిపుణులు కమిటీలో అధికారి ఈనెల 17వ తేదీన పరిశీలించే అవకాశం ఉంది. పర్యావరణానికి జరిగిన నష్టం అంచనా వేసి కోర్టుకు చెప్పాల్సి ఉండటంతో కేసు వాయిదాకు ముందే ఈ తనిఖీ పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులకు కోర్టు నిర్దేశం చేసింది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

# సొంతింటి కలకు కొండంత అండ

నక్కపల్లి : సొంత గూడు ఉండాలని ప్రతి కుటుంబం కోరుకుంటుంది. గడిచిన వైకాపా పాలనలో జగనన్న ఇళ్ల పేరిట ఆర్భాటంగా మొదలు పెట్టిన గృహ నిర్మాణాలకు సరైన సహకారం అందించక పోవడంతో అవన్నీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి నిర్మాణాలను కొనసాగించేలా తీపికబురు చెప్పింది. లబ్ధిదారుల్లో వెనుకబడిన వర్గాలకు అదనపు ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించింది. దీని ద్వారా అనకాపల్లి జిల్లాలో వేలాదిమందికి మేలు జరగనుంది.అయిదేళ్ల పాలనలో జిల్లాలో 61 వేలకు పైగా ఇళ్లను మంజూరు చేశారు. దీనికి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం రూ. 1.8 లక్షలు అమలు చేస్తూ, జగన్ పేరును ప్రచారం చేసుకున్నారు. కాగా ధరాభారం, ప్రోత్సాహం లేకపోవడంతో చాలామంది ఇళ్లను నిర్మించుకోలేక పోయారు. జగన్ అధికారం కోల్పోయేనాటికి అసలు ప్రారంభం కానివి, వివిధ స్థాయిల్లో ఆపేసినవి సుమారు 40 వేలకు వరకు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించి గడిచిన రెండు నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ పెట్టి చాలా ఇళ్లను పూర్తిచేయించగా, జిల్లాలో సుమారు 5500 వరకు ఉన్నాయి. ప్రస్తుతం మరో ఏడువేల ఇళ్లను పూర్తి చేయించే పనిలో ఉన్నారు. ఇవన్నీ పోనూ మిగిలిన వాటిలో దాదాపు బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల వారు ఎక్కువగా ఉండటంతో వీరందరికీ అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ క్రమంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, చేనేత వర్గాలకు అదనపు ఆర్థిక సాయం చేయనుంది. ఆ మేరకు జిల్లా పరిధిలో దాదాపు 26,800 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. ఇందులో ఓసీలు సుమారు 5800 మంది ఉన్నారు. ఇవి మినహాయిస్తే, దాదాపు 21 వేల మందికి మేలు జరగనుంది. ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం ఇలాంటి వివరాలను సేకరించే పనిలో పడింది.

**సాయం ఇలా..**

ఎస్సీ, బీసీ, చేనేతలకు: రూ. 50 వేలుఎస్టీలు: రూ. 75 వేలు
ఎస్టీల్లో బాగా వెనుకబడిన వారికి: రూ. లక్షజిల్లాలో ఇళ్ల పరిస్థితి ఇది
మొత్తం ఇళ్లు: 61,505పూర్తయినవి: 26,699ప్రారంభం కానివి: 17,559వివిధ దశల్లో నిలిచినవి: 17,247

**సద్వినియోగం చేసుకోండి**

అదనపు ఆర్థిక సహాయం వినియోగించుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 17,749 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు చెందిన 13,548 మంది లబ్ధిదారులకు రూ.70.04 కోట్ల అదనపు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. జిల్లాలో మే చివరినాటికి 13,687 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకున్నామన్నారు.

# కార్మిక లెక్కల్లో మాయాజాలం



అనంతపురం : శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో గుత్తేదారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కార్మిక లెక్కలను మార్చేస్తూ నెలనెలా బిల్లులు కాజేస్తున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం నియోజకవర్గాలతో పాటు ట్రంకులైన్ పరిధిలో సుమారు 130 మంది కార్మికులను అధికంగా చూపి సొమ్మును జేబుల్లో నింపుకొంటున్నారు. ప్రతినెలా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పక్కదారి పట్టిస్తున్నారు. మూడు, నాలుగేళ్లుగా గుత్తేదారులు అక్రమాలకు పాల్పడుతున్నారని కార్మిక సంఘాలు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో కొన్ని అక్రమాలు నిజమే అని తేలినా కనీస చర్యలు లేకపోవడం గమనార్హం.

మడకశిర నియోజకవర్గం పరిధిలో 172 మంది పని చేస్తున్నట్లు రికార్డులో నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్నది 110 మంది. అంటే 62 మందిని ఎక్కువగా చూపి బిల్లులు డ్రా చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలోనూ సదరు గుత్తేదారు 220 మంది ఉన్నట్లు అవినీతికి తెరలేపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం పరిధిలో 2023కు ముందు 110 మంది కార్మికులకుగాను 173 మందిని చూపించి బిల్లులు కాజేశారు. రాయదుర్గం పరిధిలో 70 మందికి 110 మంది ఉన్నట్లు చూపించి అవినీతికి పాల్పడ్డారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 180 మందికి మించి పని చేయడం లేదు.

హిందూపురం పరిధిలో 40 మందిగాను రికార్డుల్లో 63 మందిని చూపిస్తున్నారు.

**కూటమి ప్రభుత్వంలోనూ వారిదే హవా**

గత వైకాపా ప్రభుత్వంలో టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులే ఇప్పటికీ పని చేస్తున్నారు. వారికి గడువు గతేడాది ఏప్రిల్‌కే ముగిసింది. కొత్తగా టెండర్లు పిలవకుండా వారినే కొనసాగిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సదరు గుత్తేదారులకు అనుకూలంగా పని చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కార్మికులకు జీతాల్లో కోత విధించి చెల్లిస్తున్నా.. 25 నెలలుగా పీఎఫ్ జమచేయకపోయినా చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా కార్మికులు తరచూ సమ్మెలోకి వెళుతుండటంతో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**నాలుగేళ్లుగా..**

తాగునీటి పథకం కింద 588 మంది కార్మికులు ఉన్నట్లు ప్రస్తుతం అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఏడాది కిందట 700 పైగానే ఉండేది. పథకం నిర్వహణ చూస్తున్న గుత్తేదారులు నాలుగేళ్లుగా కార్మికుల లెక్కను ఎక్కువగా చూపి బిల్లులు తీసుకుంటున్నారు. గతంలో మడకశిర పరిధిలోనే రూ.6 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు విచారణలో గుర్తించారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, ట్రంకులైన్ పరిధిలో రూ.9 కోట్ల వరకు అక్రమంగా బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మొత్తంగా రూ.15 కోట్ల వరకు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది

**క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తాం: వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం**శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటున్నాం. కార్మికుల సంఖ్యను ఎక్కువ చేసి చూపుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతాం. నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.జీతాలకు సంబంధించి పర్యవేక్షణ మా పరిధిలోనే ఉండేలా చర్యలు చేపడతాం.

# దత్తత.. భవితకు భరోసా



అనంతపురం : గుంతకల్లు బస్టాండులో 2023, ఆగస్టు 24న తొమ్మిది నెలల ఆడపిల్లను పడేశారు. కాలు వంకర పోయింది. ఛైల్డ్‌లైన్‌కు వచ్చిన సమాచారంతో స్థానిక ఐసీడీఎస్ యంత్రాంగం అనంత శిశుగృహకు చేర్చారు. రెండేళ్లపాటు శిశుగృహలోనే చిన్నారి పెరిగింది. వంకర పోయిన కాలుకు ఆర్డీటీ సహకారంతో శస్త్రచికిత్స చేయించారు. 'కారా' సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఈనెల 3న ఆమెరికాలోని మేరీల్యాండ్ నగరానికి చెందిన దంపతులు చిన్నారిని దత్తతకు తీసుకొన్నారు.కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రాంతానికి చెందిన ఓ తండ్రి స్వయంగా తన ఆడబిడ్డను శిశుగృహ కేంద్రానికి అప్పగించాడు. ప్రసవ సమయంలోనే తల్లి మృత్యువాత పడింది. అప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడో కాన్పు కింద పుట్టిన ఆడపిల్లకు రెండు కాళ్లూ వంకర పోయాయి. ప్రస్తుతం శిశుగృహ సంరక్షణలో ఉంది.ఆడపిల్ల అనో.. వివాహేతర సంబంధమో.. పేదరికంతో పోషించాలేకనో.. ఇలా కారణం ఏదైనా కావచ్చు.. ప్రసవించిన రోజునే చెత్తకుండీ.. ముళ్లకంపల్లో.. డ్రైనేజీ కాలువల్లో నిర్ధాక్షణ్యంగా పడేస్తున్నారు. మానవత్వాన్ని మరిచి.. కన్నపేగును తెచ్చుకున్న తల్లులు ఎందరో కన్నబిడ్డలను కాలదన్నుతున్నారు. అవయవాల లోపాలతో జన్మించే బిడ్డలను స్వయంగా తల్లిదండ్రులే గుట్టుచప్పుడు కాకుండా సంరక్షణ కేంద్రాలకు అప్పగిస్తున్నారు. కన్నావారు ఉన్నా అనాథలుగా పెరిగే దయనీయ దుస్థితి. ఇలాంటి వారికి అనంత ఐసీడీఎస్ అనుబంధగా ఉన్న 'శిశుగృహ' కొండంత అండగా భరోసా కల్పిస్తోంది. 'నేనున్నానంటూ'.. అక్కున చేర్చుకుంటోంది. పిల్లల కోసం పరితపించే దంపతులకు 'దత్తత' ఇస్తోంది. ఒత్తిడి.. ఇతరాత్ర కారణాలతో పిల్లలు పుట్టలేని దంపతులు దత్తత వైపుమొగ్గు చూపే వారి సంఖ్య నానాటికి పెరుగుతోంది. కేంద్ర మానవ వనరుల దత్తత సంస్థ(కారా) సారథ్యంలోనే ప్రక్రియ కొనసాగుతోంది.

**ఎక్కువగా ఆడపిల్లలే..**

గడిచిన మూడేళ్లలో శిశుగృహ నుంచే 24 మంది పిల్లలను దత్తతకు ఇవ్వడం విశేషం. ఇందులో ఎక్కువగా 15 మంది ఆడపిల్లలు ఉన్నారు. తక్కిన తొమ్మిది మంది మగ పిల్లలు. దత్తత తీసుకునే దంపతులు సైతం ఆడపిల్లల వైపే మొగ్గు చూపిస్తుండటం శుభపరిణామం. ఎక్కువగా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన దంపతులే ఎంపిక చేసుకున్నారు. మూడేళ్లల్లో ఆమెరికా, న్యూజిలాండ్ తదితర దేశాలకు పిల్లలను తీసుకెళ్లారు. ఏటా కనీసం పది మంది శిశువులను అనాథలుగా పడేస్తున్నారు.

**పెండింగ్‌లో 150 దరఖాస్తులు**

'కారా' సంస్థలోనే దత్తత కోసం దరఖాస్తు చేసుకోవాలి. సీనియార్టీ ప్రాతిపదికన దత్తతకు ఇవ్వనున్నారు. క్షేత్ర స్థాయిలో ఆర్థిక, సామాజిక, ఇతరాత్ర కోణాల్లో నిశిత పరిశీలన తర్వాతే దత్తతకు ఆమోదం కల్పిస్తారు. రాష్ట్రంలో దాదాపు 150 మందికిపైగా దంపతులు నిరీక్షణ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సహకారంతో పిల్లల సంరక్షణ, దత్తత ప్రక్రియ ఉంటుందని శిశుగృహ మేనేజర్ దీప్తి తెలిపారు.

# గ్రామీణ రహదారులకు మహర్దశ

ధర్మవరం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గోతులపడిన రహదారులపై ప్రయాణించి పలువురు ప్రమాదాలబారిన పడ్డారు. కొందరు ప్రాణాలొదిలారు. అధ్వానంగా తయారైన రహదారులకు మరమ్మతులు చేయాలని కోరుతూ అప్పటి ప్రతిపక్షాలు రోడ్డెక్కి ఆందోళనలు చేసి నా ప్రభుత్వం స్పందించలేదు. దీంతో ఐదేళ్ల కాలంలో గ్రామాల రోడ్లపై ప్రశాంతంగా ప్రయాణించలేని దుస్థితి నెలకొంది. అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఎన్నికల్లోనూ హామీ ఇచ్చారు. ఆ హామీ నిలబెట్టేకునేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిగా దెబ్బతిన్న దారులకు నాబార్డు ద్వారా ఆర్ఐడీఎఫ్ (రూరల్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఫండ్) పథకం కింద పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో పనులు జరిగేలా అనుమతులిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లాలోని 18 రహదారుల మరమ్మతులకు భారీగా నిధులు మంజూరు చేశారు. దీంతో ఇన్నాళ్లు ప్రయాణం నరకంగా మారిన పల్లె దారులు కొత్త రూపును సంతరించుకుంటుండటంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**65.14 కి.మీ దారులకు రూ.25.18 కోట్లు** జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల్లోని 65.14 కి.మీ.ల రహదారుల అభివృద్ధికి రూ.25.18 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో గోతులను పూడ్చి వేయడం, తారులేసి కంకర తేలిన దారులకు కొత్తగా తారువేదయం, మలుపులను నియంత్రించడం తదితర పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 9 నుంచి పనులకు టెండర్లు ఆహ్వానించింది. గుత్తేదారులు 9 నెల్లలో పనులు పూర్తి చేయాలని గడువు విధించింది.పనులను సకాలంలో పూర్తి చేస్తాంతిరుమలరెడ్డి, డీఈ, పంచాయతీరాజ్ (ప్రాజెక్టు) గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు మంజురయ్యాయి.


# కన్నీరై'నది'

శ్రీకాళహస్తి : అక్రమార్కులు కబ్జా చేసి భారీ సౌధాలు నిర్మిస్తున్నారు. పరీవాహక ప్రాంతాల్లో ఇసుక దోచేస్తుండటంతో నదీమతల్లి కన్నీరు పెడుతోంది. నదులు సహజత్వాన్ని కోల్పోతున్నాయి. పంటలను సస్యశ్యామలం చేయాల్సిన జలాలు జనావాసాలను ముంచెతుతున్నాయి. ఏటా మార్చి 14న నదుల పరిరక్షణ కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని నదులు సాగుకు ఉపయోగపడుతున్న తీరు, పెరుగుతున్న ఆక్రమణలు, ఇప్పటివరకు తలెత్తిన నష్టంపై కథనం.

**4 లక్షల ఎకరాలకు నీరు అందిస్తూ** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కుశస్థలి, స్వర్ణముఖి, నీవా, కౌండిన్య, గార్గేయ, బాహుదా నదులు ప్రవహిస్తున్నాయి. సోమల, ఐరాల, గంగా ధరనెల్లూరు, చిత్తూరు, నగరి మండలాల్లో పెద్దగా ఇక్కట్లు తలెత్తడం లేదు. నదుల ద్వారా ఏటా సుమారు 4 లక్షల ఎకరాలు సాగవు తున్నాయి.

**కుశస్థలి కింద లక్ష ఎకరాలు**

జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గంలోని మండలాల్లో సుమారు 50



కిలోమీటర్లు కుశస్థలి నది ప్రవహిస్తుంది. ఈ నది కార్వేటినగరంలోని కృష్ణాపురం రిజర్వాయర్ వద్ద చిన్న కాలువగా మొదలై ఏపీ, తమిళనాడు ప్రాంతాల్లో ఏటా వర్షాకాలంలో ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. ఏటా ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ నదిపై 1972లో అప్పటి ఎమ్మెల్యే కిలారి గోపాలనాయుడు బుగ్గ ప్రాజెక్టు చేపట్టారు. దీని ద్వారా నగరి, నింద్ర విజయపురం, పిచ్చాటూరు మండలాల్లో సుమారు 40 చెరువులు ఏటా నింపుతున్నారు. దీని కింద లక్ష ఎకరాలు సాగవుతాయి. 1999లో కుడి, ఎడమ కాలువలు, చెక్‌డ్యామ్‌లు కట్టారు. ప్రస్తుతం చెక్‌డ్యామ్ కొట్టుకుపోయింది. దాన్ని నిర్మిస్తే మరింత ప్రయోజనం ఉంటుంది. ఇసుక అక్రమార్కులకు నది వరంగా మారింది.

ఐరాల, పూతలపట్టులలో ప్రవహించే గార్గేయ నది కలవగుంటకు చేరుతుంది. అక్కడి నుంచి చిత్తూరుకు తాగునీరు అందిస్తున్నారు. ఈ నది సుమారు 20 కి.మీ ప్రవహిస్తుంది. ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

**కౌండిన్యపై 11 చెక్‌డ్యామ్‌లు దెబ్బతిన్నా..**

పెద్దపంజాణి, పలమనేరు ప్రాంత రైతులకు వరప్రసాదినిగా ఉన్న కౌండిన్య ప్రాజెక్టు కింద సమృద్ధిగా వర్షాలు పడితే సుమారు 70 వేల ఎకరాలు సాగువుతుంది. గత ప్రభుత్వాల హయాంలో కౌండిన్య ప్రాజెక్టుపై 11 చెక్‌డ్యామ్‌లు నిర్మించి నీటిని నిలువరించారు. ఇసుక అక్రమార్కులు ధ్వంసం చేయడంతో వర్షపు నీరంతా తమిళనాడుకు వెళుతోంది. కల్వర్టులు బాగు చేయాలని కోరినా ప్రజాప్రతినిధుల చెవికెక్కడం లేదు. చెక్‌డ్యామ్‌లు మరమ్మతులు చేపడితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఒకప్పుడు మంచి నీరు ప్రవహించే నీవా నదిలో ఇప్పుడు మురుగు పారుతోంది. చిత్తూరులోని తోటపాళ్యం, వీరభద్ర కాలనీ, రంగాచారి వీధి వెనుక భాగం, సంతపేట, రిక్షా కాలనీ, దొడ్డిపల్లి ప్రాంతాలు నీట మునుగుతున్నాయి.

సోమల మండలంలోని గార్గేయ నది పరీవాహక ప్రాంతమంతా ఆక్రమణకు గురైంది. వర్షాకాలంలో ఇబ్బందులే. ఈ నదులపై చెక్‌డ్యాంలు నిర్మించడం ద్వారా నీటి నిల్వలు పెంచుకోవచ్చు.

# అంటకాగి అక్రమాలు

అనంతపురం : పేదలకు ఇళ్లు నిర్మించి వారికి అండగా నిలవాల్సిన కొందరు ఇంటి దొంగలుగా మారుతున్నారు. గత వైకాపా హయాంలో వైకాపా నేతలతో అంటకాగి సిమెంటు, స్టీలు, ఇసుకను నేతల సొంతానికి ఇవ్వడంతో పాటు అధికారులు అక్రమార్గంలో నడిచారు. ఇప్పటికే పలువురు అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు మరికొందరిపై ఛార్జి మెమోలు ఇచ్చి విచారణ చేయిస్తున్నారు. ప్రధానంగా రాప్తాడు నియోజకవర్గంలోనే ఎక్కువగా అక్రమాలు సాగినట్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలుగులోకి వచ్చాయి. అయినా కొందరు గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల్లో మార్పు రాలేదు. తాజాగా రాయదుర్గంలో టన్నుల కొద్దీ ఉక్కు మాయం అయినట్లు వెలుగులోకి వచ్చింది. మళ్లీ గోదాములో ఉంచి దాన్ని తొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.


**15 టన్నులు..**జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను బట్టి గృహనిర్మాణ సంస్థ గోదాముల్లో స్టీలు ఉంచుతారు. రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి అక్కడే గోదాములో నిల్వ ఉంచారు. నిల్వ ఉన్న దానికి




ఇళ్ల నిర్మాణాలకు వినియోగానికి భారీగా వ్యత్యాసం ఉన్నట్లు అనుమానం రావడంతో ఆ శాఖకు చెందిన అధికారులు పరిశీలించి నిజమేనని తేల్చారు. అంతర్గతంగా మరో డివిజన్ స్థాయి అధికారిని విచారణ అధికారిగా నియమించారు. సదరు అధికారితోపాటు స్థానికంగా సిబ్బందితో స్టీలు లెక్కగట్టారు. తక్కువగా ఉన్నట్లు తేలినా చర్యలకు వెనుకాడుతున్నారు. మొత్తంగా 15 టన్నులు మాయం అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే స్టీలు నాణ్యతను బట్టి టన్ను రూ.65 వేల నుంచి రూ.70 వేల వరకు ఉంది. ఈ లెక్కన రాయదుర్గంలోనే రూ.10 లక్షల విలువైన స్టీలు మాయం చేసి విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం.

## మొన్న అలియా భట్.. ఇప్పుడు త్రిష..

నాలుగు పదుల వయసులో కూడా త్రిష చేతినిండా సినిమాలతో కెరీర్లో దూసుకెళ్తుంది. రీసెంట్ గా గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీతో సూపర్ హిట్ ను తన అకౌంట్ లో వేసుకున్న త్రిష సుమారు రెండు దశాబ్దాలుగా సినీ రంగంలో సత్తా చాటుతుంది. మధ్యలో కెరీర్ కు బ్రేక్ వచ్చినప్పటికీ పొన్నియన్ సెల్వన్ తర్వాత అమ్మడి క్రేజ్ పెరిగింది. దీంతో సెకండ్ ఇన్నింగ్స్ లో కూడా త్రిషకు మంచి ఆఫర్లు దక్కుతున్నాయి. తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో అనేక సినిమాల్లో నటించిన త్రిష చేతిలో ప్రస్తుతం థగ్ లైఫ్, విశ్వంభర సినిమాలున్నాయి. కమల్ హాసన్ సరసన మణిరత్నం దర్శకత్వంలో త్రిష నటించిన థగ్ లైఫ్ సినిమా రిలీజ్ కు రెడీ అయింది. జూన్ 5న థగ్ లైఫ్ ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా పలు ఈవెంట్స్ లో పాల్గొంటున్న త్రిష కొన్ని ఇంట్రెస్టింగ్



విషయాలను షేర్ చేసుకుంటుంది. మలయాళీ నటుడు ఫహాద్ ఫాజిల్ అంటే తనకు ఇష్టమని, ఆయనతో కలిసి నటించడం తనకు చాలా ఇష్టమని చెప్పుకొచ్చింది. మీరు ఎవరితో నటించాలనుకుంటున్నారని రీసెంట్ గా ఓ సందర్భంలో త్రిషను అడగ్గా అమ్మడు ఫహాద్ ఫాజిల్ పేరు చెప్పింది. ఫహాద్ ఫాజిల్ తో నటించాలనుంది. అతనెలాంటి కథనైనా, ఎలాంటి క్యారెక్టర్లో అయినా అద్భుతంగా నటించగలడు. అతను చాలా అద్భుతమైన నటుడు అని మనసులోని మాటను బయటపెట్టింది త్రిష. త్రిష చెప్పినట్టు ఫహాద్ చాలా గొప్ప నటుడు. ఎలాంటి పాత్రనైనా, ఎలాంటి సినిమానైనా చేయగల కెపాసిటీ ఉన్న యాక్టర్. మొన్నటికి మొన్న అలియా భట్ కూడా ఫహాద్ అంటే ఇష్టమని, కచ్చితంగా అవకాశం వస్తే అతనితో కలిసి నటించడానికి రెడీగా ఉ న్నానని చెప్పింది. ఇప్పుడు త్రిష కూడా ఫహాద్ అంటే ఇష్టమని, తనతో కలిసి నటించాలనుందని తెలిపింది.

ఇక థగ్ లైఫ్ విషయానికొస్తే ఈ సినిమా నాయగన్ ను మించి ఉంటుందని చిత్ర యూనిట్ మొత్తం ఎంతో గొప్పగా చెప్తుంది. దీంతో పాటూ త్రిష, చిరంజీవితో చేస్తున్న విశ్వంభర సినిమాపై కూడా అందరిక మంచి అంచనాలున్నాయి.

## కల్పిక, పబ్ మేనేజ్మెంట్ మధ్య లొల్లి.. పోలీసులు ఏమన్నారంటే?

టాలీవుడ్ నటి కల్పిక రీసెంట్ గా వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. కల్పిక ఇటీవల తన పుట్టినరోజు సందర్భంగా తన ఫ్రెండ్స్ తో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ప్రిజం పబ్ కు వెళ్లగా.. అక్కడ నిర్వాహకులకు, ఆమెకు మధ్య గొడవ జరిగింది. అందుకు సంబంధించిన వీడియోను ఆమెనే స్వయంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. కల్పిక పోస్ట్ చేసిన వీడియో ప్రకారం, తన స్నేహితులతో కలిసి పుట్టినరోజు వేడుకలకు గాను ప్రిజం పబ్ కు వెళ్ళింది. అక్కడ బర్త్ డే కేక్ ను తీసుకురావడం గురించి పబ్ సిబ్బంది, కల్పిక మధ్య వాగ్వాదం జరిగింది. ఆ వీడియోను పోస్ట్ చేసి.. పబ్బ సిబ్బంది తనతో దురుసుగా ప్రవర్తించారని, బుతాలు తిట్టారని ఆమె ఆరోపించింది. ఆ సమయంలో తనను డ్రగ్గిస్ట్ అంటూ అవమానించారని ఆరోపణలు చేసింది కల్పిక. తన గౌరవం దెబ్బతిందని, మానసికంగా సైతం వేదన చెందినట్టు సోషల్ మీడియాలో తెలిపింది. ఆ తర్వాత పబ్ మేనేజ్మెంట్ పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పిన కల్పిక.. వాళ్లు కూడా అలాగే ప్రవర్తించారని కల్పిక ఆరోపించింది. కానీ పోలీసులు మాత్రం



తాము కల్పిక నుంచి ఫిర్యాదు అందుకున్నట్లు, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తానికి కల్పిక, పబ్ మేనేజ్మెంట్ మధ్య ఘర్షణ మాత్రం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అవుతున్నారు. జోరుగా ఆ విషయం కోసం డిస్కస్ చేసుకుంటున్నారు. కాగా కల్పిక విషయానికొస్తే.. 2009లో తన యాక్టింగ్ కెరీర్ ను స్టార్ట్ చేసింది. రామ్ చరణ్ ఆరెంజ్ సినిమాలో జెనీలియా స్నేహితురాలిగా నటించి ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చిన అమ్మడు.. ఆ తర్వాత వరుస మూవీ ఛాన్సులు అందుకుని సత్తా చాటింది. ఇప్పటి వరకు ఎన్నో తెలుగు సినిమాల్లో నటించి మెప్పించింది కల్పిక. జులాయి, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, సారొచ్చారు, పడి పడి లేచే మనసు, హిట్ ఫస్ట్ కేస్, యశోద వంటి వివిధ సినిమాల్లో కనిపించింది. కొద్ది రోజులుగా ఆమెకు అవకాశాలు మాత్రం తగ్గాయి. అడపాదడపా సినిమాల్లో మాత్రమే యాక్ట్ చేస్తోంది. ఇప్పుడు పబ్ తో జరిగిన గొడవతో వార్తల్లో నిలిచింది.




## రానా నాయుడు సీజన్2 ట్రైలర్.. మేకర్స్ జాగ్రత్త పడ్డట్టే ఉన్నారు




దగ్గుబాటి వెంకటేష్, రానా ప్రధాన పాత్రల్లో రూపొందిన వెబ్ సిరీస్ రానా నాయుడు ఎంత పెద్ద సక్సెస్ అయిందో తెలిసిందే. ఈ సిరీస్ లో బోల్డ్ కంటెంట్ ఎక్కువైందనే కామెంట్స్ వినిపించినా ఆడియన్స్ మాత్రం ఈ సిరీస్ ను విపరీతంగా ఆదరించారు. దీంతో రానా నాయుడు సిరీస్ కు సీక్వెల్ గా రానా నాయుడు సీజన్2 ను తెరకెక్కించి దాన్ని రిలీజ్ కు రెడీ చేశారు.

రానా నాయుడు సీజన్2 మొదటి సీజన్ ను మరిపిస్తుందని, ఈసారి యాక్షన్, డ్రామా ఎక్కువగా ఉండనుందని ఇప్పటికే వెంకటేష్ వెల్లడించాడు. రానా నాయుడు సీజన్2 జూన్ 13 నుంచి నెట్ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సీజన్ అందుబాటులోకి రానుండగా రీసెంట్ గా నెట్ఫ్లిక్స్ రానా నాయుడు సీజన్2 ట్రైలర్ ను రిలీజ్ చేసింది. మొదటి పార్ట్ లో బోల్డ్ కంటెంట్ ఎక్కువగా ఉందని విమర్శలు వచ్చిన నేపథ్యంలో రానా నాయుడు2 లో దాన్ని కాస్త తగ్గించినట్టు అనిపిస్తుంది. అంతేకాదు, తొలి సీజన్ కు మించిన వినోదం, థ్రిల్ కూడా ఈ సీజన్ లో ఉండనున్నాయని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. నాగ నాయుడిగా వెంకటేష్ తన కుటుంబం కోసం ఎంత వరకైనా వెళ్లే వాడిగా అద్భుతమైన నటనను కనబరిచాడు.

కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ వర్మ, అభయ్ చోప్రా సంయుక్తంగా దర్శకత్వం వహించిన రానా నాయుడు సీజన్2 ను సుందర్ ఆరోన్, లోకోమోటివ్ గ్లోబల్ నిర్మించాయి. అర్జున్ రాంపాల్, సుర్వీన్ చావ్లా, కృతి కర్బంద, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, డినోమోరియా ఈ సిరీస్ లో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాలో వెంకటేష్ కు కొడుకుగా రానా కనిపించనున్నాడు. ట్రైలర్ చూస్తుంటే మొదటి సీజన్ లో చేసిన పొరపాట్లను దృష్టిలో పెట్టుకుని ఈసారి టీమ్ కాస్త జాగ్రత్త పడినట్టు అనిపిస్తుంది.

## ఆంధ్రా కింగ్ తో రఫ్ఫాడించే ప్లాన్..?



ఉస్తాద్ రామ్ మహేష్ కాంబినేషన్ లో వస్తున్న ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా రిలీజ్ కు రెడీ అవుతుంది. ఈమధ్యనే వచ్చిన టీజర్ ఇంప్రెస్ చేయగా రామ్ ఎనర్జీ సినిమాతో పక్కా సూపర్ హిట్ కొట్టేస్తాం అన్నట్టుగా ఉంది. రామ్ డబుల్ ఇస్మార్ట్ తర్వాత పూర్తిగా చేంజ్ ఓవర్ అయ్యి చేస్తున్న సినిమా ఆంధ్రా కింగ్ తాలూకా. టైటిల్ కూడా బాగా బజ్ క్రియేట్ అయ్యేలా చేసింది. ఈ సినిమాలో హీరోయిన్ గా భాగ్య శ్రీ బోర్స్ నటిస్తుంది. ఒక్క హిట్టు కూడా పడకుండానే భాగ్య శ్రీకి అప్పుడే సూపర్ ఫ్యాన్ బేస్ ఏర్పడింది.

రామ్, భాగ్య శ్రీ లవ్ స్టోరీ ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాలోనే హైలెట్ అయ్యే అంశాల్లో ఒకటని అంటున్నారు. భాగ్య శ్రీ కూడా ఈ సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకుంది. ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాలో కన్నడ స్టార్ ఉపేంద్ర కూడా నటిస్తున్నాడు. తెలుగులో ఉపేంద్ర నటించే సినిమాలకు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. ఆయన ఎలాంటి సినిమా చేసిన ఆడియన్స్ లో ఒక ఇంట్రెస్ట్ క్రియేట్ అవుతుంది. ఉపేంద్ర తెలుగులో సన్నా సత్యమూర్తి తర్వాత చేస్తున్న సినిమా ఈ ఆంధ్రా కింగ్ తాలూకా. ఐతే ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ అదిరిపోయేలా వచ్చిందని టాక్. సినిమా తప్పకుండా రఫ్ఫాడించేలా ఉంటుందని అంటున్నారు. రామ్ ఫ్యాన్స్ కోరుకునే ఎనర్జిటిక్ హిట్ బొమ్మగా ఆంధ్రా కింగ్ తాలూకా అవుతుందని అంటున్నారు. యూత్ ఫుల్ స్టోరీ విత్ లవ్ మిక్స్ చేసి యాక్షన్ ని కూడా దట్టించి వదులుతున్నారట. సో మహేష్ పి ఈసారి రామ్ ఫ్యాన్స్ కి ఫుల్ మీల్స్ పెట్టేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తుంది. రామ్ కూడా ఈ సినిమా అవుట్ పుట్ మీద సూపర్ హ్యాపీగా ఉన్నట్టు తెలుస్తుంది. రాం ఈ సినిమా కోసం పూర్తిస్థాయి మేకోవర్ అయ్యాడు. యంగ్ లుక్ లో రామ్ పదేళ్లు వెనక్కి వెళ్లాడని చెబితే అతిశయోక్తి కాదన్నట్టుగా ఉంటుందట. మరి రామ్ ఆంధ్రా కింగ్ తాలూకా ఆంధ్రా తెలంగాణా ప్రేక్షకులను ఏమేరకు మెప్పిస్తుందో చూడాలి. రామ్ లాంటి ఎనర్జీ ఉన్న హీరోకి హిట్లు పడితేనే ఇంకా మంచి మంచి స్టోరీస్ చేసే ఛాన్స్ ఉంటుంది. ఆంధ్రా కింగ్ రామ్ కి కొత్త జోష్ ఇస్తుందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు.

## అనుష్కని మళ్లీ అలా చూడాలని.. ఫ్యాన్స్ కోరిక ఫలిస్తుందా..?


సౌత్ స్టార్ హీరోయిన్ అనుష్క రేంజ్ ఏంటన్నది అందరికీ తెలిసిందే. సూపర్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన అనుష్క అప్పటి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ స్టార్ రేసులో నిలిచింది. మిగతా హీరోయిన్స్ లా కేవలం గ్లామర్ రోల్స్ మాత్రమే అన్నట్టు కాకుండా డిఫరెంట్ కథలు ఎంపిక చేసుకుంటూ హీరోయిన్ గా తనకంటూ ఒక స్పెషల్ క్రేజ్ ఏర్పరచుకుంది అమ్మడు. అనుష్క నటించిన అరుంధతి సినిమా సూపర్ డూపర్ హిట్ అయ్యింది. అప్పటి నుంచి అనుష్క కేవలం కమర్షియల్ సినిమాలనే కాకుండా లేడీ ఓరియెంటెడ్ సినిమాలను చేస్తూ వచ్చింది. అరుంధతి ఇచ్చిన ప్రోత్సాహంతో అనుష్క అదే వరుసలో రుద్రమదేవి, భాగమతి, నిశ్శబ్దం ఇలా ప్రత్యేకమైన సినిమాలు చేసింది. వాటిలో మాక్సిమం మంచి సక్సెస్ అందుకున్నాయి. ఇక బాహుబలి ప్రభాస్ కి సరి జోడీగా దేవసేన పాత్రలో అనుష్క తప్ప మరెవరిని ఊహించుకోవడం కష్టం. అలా రాజకుమారి పాత్రలో



నటించి మెప్పించింది అనుష్క. ఐతే అనుష్క ఈమధ్య పూర్తిగా సినిమాలకు దూరం అవుతూ వచ్చింది. నిశ్శబ్దం తర్వాత అమ్మడు మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా చేసింది. ఆ తర్వాత అయినా స్పీడ్ పెంచుతుంది అనుకుంటే మళ్లీ కాస్త గ్యాప్ ఇచ్చింది. ప్రస్తుతం క్రిష్ డైరెక్షన్ లో ఘాటి సినిమాతో వస్తుంది అనుష్క. ఐతే అనుష్కని మళ్లీ కమర్షియల్ సినిమాల్లో చూడాలని ఆమె ఫ్యాన్స్ కోరుతున్నారు. స్టార్ సినిమాల్లో అనుష్క గ్లామర్ రోల్స్ చేస్తే చూసి ఆనందించాలని అనుకుంటున్నారు. ఐతే అది కుదిరే పనిలా కనిపించట్లేదు. అనుష్క సినిమాలనే చేయాలా వద్దా అన్నట్టుగా చేస్తుంది. అలాంటిది ఆమె కమర్షియల్ సినిమాల్లో ఆశించడం తప్పే అవుతుంది. అనుష్క కూడా పూర్తిగా సినిమాలను వదిలేయలేక అలా అని మళ్లీ ఇదివరకులా వరుస ప్రాజెక్ట్ లు ఓకే చేయలేక కన్ ఫ్యూజన్ లో ఉంది. కెరీర్ కి ఎండ్ కార్డ్ వేయాలని చూసినా సినిమాల మీద ఆమె పెంచుకున్న ప్రేమ మళ్లీ మళ్లీ సినిమాలను చేసేలా చేస్తుందని తెలుస్తుంది. ఘాటితో తిరిగి ఫాంలోకి రావాలని చూస్తున్న అనుష్క గ్లామర్ రోల్స్ చేసినా చేయకపోయినా వరుస సినిమాలు చేస్తే చాలని అనుకుంటున్నారు ఆమె ఫ్యాన్స్. కనీసం ఫ్యాన్స్ కోసమైనా అనుష్క తిరిగి స్టార్ సినిమాలు చేస్తుందా అన్న టాక్ వినిపిస్తుంది. ఐతే అదంతా ఆమె ఓన్ డెసిషన్ మీద ఆధారపడి ఉంటుందని చెప్పొచ్చు.

## కంచె బ్యూటీ ప్రగ్య స్టన్నింగ్ లుక్

టాలీవుడ్, బాలీవుడ్ లో కథానాయికగా ఉనికిని చాటుకునేందుకు చాలా కాలంగా ప్రయత్నిస్తోంది ప్రగ్య జైశ్వాల్. నేటితరం (జెన్ జెడ్) కథానాయికల నుంచి పోటీని ఎదుర్కొనేందుకు ఈ భామ నిరంతర సాధన, హార్డ్ వర్క్ ఆసక్తిని కలిగిస్తున్నాయి. జిమ్ లో పర్ఫెక్ట్ గా కసరత్తులు చేస్తూ, యోగా సాధన చేస్తూ పరిశ్రమలో ఫిటెస్ట్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా సోషల్ మీడియాల్లో తన ఫాలోవర్స్ కి అలుపన్నదే లేకుండా ఫోటో ట్రీట్ ఇస్తూనే ఉంది. తాజాగా ప్రగ్య షేర్ చేసిన ఓ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో గుబులు పెంచుతోంది. ప్రగ్య అందమైన మినీ ఫ్రాక్ లో థై అందాలను



ప్రదర్శిస్తూ, రిసార్ట్ పార్టీలో చిల్ చేస్తూ కనిపించింది. బ్లాక్ కలర్ ఫ్రాక్ టాప్ లెస్ అందాలను ఆవిష్కరించడమే గాక, బాటమ్ లో థై సొగసుల్ని ఆవిష్కరిస్తోంది. కొందరు స్నేహితులతో కలిసి ఈ ట్రిప్ ని చాలా ప్రత్యేకంగా మార్చుకుంది ఈ ముంబై బ్యూటీ.

ప్రగ్య ధైర్యంగా, అధునాతనంగా, వంద శాతం ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. ఈ బ్యూటీ పర్సనల్ ఫ్యామిలీ పార్టీలోను స్పెషల్ లుక్ తో కనిపించింది. ప్రస్తుతం అఖండ 2, టైసన్ నాయుడు చిత్రీకరణలో ప్రగ్య బిజీగా ఉంది. ఈ రెండు ప్రాజెక్టులతో తిరిగి టాలీవుడ్ లో బిగ్ కంబ్యాక్ కోసం ప్రయత్నిస్తోంది. ఆట ఇంకా అయిపోలేదు.. ఇప్పుడే మొదలైందని ప్రగ్య నిరూపిస్తుందేమో చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536